ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ f : fb.com/vaartha

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

27-1-2025 సోమవారం సంపుటి: 30 సంచిక: 359 పేజీలు: 10+4 వెల: 6.50



ఆ 90 వేల మందిపై ట్రంప్ ప్రభుత్వం వేటు!
అవినీతి కేసులో రాజపక్ష కుమారుని అరెస్టు
5





ఆదివారం న్యూఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో గణతంత్ర దినోత్సవాల సందర్భంగా సైనిక పాటవ శకటాలను పరిశీలిస్తున్న ముఖ్య అతిథి ఇండోనేసియా అధ్యక్షుడైన ప్రబోవో సుబియాంటో, రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ తదితరులు

# అద్వితీయ సైనిక పాటవం

**గణతంత్ర దినోత్సవాలలో ఆకట్టుకున్న త్రివిధ దళాల కవాతులు**

**జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము**

**విశిష్ట అతిథిగా ఇండొనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో**

**వేడుకల్లో పాల్గొన్న ప్రధాని మోడీ, పలువురు కేంద్ర మంత్రులు**

**న్యూఢిల్లీ, జనవరి 26:** దేశవ్యాప్తంగా గణతంత్ర వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. స్వర్ణిమ్ భారత్; విరాసత్‌ఔర్ వికాస్ అనే థీమ్‌తో శకటాలను రూపొందించారు బ్రహ్మోస్, ఆకాశ్‌క్షిపణులు,పినాక మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్లుప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మిలిటరీ కవాతులో త్రివిధ దళాలు తమ సత్తా చాటాయి. కర్తవ్యపథ్‌లో 9 కిలోమీటర్లమేర ఈ కవాతు కొనసాగుతోంది. గణతంత్ర వేడుకల్లో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకకకు ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఆయన రాష్ట్రపతితో కలిసి ప్రత్యేక గుర్రపు బండిలో వేదికవద్దకు చేరుకున్నారు. అనంతరం సైనిక దళాలనుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ వేడుకల్లో ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌ఖడ్, ప్రధానిమోడీ పలువురు కేంద్ర

>>2

# రాజ్‌భవన్‌లో ఘనంగా 'ఎట్‌హోం'

## హాజరైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, సిఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు, 'పద్మ' గ్రహీతలు డా. డి. నాగేశ్వర్ రెడ్డి, కృష్ణమాదిగ తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి26:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్ భవన్‌లో ఆదివారం సాయంత్రం ఎట్ హోం కార్యక్రమం జరిగింది. పురప్రముఖులను ఆహ్వానించి వారందరికీ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తేనీటి విందు ఇచ్చారు. ఈ విందు కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు యాక్టింగ్ ప్రధాన న్యాయమూర్తి సుజోయ్ పాల్, కేంద్ర బొగ్గు గనుల మంత్రి జి కిషన్ రెడ్డి, కన్హా శాంతివనం వ్యవస్థాపకులు కమలేష్ డి పటేల్, రాష్ట్ర క్యాబినెట్ మంత్రులు పొన్నం ప్రభాకర్,ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్,బిజెపిలకు చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి,డిజిపి జితేందర్‌లతో పాటు ఇతర ఉన్నతాధికారులు, అనేక మంది రాష్ట్ర ప్రముఖులు హాజరయ్యారు. బిఆర్ఎస్ పార్టీ నుంచినేతలెవ్వరూ హాజరు కాలేదు. తేనేటీ విందు ప్రారంభానికిముందుగా,ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రతిభా పురస్కారాలు-2024కు ఎంపికైన సభ్యులకు గవర్నరు చేతుల మీదుగా అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. పర్యావరణ పరిరక్షణ,దివ్యాంగ జనసంక్షేమం, క్రీడలు,ఆటలు, సంస్కృతి అనే నాలుగుముఖ్యమైనరంగాల్లో వ్యక్తులు, సంస్థలు చేసిన అత్యుత్తమ కృషి,స్వచ్ఛంద సేవకు గుర్తింపుగా అవార్డులను ఇస్తారు. ఎంపికైన వారికి ప్రతి అవార్డుకు రూ.2లక్షల నగదు బహుమతి, జ్ఞాపిక,ప్రశంసా పత్రం అందజేశారు.

**గవర్నర్ ప్రతిభా పురస్కారాలు-2024 అవార్డులకు ఎంపికైన సభ్యుల వివరాలు:**

**ప్రత్యేక జీవితకాల సాఫల్య పురస్కారం:** 1. డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి, ఐ.ఎఫ్.ఎస్. (పర్యావరణ పరిరక్షణ) అవార్డు అందుకున్నారు.

**వ్యక్తిగత విభాగము:** 2.దుశర్ల సత్యనారాయణ (పర్యావరణ పరిరక్షణ)3. అరికపూడి రఘు (వికలాంగుల సంక్షేమం)4.జీవన్‌జీ దీప్తి (ఆటలు, క్రీడలు) 5.పి.బి. కృష్ణ భారతి (సంస్కృతి) 6.ప్రొఫెసర్ యం. పాండు రంగారావు (సంస్కృతి) అవార్డులు అందుకున్నారు.

**సంస్థాగత విభాగము:** 7.ధ్రువాంశ్ ఆర్గనైజేషన్ (పర్యావరణ పరిరక్షణ) 8.ఎల్.వి.ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ (వికలాంగుల సంక్షేమం) 9. ఆదిత్య మెహతా ఫౌండేషన్ (ఆటలు,క్రీడలు) 10. సంస్కృతి ఫౌండేషన్(సంస్కృతి) అవార్డులు అందుకున్నారు.

అవార్డుల కార్యక్రమం అనంతరం అవార్డు జ్యూరీ సభ్యులను గవర్నర్,సిఎం ప్రత్యేకంగా సన్మానించారు. తర్వాత గవర్నర్ ఆధ్వర్యంలో ఏర్పాటు తేనేటి విందులో పాల్గొన్నారు.



ఆదివారం రాజ్‌భవన్‌లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జరిగిన ఎట్‌హోంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులతో సిఎం రేవంత్, హైకోర్టు యాక్టింగ్ సిజె సుజోయ్ పాల్ తదితరులు


దావోస్ ఒప్పందాలతో ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్న రాష్ట్రం
పెరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
2


# పద్మ అవార్డులలో వివక్షపై ప్రధానికి లేఖరాస్తా

## ఓపెన్ వర్సిటీ విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 26:** దేశంలో మళ్లీ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలనే చర్చజరగడం దురదృష్టకరమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. యూజీసీ నిబంధనలు మార్చి రాష్ట్రాల పరిధి నుంచి యూనివర్సిటీలపై అధికారాలను తప్పించాలని కుట్రలు చేస్తున్నారని,విశ్వవిద్యాలయాలపై ఆధిపత్యం చెలాయించాలనే ఆలోచన వెనక ఒక పెద్ద కుట్ర ఉందని ఆరోపించారు. యూనివర్సిటీలపై ఆధిపత్యం కేంద్రం చేతుల్లోకి వెళితే కొంతమంది చేసే విష ప్రచారానికి యూనివర్సిటీలు వేదికలు కాబోతున్నాయని పేర్కొన్నారు. ప్రధాని మోదీకి ఈ వేదికగా విజ్ఞప్తి చేస్తున్నా, మీరు(కేంద్రం) యూజీసీ నిబంధనలు మార్చాలనుకోవడం రాజ్యాంగంపై దాడి చేయడమే ఇది రాష్ట్రాలపై సాంస్కృతిక దాడి

>>2

# రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న కాంగ్రెస్

## అంబేద్కర్ స్ఫూర్తితో పాలన అందిస్తున్న ప్రధాని మోడీ: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



ఆదివారం బిజెపి కార్యాలయంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 26 ప్రభాతవార్త:** దేశ ప్రజలకు ఈ గణతంత్ర దినోత్సవం ప్రత్యేకమైనది కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా జాతీయ పథకాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలుగు ప్రజలకు, తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌కి నివాళులర్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో గత పది సంవత్సరాలుగా అంబేద్కర్ స్ఫూర్తితో పాలన అందిస్తూ దేశ ప్రజలకు సేవలందిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ చేతిలో రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని తిరుగుతారు. కనీసం రాజ్యంగాన్ని చదివిన పాపానపోలేదు. రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ ఉంటారు. కాంగ్రెస్ పార్టీ నెహ్రూ హయాం నుంచి రాజ్యాంగాన్ని అవహేళన చేసి, పౌరహక్కులను అణచివేశారో రాహుల్ గాంధీకి అర్థం కాదన్నారు. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు అలహాబాద్ హైకోర్టు ఆమె ఎన్నికను చెల్లనిదిగా ప్రకటించి, పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేసింది. దీంతో రాజ్యాంగాన్ని కాలరాసి, అధికార దుర్వినియోగం చేసి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ పెట్టారన్నారు. మీసా చట్టం కింద అనేక మంది రాజకీయ నేతలను అన్యాయంగా అరెస్టు చేశారన్నారు. అటల్ బిహారీ వాజ్ పేయి, లాల్ కృష్ణ అద్వానీ, వెంకయ్యనాయుడు, ఆచార్య కృపలానీ లాంటి అనేక మంది నాయకులను జైలులో పెట్టారన్నారు. మీసా చట్టం కింద దేశాన్ని జైలుగా మార్చి పౌర హక్కులను కాలరాసి, పత్రికాస్వేచ్ఛను హరించి రాష్ట్రీయ స్వయంసేవక్ లాంటి సంస్థలను

>>2



హుస్సేన్ సాగర్‌లో రెండు బోట్లు అగ్నికి ఆహుతి.. పలువురికి గాయాలు

వార్త సిటీ పేజీలో

# అసెంబ్లీకి రాకపోతే పదవి ఎందుకు?


## 50 వేల పుస్తకాలు చదివిన మేధావి కెసిఆర్ పేదలకు రేషన్ కార్డు ఇవ్వలేకపోయారు..

## కాళేశ్వరం కూలినా 1.56 కోట్ల మె.ట ధాన్యం పండించాం

## సన్నవడ్లకు రూ. 500 బోనస్ ఇచ్చాం

## కోస్గి సభలో సిఎం రేవంత్

## అట్టహాసంగా నాలుగు పథకాలకు శ్రీకారం



ఆదివారం నారాయణపేట జిల్లా కోస్గిలో నాలుగు పథకాలను ప్రారంభించిన సిఎం రేవంత్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 26, ప్రభాతవార్త:** 13 నెలల్లో ఒక్క రోజైనా ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసెంబ్లీకి రాలేదనీ, ప్రతిపక్ష నాయకుడు అసెంబ్లీ రాకపోతే ఏమనాలి ఆయనకు బాధ్యత లేదా..? బాధ్యత లేకపోతే ఆయనకు పదవి ఎందుకు ..? అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు ల జారీ పథకాలను తాను ప్రాతినిథ్యం వహిస్తున్న నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండలం చంద్రవంచా గ్రామంలో ఆదివారం ముఖ్యమంత్రి

>>2





కోల్‌కతా గణతంత్ర దినోత్సవంలో రోబోడాగ్స్ ప్రదర్శన దృశ్యం

## గణతంత్రపేరేడ్‌లో 'రోబోడాగ్స్'

**కోల్‌కత్తా, జనవరి 26:** పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కత్తాలో ఆదివారం జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రోబోడాగ్స్ పేరేడ్‌ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బెంగాల్ గవర్నర్ సివి ఆనంద్‌బోస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. సీఎం మమతా బెనర్జీ ఇతర మంత్రులు ఈ వేడుకలకు హాజరయ్యారు. ఆర్మీ, నేవీ, వైమానికదళం, బెంగాల్ పోలీసులు, కోల్‌కత్తా పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్‌ఫోర్స్, విపత్తునిర్వహణ బ1ందాలు కవాతుచేసాయి. పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అయితే ఈపరేడ్‌లో ఆర్మీకి చెందిన రోబో శునకాలు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించాయి. మల్టీ యుటిలిటీ లెగ్డ్ ఎక్విప్‌మెంట్ (మ్యూల్)గా పేర్కొంటున్న రోబోటిక్ డాగ్‌కు సంజయ్‌గా నామకరణం చేసారు. ఈ రోబో డాగ్స్ మెట్లతోపాటు కొండలను నిటారుగా ఎక్కడంతోపాటు అడ్డంకులను సైతం దాటేస్తాయి. జీవనరసాయన అణుపదార్థాలను పసిగట్టే సెన్సార్లు కలిగి ఉన్న ఈ రోబో డాగ్స్ నిఘాతో పాటు బాంబులను గుర్తించి వాటిని నిర్వీర్యం చేయడం వంటి సేవలకోసం ఆర్మీ ఇపుడు వినియోగిస్తోంది. 15 కిలోల బరువును కూడా ఈ డాగ్స్ మోస్తాయి. అలాగే 40 డిగ్రీలనుంచి 55 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల్లో కూడా పనిచేస్తాయి. ఆర్మీలోని వివిధ యూనిట్లలో సుమారు వందవరకూ రోబో డాగ్స్ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## అద్వితీయ సైనిక పాటవం

>> మంత్రులు పాల్గొన్నారు. 300 మంది కళాకారుల బృందం వివిధ రకాల దేశీయ వాయిద్యాలతోసారే జహాసే అచ్ఛా గీతాన్ని వాయించారు. అనంతరం గగనతలంనుంచి హెలికాప్టర్లు పూలవర్షం కురిపించాయి. గ్రూప్ కెప్టెన్ అలోక్ అహ్లావత్ దీనికి నాయకత్వం వహించారు. ఇండోనేసియాకు చెందిన నేషనల్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్‌నుంచి 152 మంది బృందం కవాతులో పాల్గొంది. మరో 190 మంది సభునయల బ్యాండ్‌బృందం మార్చ్ నిర్వహించింది. లెఫ్టినెంట్ ఆహాన్‌కుమార్ నాయకత్వంలోని 61 మంది అశ్వికదళం కవాతును నిర్వహించింది. తర్వాత టానయర్ టి-90 భీష్మ, బిఎంపి-2శరత్‌తోపాటు నాగ్,బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థలు, పినాక, అగ్నిబాణ్, మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్లు, ఆకాశ్ వెపన్‌సిస్టమ్, చేతక్, బజరంగ్, ఐరావత్‌తో సహా పలు ఆయుధాలనుప్రదర్శించారు. ఈవేడుకల్లో త్రివిధ దళాలు సంయుక్తంగా ప్రదర్శించిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సశక్త్‌ఔర్ సురక్షిత్‌భారత్ అనే థీమ్‌తో దీన్ని తయారుచేసారు. వివిధప్రాంతాలనుంచి ఐదువేలమంది కళాకారులు జయతి జయమహాభారతం పాటకు 11 నిమిషాలపాటు సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. మోటారు సైకిళ్లపై డేర్‌డెవిల్స్‌చేసిన విన్యాసాలు అందరినీ అబ్బురపరిచాయి. బుల్లెట్ సెల్యూట్, ట్యాంక్‌టాప్, డబుల్‌జిమ్మీ, డెవిల్స్‌డౌన్ వంటి అంశాలుప్రదర్శించారు. 22 ఫైటర్‌జెట్‌లు 11 ట్రాన్స్‌పోర్టుఎయిర్‌క్రాఫ్ట్‌లు,ఏడు హెలికాప్టర్లు వైమానిక ప్రదర్శన వీక్షకులను కట్టిపడేసింది. వీటిలో రఫేల్, సు-30, జాగ్వార్, సి-130, సి-295, సి-17, డోర్నియర్-228, ఎఎన్-31 విమానాలతోపాటు ఎంఐ-17 హెలికాప్టర్లు ఉన్నాయి. అలాగే రాష్ట్రాలు,కేంద్రపాలితప్రాంతాలకు చెందిన 16 శకటాలు కేంద్ర మంత్రిత్వశాఖలకు చెందిన 15శకటాలు కవాతులో ఆకర్షణగా నిలిచాయి.

## రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న కాంగ్రెస్

>> నిషేధించారు. బాబా సాహెబ్ ప్రసాదించిన రాజ్యాంగాన్ని గౌరవిస్తూ సంవిధాన్ గౌరవ అభియాన్‌గా నిర్వహించుకుంటున్నాం. మదర్ ఆఫ్ డెమొక్రసీ ఈ దేశంలో ఉంది. మన చుట్టపక్కల అనేక దేశాలు పౌర హక్కులను అమలు చేసే విషయంలో విఫలమయ్యాయి. అదేవిధంగా ఇందిరాగాంధీ కూడా ఆ దిశలో ప్రయాణం చేసి ప్రజాస్వామ్యాన్ని, పౌరహక్కులను రద్దు చేసే ప్రయత్నం చేశారు. దేశ ప్రజలకు ఎటువంటి హక్కులు, అధికారాలు ఉన్నాయో, ఈరోజు జమ్ము కశ్మీర్‌లోని ప్రజలకు అమలుకు నోచుకున్నాయన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పించింది. సమన్యాయం, సమానత్వం కోసం కృషి చేస్తుందన్నారు. మేం ఓట్లు కోసం సంక్షేమ పథకాలు తీసుకురాలేదు. 2047లో దేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవితానికి, కృషికి సంబంధించిన ఐదు ప్రాముఖ్యమైన స్థలాలను అంబేద్కర్ పంచతీర్థాలుగా అభివృద్ధి చేశారన్నారు. భారతీయ జనతా పార్టీ నేతృత్వంలో అన్ని రకాలుగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తిగా ముందుకెళ్లాలని నిర్ణయించిందని, అందుకోసం తెలంగాణ ప్రజలు ప్రతిఒక్కరు ముందుకురావాలంట పిలుపునిచ్చారు.


ఆదివారం రాజ్‌భవన్‌లో జరిగిన ఎట్‌హోంలో పద్మవిభూషణ్ సాధించిన డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో గవర్నర్ జిష్ణుదేవ్ ఉన్నారు.

# దావోస్ ఒప్పందాలతో ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్న రాష్ట్రం

### సంక్షేమానికి, సంస్కృతికి రాష్ట్రంలో పెద్దపీట

### పెరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జనవరి26:** తెలంగాణలోని ప్రజా ప్రభుత్వంపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసల వర్షంకురిపించారు.సాంస్కృతిక వారసత్వంతో, ప్రజా స్వామ్య ఆచారాలతో తెలంగాణ ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, తక్షణ అవసరాలను నెరవేర్చేందుకు ప్రభుత్వం పని చేస్తోందన్నారు. 76వ గణతంత్ర వేడుకల్లో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదివారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రసంగించిన గవర్నర్ ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి తెలిపారు.ప్రజా ప్రభుత్వం సంక్షేమానికి, సంస్కృతికి పెద్దపీట వేస్తోందని అన్నారు. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలిచిందన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేను నిర్వహించిందని, సర్వే ఆధారంగా కొత్త విధానాలను ప్రభుత్వం రూపొందిస్తుందని స్పష్టం చేశారు. గణతంత్ర దినోత్సవం రోజున నాలుగు పథకాలను ప్రారంభం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ప్రజలకు అందిస్తోందన్నారు. తెలంగాణ అభివృద్ధి దిశగా అడుగులు వేసే రాష్ట్రంగా తీర్చిదిద్దుదాం అని గవర్నర్ బిష్ణుదేవ్ వర్మ హామీ ఇచ్చారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడటానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజా కవి అందె శ్రీ రాసిన ప్రసిద్ధ గీతం జయ జయహే తెలంగాణ జనని జయ కేతనం రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించబడిందని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో ప్రజా ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవాలలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలు పాల్గొన్నారు.

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముకగా ఉందని, ఈ ప్రభుత్వ హయాంలో గత ఏడాది వర్షాకాలంలో రికార్డు స్థాయిలో 1.59 కోట్ల టన్నుల వరి ఉత్పత్తితో దేశంలోనే అత్యధిక వరి ఉత్పత్తి కలిగిన రాష్ట్రంగా ఆవిర్భవించడంలో తెలంగాణ గొప్ప ఘనతను సాధించింది అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందన్నారు. ఆర్థిక భారాలను తగ్గించడానికి 27 రోజుల్లోనే 2 లక్షల రూపాయల పంట రుణ మాఫీని అమలు చేసిందని స్పష్టంచేశారు. పంట రుణ మాఫీ ప్రయోజనం 25 లక్షల 35 వేల 934 మంది రైతులకు ప్రయోజనం చేకూరిందన్నారు. రైతు భరోసాతో ఏటా ఎకరానికి రూ.12,000 పెంచిన ఆర్థిక సహాయం రైతులకు పెట్టుబడి పెట్టడానికి భరోసా ఇస్తుందన్నారు.తెలంగాణ యువత ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం బాటలు వేస్తోందని గవర్నర్ అభిప్రాయపడ్డారు.యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని స్థాపించడం ద్వారా ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ప్రపంచ స్థాయి శిక్షణను అందించడం సాధ్యమవుతుందన్నారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలకు హాజరయ్యే వారిని ప్రోత్సహించడానికి రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ సంవత్సరం బీసీల సంక్షేమం కోసం రూ. 9200 కోట్లకు పైగా ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు.

సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటుందన్నారు. మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ సిలిండర్, పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, తెలంగాణ అంతర్జాతీయ పాఠశాల ఏర్పాటు మొదలైన ఆరు పరివర్తన హామీలను అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సంక్షేమం, ఆహార భద్రత, గృహనిర్మాణం వంటి


ఆదివారం పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అభివాదం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

బహుళ రంగాలకు ప్రభుత్వం కృషి చేస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. నిరాశ్రయులైన, అర్హత కలిగిన కుటుంబాలు ఇళ్ళు నిర్మించుకోవడానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. 2024-2025లో రూ.22,500 కోట్ల బడ్జెట్‌తో 4,50,000 ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందజేయాలని, రేషన్ కార్డులపై సన్నబియ్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. తెలంగాణ వృద్ధికి మౌలిక సదుపాయాల అభివృద్ధి ఇప్పటికీ కీలకమైనదని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభిప్రాయపడ్డారు. మెట్రో రైలు నెట్‌వర్క్ విస్తరణ స్థిరమైన పట్టణ రవాణాను నిర్ధారిస్తుందన్నారు. మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా నిలుస్తుందన్నారు. ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్‌వేలు, ప్రాంతీయ రింగ్ రోడ్డు నిర్మాణం కనెక్టివిటీ రాష్ట్రాన్ని మరో స్థాయికి తీసుకెళతాయన్నారు.దావోస్ శిఖరాగ్ర సమావేశంలో కుదిరిన ఒప్పందాలు లక్షా డెబ్బయి ఎనిమిది వేల తొమ్మిది వందల యాభై కోట్ల రూపాయల విలువైన పెట్టుబడులను తీసుకువచ్చాయన్నారు. ఐటీ, పునరుత్పాదక ఇంధనం, ఔషధాలు, స్థిరమైన అభివృద్ధికి కేంద్రంగా తెలంగాణ ఖ్యాతిని పటిష్టం చేశాయన్నారు. ఈ ప్రయత్నాలు 49,500 ఉద్యోగాలను సృష్టించి తెలంగాణ పారిశ్రామిక వృద్ధిని ముందుకు తీసుకెళతాయని ఆకాంక్షించారు. వ్యాపారం, ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణాన్ని పెంపొందించడం ద్వారా, రాష్ట్రం పారిశ్రామిక నైపుణ్యంలో అగ్రగామిగా మారడంతో పాటు, ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తూనే ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం ఐటీ,ఫార్మా పరిశ్రమలలో జీసీసీఎస్ కేంద్రంగా మారిందని పేర్కొన్నారు.

తెలంగాణ భవిష్యత్తు కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన దార్శనికతను కూడా ప్రారంభిస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025ను రూపొందించిందని తెలిపారు. ఇది రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన, నమ్మకమైన, సరసమైన విద్యుత్తును అందించడానికి ప్రయత్నిస్తూనే రాష్ట్రానికి ఇంధన భద్రతను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇందులో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కూడా ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తెలిపారు. ఇది తెలంగాణను సాంకేతికత, ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. నాల్గవ నగరంలో విశాలమైన 200 ఎకరాల్లో ప్రతిష్టాత్మకమైన ఏఐ నగరాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

### జాతీయ జెండాకు అవమానం

### తలకిందులుగా ఆవిష్కరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి26:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా జాతీయ జెండాలను ఆవిష్కరించారు. కాగా, ఆంధ్రప్రదేశ్‌లోని కడప ప్రొద్దుటూరులో కోఆపరేటీవ్ బ్యాంక్ సిబ్బంది సరిగ్గా ఎగుర వేయకపోవడంతో స్తంభం మధ్యలో జెండా వేలాడుతూ కనిపించింది. ఇక టీజీలోని మేడ్చల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ దీపికారెడ్డి నరసింహారెడ్డి వివేకానంద విగ్రహం పార్క్ వద్ద జెండాను ఎగురవేయగా పతాకం తలకిదులైంది.

నాయకులు జాతీయ జెండాను తలకిందులుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన డిసిసి అధ్యక్షుడు హరివర్ధన్‌రెడిన తలకిందులుగా ఉన్న జెండాను గమనించి వెంటనే కిందకు దించారు. జాతీయ పతాకాన్ని సరిచేసి ఆవిష్కరించారు. అయినప్పటికీ జెండాకు అవమానం జరిగిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


న్యూఢిల్లీ గణతంత్ర వేడుకల్లో విశేషంగా ఆకర్షించిన ఎపి ఏటికొప్పాక బొమ్మల శకటం

## వివక్షపై ప్రధానికి లేఖరాస్తా

>> చేయడమే,ఇలాంటి చర్యలు కేంద్ర ప్రభుత్వానికి మంచిది కాదని చెప్పారు.ఇది అనవసర వివాదాలకు దారితీస్తుంది. రాష్ట్రాల అధికారాన్ని కేంద్రం గుంజుకోవడం మాపై దాడిగానే భావిస్తాం, మా హక్కులను వదులుకోవడానికి మేం సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. యూజీసీ నిబంధనల మార్పు నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకోవాల్సిందే, అలా చేయకపోతే అవసరమైతే నిరసనలకు వెనకాడం అని హెచ్చరించారు. రాష్ట్రాల అధికారాలను ఒక్కొక్కటిగా కేంద్రం తీసుకుంటూ వెళితే..రాష్ట్రాలు కేవలం పన్నుల వసూలు చేసే సంస్థలుగా మిగలాల్సి వస్తుందని చెప్పారు. రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలగకుండా మేధావులు ఆలోచన చేయాలి పద్మ అవార్డుల విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేసిందన్నారు. గద్దర్, చుక్కా రామయ్య, అందెశ్రీ, గోరటి వెంకన్న, జయధీర్ తిరుమలరావు లాంటి వారిని గుర్తించకపోవడం దారుణం పద్మ అవార్డులపై ఈ వేదికగా మా అసంతృప్తిని కేంద్రానికి తెలియజేస్తున్నామని, త్వరలోనే ప్రధానికి ఈ విషయంపై లేఖ రాయబోతున్నామని చెప్పారు. మనకు నాలుగైనా అవార్డులు ఇవ్వలేదని, మందకృష్ణకు పద్మశ్రీ ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కేవలం సర్టిఫికెట్ల కోసం మాత్రమే కాదు, సామాజిక బాధ్యతగా ఆనాడు పీవీ నరసింహారావు యూనివర్సిటీని ముందుకు తీసుకెళ్లారని పేర్కొన్నారు.సమాజంలో సమస్యలకు ఇక్కడి నుంచే పరిష్కారం మొదలు కావాలి,విద్యా హక్కును దూరం చేసే హక్కు పాలకులకు ఎవరూ ఇవ్వలేదు అని పేర్కొన్నారు.నిర్లక్ష్యానికి గురవుతున్న విద్యావ్యవస్థను గాడిన పెట్టేందుకు మా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా యూనివర్సిటీలను బలోపేతం చేసేందుకు వీసీలను నియమించామని,వందేళ్ల తరువాత ఉస్మానియా యూనివర్సిటీకి దళిత సామాజిక వర్గానికి చెందిన విద్యావేత్తను వీసీగా నియమించామని పేర్కొన్నారు. యూనివర్సిటీల్లో టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి అవసరమైన చర్యలు చేపట్టాలని వీసీలను ఆదేశించామని తెలిపారు. తెలంగాణ సమాజానికి చికిత్స అందించాల్సిన బాధ్యత యూనివర్సిటీ వీసీలపై ఉందని,పదేళ్లకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయండి. అమలు చేసే బాధ్యత మేం తీసుకుంటామని తెలిపారు. ప్రొఫెసర్ల వయోపరిమితి 65కు పెంచే ఆలోచన ఉందని పేర్కొన్నారు. యూనివర్సిటీలను ప్రైవేటీకరణ చేయాలన్న ఆలోచన చేస్తే అది మంచిది కాదని,రాష్ట్రంలో యూనివర్సిటీల పునర్నిర్మాణం జరగాలని చెప్పారు. దేశానికి పీవీ నర్సింహారావు, జైపాల్ రెడ్డి లాంటి వారిని అందించిన ఘనత యూనివర్సిటీలదే నని చెప్పారు. రంగుల గోడలు అద్దాల మేడలు అభివృద్ధి కాదని బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పారని.చిట్టచివరి పేదల వరకు సంక్షేమ ఫలాలు అందాలన్న అంబేద్కర్ ఆశయంతో మా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు.అంతకుముందు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ మాట్లాడుతూ ఫీజ్ రియింబర్స్‌మెంట్ విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. దీనిపై సిఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ ఇకపై రెగ్యులర్ కాలేజీల పద్ధతిలోనే అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తామని సిఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన అన్ని వివరాలను సేకరించి వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని వేదికపైనే సిఎస్‌కు సిఎం ఆదేశించారు. ఈ నిర్ణయం అమలు అయితే ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో విద్యార్థులు ఓపెన్ డిగ్రీలు,పీజులు పూర్తి చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## అసెంబ్లీకి రాకపోతే పదవి ఎందుకు?

>> లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు సీఎం కార్యక్రమాన్ని సీఎస్ శాంతకుమారి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్నిక రెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పదేళ్ల అయినా పాలమూరు రంగారెడ్డి పూర్తి కాలేదు..కొడంగల్,నారాయణపేట ఎత్తిపోతల పథకం మొదలు కాలేదని, కృష్ణా జలాలను కొడంగల్ తీసుకురావడానికి ప్రయత్నిస్తుంటే కాళ్ల లో కట్టె పెడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. గత పాలకులు ఫామ్ హౌస్ లు, వాళ్ల సంపాదన తప్ప ప్రజల గురించి పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి అయితే వాళ్ల మనుగడ ఉండదని అడ్డు పడుతున్నారన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ తో పాటు 50 లక్ష ల పేదల ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం అని చెప్పారు. గ80వేల పుస్తకాలు చదివిన మేధావి కేసీఆర్‌కు, అమెరికాలో చదివి వచ్చిన కేటీఆర్‌కు కనీసం పేదలకు రేషన్ కార్డు ఇవ్వాలన్న సోయి రాలేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం కూలిపోయినా ఒక కోటి యాభై ఆరు లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని పండించి, సన్న వడ్లకు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ఇచ్చామని సీఎం స్పష్టం చేశారు. తంలో తమ ప్రభుత్వం ఆడపడుచులకు దీపం పథకం కింద గ్యాస్ సిలిండర్ ను 400 కు ఇస్తే ఎన్డీఏ, కేసీఆర్ ప్రభుత్వం 1200 చేసిందని విమర్శించారు. మళ్ళీ ఇప్పుడు ప్రజా పాలనలో తెలంగాణలో 50 లక్షల కుటుంబాలకు 500 రూపాయలకే మహిళలకు గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని తెలిపారు. తమ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా 13 నెలలు గా 120 కోట్ల ఆడబిడ్డలు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం చేశారన్నారు. గతంలో రైతు భరోసా సాయం 5000 రూపాయలు ఉంటే ఈ సారి ఎకరానికి యేడాదికి 12 వేల రూపాయలకు పెంచామని, ఏటా 20 వేల కోట్లను రైతు భరోసాను 70 లక్షల మంది రైతులకు చంద్రవంచ నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. ఆదివారం, గణతంత్ర దినోత్సవం సందర్భంగా బ్యాంకులకు సెలవు ఉందని, అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచి అర్హులైన ప్రతి రైతు కు ఎకరాకు 6 వేల చొప్పున వారి ఖాతాలో జమ అవుతుందని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు అనగానే వైఎస్ రాజశేఖర్ రెడ్డి గుర్తుకు వస్తారని, 2004 నుంచి 2014 వరకు పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, అప్పట్లో ఒక్క కొడంగల్ లో 34 వేల ఇళ్లు పేదలకు ఇప్పించగలిగాం అన్నారు. కొడంగల్ కు పెద్ద ఎత్తున ఇళ్ల కేటాయింపు పైన కేసీఆర్‌కు కడుపు మండి సీబీసీఐడీ విచారణ వేశారని సీఎం ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో ఎవరికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదని విమర్శించారు. మార్చి 31వరకు కొడంగల్ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వబోతున్నామని వెల్లడించారు. కొడంగల్‌లో ప్రతి పేదవాడిని ఇంటి వాడిని చేసే బాధ్యత మీ సోదరుడిగా తీసుకుంటానని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. వచ్చే నాలుగేళ్లలో 15నుంచి20 వేల ఇళ్లు కొడంగల్‌లో ఇస్తామని ప్రకటించారు. తాను ముఖ్యమంత్రి అయ్యాక కొడంగల్ కు ఎక్కువ సమయం ఇవ్వలేకపోతున్నాని కానీ 4 కోట్ల రాష్ట్ర ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం శ్రమిస్తూనే కొడంగల్ అభివృద్ధికి పాటు పడుతున్నానని చెప్పారు. నేడు నాలుగు కొత్త పథకాలు రాష్ట్రవ్యాప్తంగా కొడంగల్ నియోజకవర్గం నుంచే మొదటగా ప్రారంభం అయ్యాయంటే ఎంతో గౌరవం అన్నారు. భూమికి , విత్తు కు ఎంత అనుబంధమో కాంగ్రెస్ కు రైతులకు అంత అనుబంధం ఉందని ముఖ్యమంత్రివ్యాఖ్యానించారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పాటు విద్యుత్ బకాయిలను రద్దు చేశారని, యూపీఎ హయాంలో మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ దేశ వ్యాప్తంగా 72 వేల కోట్ల రైతు రుణమాఫీ చేశారని గుర్తు చేశారు. ఆనాటి తమ ప్రభుత్వం వ్యవసాయం అంటే దండుగ కాదు పండుగ అని నిరూపించారన్నారు. నాటి తమ పాలనను వారసత్వంగా తీసుకొని నేడు ప్రజా ప్రభుత్వంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి చేసి చూపించామన్నారు. ఆగస్టు 15 న 22.50 లక్షల రైతులకు 21వేల కోట్ల రుణవిముక్తి చేశామన్నారు.

### వారం - వర్జ్యం

తేది : 27-01-2025, సోమవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
త్రయోదశి రా.8.55
మూల ఉ.9.01
వర్జ్యం ఉ.7.24-9.05, 2) సా.6.36-8.12
దు.మ.12.51-1.36, 2) మ.3.06-3.51
శుభసమయం: ఉ.9.40-10.20
సా.3.55-4.30
రాహుకాలం - ఉ.7.30-9.00

### వార్తాఫలం

**మేషం :** అనుకోని సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. ఇతరుల విషయంలో జోక్యం వద్దు.

**వృషభం :** నూతన గృహ నిర్మాణ ఆలోచనలు కలిసివస్తాయి. కొత్త ఉద్యోగ అవకాశాలు లాభిస్తాయి.

**మిథునం:** పిల్లల విషయమై చింతించ వలసిన అవసరము లేదని గ్రహించి ఊపిరి పీల్చుకుంటారు.

**కర్కాటకం :** ఎలర్జీ, అజీర్తి వంటి స్వల్ప ఇబ్బందుల పట్ల అప్రమత్తంగా ఉండటం చెప్పదగిన సూచన.

**సింహం:** మొండి పట్టుదల ఉపకరించేది కాదని గ్రహించండి. సంఘంలో విశేష గౌరవం లభిస్తుంది.

**కన్య :** మీకు నచ్చిన వ్యక్తులతో ఆనందంగా గడుపుతారు. ఋణాలను కొంతవరకు తీర్చగలుగుతారు.

**తుల :** ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. కుటుంబ సమస్యల నుండి బయట పడతారు.

**వృశ్చికం:** సోదరులు, మిత్రుల నుండి ధన, వస్తులాభాలు పొందుతారు. ఉద్యోగ యత్నాలు కలిసి వస్తాయి.

**ధనుస్సు:** వ్యాపార విస్తరణకుగాను చేపట్టే చర్యలు కలిసివస్తాయి. పనులు సక్రమంలో పూర్తి,

**మకరం:** మీ ఉన్నతి చూసి ఓర్వలేని వారు అధికమవుతారు. ఆర్థికపరిస్థితి అనుకూలం.

**కుంభం:** విలాసాలకు ఆర్థికంగా ధనం ఖర్చు చేస్తారు. చిన్న తరహా పరిశ్రమలవారికి అనుకూలం.

**మీనం :** ఒక మంచి కార్యక్రమాలను నిర్వహించడానికి గాను ప్రాణాలను సేకరిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

### గణతంత్ర వేడుకల్లో నారీశక్తి పెరేడ్ అద్భుతం!

**న్యూఢిల్లీ,జనవరి 26:** దేశంలో గణతంత్ర దినోత్సవ కవాతుఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో వికసిత్‌భారత్; నారీశక్తి అంశాలే ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దేశ చరిత్రలో తొలిసారి 100 మంది మహిళలు, శంఖం, నాదస్వరం వంటి సాంప్రదాయ సంగీత వాయిద్యాలను వాయిస్తూ కర్తవ్యపథ్‌లో నిర్వహించిన పేరేడ్‌లోపాల్గొన్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో నారీశకినతకి ప్రాతినిధ్యం వహిస్తూ ఉన్న మహిళా అదికారులు లెఫ్టినెంట్ కల్నల్ రవీందర్‌జీత్ రంధావా, లెఫ్టినెంట్ కమాండర్ మణి అగర్వాల్, ఫ్లైట్ లెఫ్టినెంట్ రుచి సాహా, కెప్టెన్ సంధ్యా మహ్లేదీనిలో పాల్గొన్నారు. డిఆర్‌డిఓ నిర్వహించిన కవాతుకు మహిళా శాస్త్రవేతనత సునీతా జెనా నాయకత్వం వహించారు. అధునాతన రక్షణ సాంకేతికతల ద్వారా దేశభద్రతను బలోపేతంచేయడంలో మహిళలు అందించిన కీలకమైన సహకారం అందులోప్రదర్శించారు. అసిస్టెంట్ కమాండెంట్ ఐశ్వర్యజాయ్ నాయకత్వంలోని సిఆర్‌పిఎఫ్ కు చెందిన 148 మంది సభ్యుల మహిళా బృందం, డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఆదిత్య నాయకత్వంలోని రైల్వే ప్రొటెక్షన్‌ఫోర్స్ బ1ందం పెరేడ్‌లోపాల్గొన్నాయి.

### రిపబ్లిక్‌డే వేడుకలకు ప్రధాని మోడీ రాజస్థాన్ తలపాగా

**న్యూఢిల్లీ, జనవరి 26:** దేశరాజధాని కర్తవ్యపథ్‌లో 76వ గణతంత్ర వేడుకలను ఘనంగా ప్రారంభించారు.రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని తలపాగా అందరినీ ఆకర్షించింది. ఎరుపు, పసుపు కలగలిసిన వర్ణంతో ప్రత్యేకంగా ఉంది. రాజస్థాన్ సంస్కృతికి ప్రతీకగా ఆయన సఫాను ధరించారు.ఏటా స్వాతంత్ర్య గణతంనరత వేడుకలకు ప్రధానిమోడీ విభిన్నమైన తలపాగాలు ధరించి హాజరవుతారు. దేశంలోని వివిధప్రాంతాల సంస్కృతిని ప్రతిబింబించేలా ఆయన జాగ్రత్త తీసుకొంటారు. 2024 గణతంత్రవేడుకల్లో కుంకుమ, గులాబీ, తెలుపు, పసుపురంగులతోకూడిన తలపాగా ధరించారు. ఇది గుజరాత్‌సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. 2023లో మహారాష్ట్రకు చెందిన ఫెటా 2022 వేడుకల్లో ఉత్తరాఖండ్‌కు చెందిన టోపీని ధరించారు. 2021లో గుజరాత్‌లోని జామ్‌నగర్ సంస్కృతిని ప్రతిబింబించే హాలారీ పగడ్డీప్రత్యేక ఆకర్షణగా మారింది.



## మావోయిస్టుల కోటలో మువ్వన్నెల జెండా రెపరెపలు

**సుకుమా(ఛత్తీస్‌గఢ్), జనవరి 26:** దేశచరిత్రలో మొట్టమొదటిసారిగా మావోయిస్టుల కోటగా భావిస్తున్న ప్రాంతంలో భద్రతా బలగాల సాయంతో గ్రామస్థులు మువ్వన్నెల జెండాను ఎగురవేసారు. రాష్ట్రంలోనిసుక్మా జిల్లా తుమాల్‌పాడ్‌ప్రాంతం అంటేనే మావోయిస్టులకు పెట్టని కోట అని చెబుతారు. ఈ గ్రామం ఇపుడు దశాబ్దాలనుంచి కొనసాగుతున్న అణిచివేత, భయాందోళనల నుంచి బైటపడింది. ఆదివారం మొదటిసారిగా ఈగ్రామంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసారు. భద్రతా బలగాల సాయంతో ఈ మావోయిస్టుల భయంనుంచి గ్రామం బయటపడింది. సుకుమా జోన్‌లో 16 పోలీస్ శిబిరాలను ఏర్పాటుచేసారు. సిఆర్‌పిఎఫ్ 74వ బెటాలియన్ ఆధ్వర్యంలోగ్రామస్తులు, చిన్నారులు, వయోవృద్ధులు ఈ కార్యక్రమంలోపాల్గొన్నారు. భారత్‌మాతాకీ జై అన్న నినాదాలతోగ్రామమంతా హోరెత్తించారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత మొట్టమొదటిసారి గణతంత్ర వేడుకలకు తుమాల్‌పాడ్‌గ్రామంలోజాతీయ పతాకాన్ని మొదటిసారి ఎగురవేసారు. ఇదొకరకంగా భద్రతా దళాలు సాధించిన విజయంగానే కేంద్రం భావించి వారిని అభినందిస్తోంది.

## పురపాలికల్లో ప్రత్యేకాధికారుల పాలన మొదలు

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పురపాలికలలో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. పాలక వర్గాల కాలపరిమితి ఆదివారంతో ముగిసింది. దీంతో తక్షణమే పురపాలికలు అన్నీ ప్రత్యేక అధికారుల పాలన పరిధిలోకి వెళ్లాయి. 120 మున్సిపాలిటీలు, 9 కార్పొరేషన్‌లలో పాలకవర్గాల కాలపరిమితి ముగిసింది. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఈ నెల 28 వ తేదీన పాలకవర్గాల కాలపరిమితి ముగియనుండడంతో అదే రోజు నుండి ప్రత్యేక అధికారి పాలన ప్రారంభం కానుంది. నస్పూర్ మున్సిపాలిటీ మంచిర్యాల, కొత్తపల్లి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనంతో మొత్తం 128 పురపాలికలకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగి కొత్త పాలక మండళ్లు కొలువుదీరే వరకూ ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం దాన కిషోర్ ప్రభుత్వ ఉత్తర్వులను ఆదివారం జారీచేసారు.

## ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత, హాజరు శాతం పెంపునకు చర్యలు

### జిల్లాల్లో అకడమిక్ సెల్స్ ఏర్పాటు

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం పెంచడంతోపాటు.. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంపొందించేందుకు ఇంటర్ విద్య శాఖ చర్యలు తీసుకుంటోంది. విద్యార్థులు ఎక్కువ మంది కాలేజీలకు వచ్చేలాగా చర్యలు తీసుకోవడమే కాకుండా.. విద్యార్థులు ఎందుకు కాలేజీలకు హాజరు కావడం లేదనే అంశాలను తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తోంది. జిల్లాల్లో అకడమిక్ సేవలు మెరుగుపరిచేందుకు జిల్లా అకడమిక్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఇంటర్ విద్యా శాఖ నిర్ణయించింది. అందులో భాగంగా కనీసారం నాంపల్లిలోని డైరెక్టరేట్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ సెల్ (డీఎఎంసీ) కోసం ఒక రోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని డైరెక్టర్ కృష్ణ ఆదిత్య నిర్వహించారు. అనంతరం రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అకడమిక్ విషయాల్ని పరిశీలించడానికి జిల్లా అకాడమిక్ కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీలను బట్టి కమిటీలో ఒకరి నుంచి ముగ్గురి వరకు సభ్యులుగా నియమించారు. అకడమిక్ గైడెన్స్, శిక్షణ మరియు ప్లేస్‌మెంట్ సెల్, రాష్ట్రములోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలను సమర్థవంతంగా పర్యవేక్షించడానికి రూపొందించారు. అందులో భాగంగా గత 3 సంవత్సరాలుగా కాలేజీ వారీ, గ్రూప్ వారీ, సబ్జెక్ట్ వారీ మరియు జిల్లా వారీ ఫలితాలను పరిశీలిస్తారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లను చూసి వారిలో ఎక్కువగా గైర్హాజరు అవుతున్న వారి వివరాలను సేకరించి.. ఎందుకు కాలేజీలకు రావడం లేదో తెలుసు కోనున్నారు. విద్యార్థులకు నిర్వహించే ప్రీఫైనల్ పరీక్షలను సమ యాను కూలంగా మూల్యాంకనం చేసి, పాస్/ఫెయిల్ శాతం విశ్లేషించ నున్నారు. విద్యార్థుల్లో ఉత్తీర్ణతాశాతం పెంచడం కోసం ప్రతిరోజు ఉదయం, సాయం త్రం ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహణను చేపట్టడం చేస్తారు. అయితే జిల్లా అకడమిక్ సెల్‌లో సభ్యులుగా ఉన్న వారు నేరుగా కమిషన రేట్‌లో ఉన్న అకడమికన సెల్‌కి వివరాలను అందించాల్సి ఉంటుంది తప్ప.. వాటిని జిల్లాలోని డీఐఈవోలకు ఇచ్చి వాటి నుంచి ఎలాంటి మార్పులు చేయాలనే వాటిపై చర్చించేలా మార్గదర్శకాల్లో పేర్కొన లేదు. దాంతోపాటు జిల్లా అకడమిక్ సెల్ సభ్యులను జిల్లాలోని ఏస్థాయి అధికారి పర్యవేక్షిం చాలనే అంశాన్ని కూడా ప్రకటించలేదు. పైగా జిల్లా అకడమిక్ కమిటీ సభ్యులు జేఎల్స్, బోధనేతర సిబ్బంది లైబ్రేరియన్స్ ఉన్నందున.. వారు కాలేజీలకు వెళ్లి ప్రిన్సిపల్స్‌తో వివరాలను సేకరించాల్సి ఉంటుంది. జేఎల్స్, లేబ్రేరి యన్స్‌కి ప్రిన్సిపల్స్ సమాచారంఇస్తారా? అనేది ప్రశ్నార్థంగా మారనుంది.





## జపాన్ టెక్నిక్‌తో కుంభమేళాలో స్వచ్ఛవాయువులు

**ప్రయాగరాజ్, జనవరి 26:** యూపీలోని ప్రయాగరాజ్ త్రివేణి సంగమంలో జరుగుతున్న ప్రపంచ అతిపెద్ద ఆధ్యాత్మిక మేళకు యుపి ప్రభుత్వం స్వచ్ఛమైన గాలి వచ్చేందుకు కూడా ఏర్పాట్లుచేసింది. మహాకుంభమేళాకు కోట్లాదిభక్తులు పోటెత్తుతున్నా స్వచ్ఛమైన గాలికి కొదవలేదు. కారణం జపనీస్ టెక్నిక్ అమలుచేస్తున్నారు. కుంభమేళా జనవరి 13న ప్రారంభం కాగా ఈ మహాక్రతువుకోసం యోగి సర్కారు రెండేళ్లక్రితమే కసరత్తు ప్రారంభించింది. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ మియావాకీ అనే జపనీస్ సాంకేతికతతో ప్రయాగరాజ్‌పరిధిలో దట్టమైన అడవులను తయారుచేసింది. నగరంలో పదిచోట్ల 18.50 ఎకరాల ఖాళీభూమిలో వివిధ లక్షలకుపైగా 63 రకాల మొక్కలు నాటారు. ఆమొక్కలు ఇపుడు చెట్లుగా ఎదిగి ప్రతిరోజూ స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను వాతావరణంలోకి వదులుతున్నాయి. మియావాకి టెక్నిక్‌తో ఇదంతా సాకారంచేయడానికి ప్రయాగరాజ్ మున్సిపాలిటీమహాకు రూ.6 కోట్లను ఖర్చుచేసింది. తక్కువవ్యవధిలో ఎక్కువ సంఖ్యలో మొక్కలను నాటి పెంచడమే మియావాకీ టెక్నిక్ ప్రత్యేకత. ఈ ప్రాజెక్టులో మర్రి, రావి, వేప, చింత, ఉసిరి, రేగి, వెదురు వంటి 63 రకాల చెట్లు ఉన్నాయి. వీటినిరహదారి కాంట్రాక్టును మూడేళ్ల వ్యవధితో ఒక కంపెనీకి అప్పగించారు. ఇపుడు ఈప్రాజెక్టే మహాకుంభ్‌నగర్ వాసులకు స్వచ్ఛమైన వాయువును అందిస్తోంది.

# 13 మంది అధికారులకు ప్రభుత్వ అవార్డులు

### విశేష కృషి చేసిన వారికి ప్రదానం చేసిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 26:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనతో పాటు పలు కార్య క్రమాలను సమర్థవంతంగా నిర్వ హించడంలో విశేష కృషి చేసిన 13 మంది అధికారులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ ప్రత్యేక పురస్కారాలను అందజేశారు. ఆదివారం పరేడు గ్రౌండ్‌లో జరిగిన రిపబ్లిక్ వేడుకలలో ఈ అవార్డులు ప్రదానం చేసారు. 1. విక్రమ్ సింగ్ మాన్(ఐపిఎస్)- అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్, హైదరాబాద్ 2. ముషారఫ్ ఫరూఖీ(ఐఏఎస్)-చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, టిజిఎస్‌పిడిసిఎల్, 3. అనురాగ్ జయంతి (ఐఏఎస్)- జోనల్ కమిషనర్, జీహెచ్‌ఎంసీ 4. ఎస్.హరీశ్(ఐఏఎస్)-స్పెషల్ కమిషనర్ అండ్ ఎక్స్ అఫిషియో స్పెషల్ సెక్రెటరీ, జీఏ(ఐ అండ్ పీఆర్) 5. ఈవీ నరసింహారెడ్డి(ఐఏఎస్)- కమిషనర్, పాఠశాల విద్యా డైరెక్టర్ 6. అనుదీప్ దురిశెట్టి (ఐఏఎస్)-హైదరాబాద్ కలెక్టర్ 7. కర్నాటి వరుణ్ రెడ్డి(ఐఏఎస్) - చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, టిజిఎన్‌పిడిసిఎల్ 8. కె.విద్యా సాగర్ - ఓఎస్డీ చీఫ్ సెక్రటరీ 9.జి. రాజేశ్వర్ రెడ్డి - ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజినీర్ 10. మామిడి హరికృష్ణ-సంస్కృతి శాఖ డైరెక్టర్ 11. ఐ.నరసింగరావు-ఆర్ అండ్ బీ సూపరింటెండెంట్ ఇంజినీర్ 12. కె.మనోహర్ బాబు -ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ 13. వి.సర్వేశ్ కుమార్ - సీఎస్ ఆఫీస్ సీనియర్ కన్సల్టెంట్‌లకు గవర్నర్ ప్రత్యేక పురస్కారాలు అందజేశారు.

**సిటీ అదనపు సిపి విక్రంసింగ్‌మాన్‌కు గవర్నర్ నుంచి ప్రశంసాపత్రం**

పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పనిచేసి విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచినందుకు రాష్ట్రపతి పోలీసు పతకానికి ఎంపి కైన నగర అదనపు పోలీసు కమిషనర్ (శాంతి భద్రతలు) విక్రం సింగ్ మాన్‌కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నుంచి ప్రశంసా పత్రం లభించింది. పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఈ ప్రశంసా పత్రాన్ని గవర్నర్ వర్మ, విక్రం సింగ్ మాన్‌కు అందజేశారు. నగరంలో ఇటీవల జరిగిన ప్ర జా పాలన, ప్రజా విజయోత్సవాలను సవ్యంగా నిర్వహించినందుకు విక్రం సింగ్ మాన్‌కు ఈ ప్రశంసా పత్రం లభించింది. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విక్రం సింగ్ మాన్‌ను అభినందించారు.



**ప్రత్యేక పురస్కారం అందుకున్న పాఠశాల విద్యా డైరెక్టర్ ఇవి నర్సింహారెడ్డి**

రాష్ట్రంలో 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యా డైరెక్టర్ ఈవి నర్సింహా రెడ్డి ప్రత్యేక పురస్కారం అందుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన ప్రజాపాలనతోపాటు పలు కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వ హించడంలో విశేష కృషి జరిపిన 13 మంది అధికారులకు రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ప్రత్యేక పురస్కారాలు అందజేసింది. వారిలో పాఠశాల విద్యా డైరెక్టర్ ఈవి నర్సింహారెడ్డి కూడా ప్రత్యేక పురష్కారం అందుకున్నారు.

## నేడు యాజమాన్యానికి ఆర్‌టిసి జెఎసి సమ్మె నోటీసు

### ఆర్టీసి పరిరక్షణ, ప్రభుత్వంలో విలీనం ప్రధాన డిమాండ్లు

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** ఆర్టీసీ పరిరక్షణతోపాటు ప్రభుత్వ హామీల అమలు కోసం నేడు(సోమవారం) సమ్మె నోటిస్ ఇవ్వాలని టీజీఎస్‌ఆర్‌టీసీ జేఏసీ నిర్ణయించింది. కొద్ది రోజుల క్రితం జరిగిన రాష్ట్ర జేఏసీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆర్‌టీసీ పరిరక్షణ కోసం సమ్మె నోటీ ఇవ్వాలని తీర్మానం చేసినట్టు జేఏసీ ప్రకటించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్న .. ఆర్‌టీసీ ఉద్యోగులకు ఇచ్చిన ప్రధాన హామీలైన ప్రభుత్వంలో ఆర్‌టీసీ ఉద్యోగుల విలీనం, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేత, 2021 నుంచి వేతన సవరణతో అమలు చేయలేదు. దాంతోపాటు అతి ముఖ్యమైన .. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసిని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి అంగట్లో సరుకుల్లాగ రోజుకొక డిపో చొప్పున ప్రవేటు ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో కార్పొరేట్ సంస్థలైన జేబీఎం, ఒలెక్ట్రాలకు ధారాదత్తం చేస్తుందని జేఏసీ విమర్శిస్తోంది. ఎలక్ట్రిక్ బస్సులకి ఈ ప్రభుత్వం ఒక్క పైసా పెట్టుబడి పెట్టలేదు, ఆర్‌టీసీ సంస్థ కొనలేదు అలాంటప్పుడు ఈ బస్సులను హంగులు ఆర్బాటలతో ప్రారంభించే హక్కుప్రభుత్వానికి, ప్రభుత్వ మంత్రులకి ఎక్కడిదని జేఏసీ నాయకులు ప్రశ్నించారు. ఈ ప్రవేటు బస్సులను ప్రభుత్వ బస్సులుగా ప్రజలను, తెలంగాణ సమాజాన్ని నమ్మించాడానికి చేస్తున్న చర్యగా జేఏసీ భావిస్తోంది.

ఎలక్ట్రిక్ బస్సుల వలన ఆర్‌టీసీ సంస్థలో వేలాది మంది ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని, ఒక బస్సుకు 5 మంది చొప్పున బడుగు, బలహీన వర్గాలకు చట్టప్రకారం ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయి .. పూర్తిగా ప్రవేటు వ్యక్తుల చేతిలోకి నెట్టి వేయబడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. గత యూపిఏ ప్రభుత్వం జెన్నారం (జేఎన్ఎన్‌యూఆర్‌ఎం) బస్సులను ఆర్‌టీసీకి కొనిచ్చిన మాదిరిగా ఈ ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీకి కొనిచ్చి ప్రజా రవాణాను కాపాడాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో దశలవారిగా ఉద్యమ కార్యచరణలు చేపట్టి ప్రభుత్వానికి, ఆర్‌టీసీ యాజమాన్యానికి మెమోరాండంలను సమర్పిం చినప్పటికి ఇప్పటి వరకు ఎలాంటి స్పందన లేకపోవడంతో .. సంస్థని రక్షించు కోవడానికి కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకై మెజారిటీ ఉద్యోగుల అభిప్రాయం మేరకు విధిలేని పరిస్థితిలో సమ్మెబాట పట్టాల్సి వస్తోందని నేడు ప్రభుత్వ, యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇవ్వడానికి జేఏసీ నిర్ణయించింది.

## పద్మభూషణ్ అవార్డుకు ఎంపికైన బాలకృష్ణకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అభినందనలు



**హైదరాబాద్ (పంజగుట్ట), జనవరి 26, ప్రభాతవార్త:** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆదివారం జూబ్లీ హిల్స్ లోని సినీనటుడు నంద మూరి బాలకృష్ణ నివా సానికి వచ్చారు. పద్మ భూషణ్ అవార్డుకు ఎంపికైన ఆయనను వారి నివాసంలో కలిసి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురు పలు విషయాలపై చర్చించుకున్నారు. అర్హులైన వారికి కేంద్రప్రభుత్వం అవార్డులతో సత్కరించడం అభినందనీయమని బాలయ్య కిషన్‌రెడ్డితో వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల బాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు.

## నేడు జస్టిస్ ఘోష్ విచారణకు కె.రఘు

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ వైఫల్యంపై విచారణ జరుపుతున్న జస్టిస్ పిసిఘోష్ సోమవారం విద్యుత్ నిపుణులు కె.రఘును బూర్గుల రామకృష్ణారావు భవనంలో జరిగే బహిరంగ విచారణకు హాజరుకావాలని నోటిసులు జారీచేసింది. విద్యుత్ నిపుణులు కంచర్ల రఘు గతంలో హాజరై పిసి ఘోష్‌కు ఏడవ బ్లాక్ లోని 12 పియర్లు తొలగించి కట్టాల్సిందే అని దీనికి డైమండ్ కటింగ్ ద్వారా నెమ్మదిగాతొలగించాలని సూచించారు. కాళేశ్వరం రీ ఇంజనీరింగ్ భారీ తప్పిదంగానే కంచర్ల రఘు అభిప్రాయాలు జస్టిస్ ముందు నేడు వెల్లడించే అవకాశం ఉంది. మేడిగడ్డలో పియర్ల కింద నిర్మించిన బేసిమెట్ ఒక చోట్ల మీటరు మేరకు కుంగింది. అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బ్యారేజిలు 2019లో పూర్తి అయితే అదే సంవత్సరం నవం బర్‌లో వచ్చిన వరదల కారణంగామూడు బ్యారేజిల ఆప్రాన్, సిమెంట్ కాంక్రీట్ బ్లాకులు మొత్తం కొట్టుకొని పోయాయి అది కూలిపోయే వరకు ఏలాంటి రిపేర్లకు నోచుకోలేదని ,ఆనాటి నుంచి ప్రతిఏయేటా సంభవించిన వరదల కారణంగామరింత పరిస్థితి దిగజారిందనే అభిప్రాయంను ఆయన జస్టిస్ ముందు బహిరంగ విచారణలో వాగ్మూలం ఇచ్చేఅవకాశం ఉంది. అదేవిధంగా రిటైర్డు ఇంజనీర్ దొంతల లక్ష్మీనారాయణ అభిప్రాయం కూడా వాగ్మూలం రూపంలో తీసుకోనున్నది.



రాష్ట్ర పోలీసులకు కేంద్ర హోంమంత్రి పోలీసు పతకాలు ప్రదానం చేశాక వారితో కలిసి ఫొటో దిగిన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ. చిత్రంలో సిఎం రేవంత్‌రెడ్డి, చీఫ్‌సెక్రటరీ శాంతికుమారి, డిజిపి జితేందర్ తదితరులు

## కేంద్ర హోంమంత్రి పోలీసు పతకాలు రాష్ట్ర పోలీసులకు ప్రదానం

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** పోలీసు శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరచినందుకు, కీలకమైన కేసుల దర్యాప్తులో వేగంగా విచారణ చేసి, నిందితులను అరెస్టు చేసినందుకుగానూ కేంద్ర హోంమంత్రి పోలీసు పతకాలకు ఎంపికైన రాష్ట్ర పోలీసులకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆదివారం వాటిని అందజేశారు.

హైదరాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవాల సందర్భంగా ఉత్తమ జీవన్‌రక్ష పతకం, విశిష్ట పతకాలు, స్పెషల్ ఆపరేషన్ పతకాలకు ఎంపికైన 16మంది పోలీసులకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ వీటిని అందించారు. 2022, 2023 యేడాదికిగానూ కేంద్రం ఈ పతకాలను రాష్ట్ర పోలీసులకు ప్రకటించింది.

## ఉద్యోగుల సమస్యలపై బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తా

### పదవీవిరమణ డబ్బు కోసం విశ్రాంత ఉద్యోగులు కోర్టుకు వెళ్తున్నారు: మాజీమంత్రి హరీశ్‌రావు



**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యోగుల సమస్యలపై బడ్జెట్ సమావేశాలలో ప్రభుత్వంపై పట్టుబట్టి ఒత్తిడి తీసుకవచ్చి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పబ్లిక్ సర్వెంట్స్ హోమ్‌లో ఆదివారం నిర్వహించిన 18 మంది ఉత్తమ ఉద్యోగుల సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ కోసం పట్టుబట్టి పోరాడిన సిద్దిపేట అభివృద్ధిపై ప్రభుత్వం కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. తెలంగాణ సాధనకు గుండె కాయ అయినా సిద్దిపేట అభివృద్ధిపై కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతున్న ప్రభుత్వం సమయం వచ్చినప్పుడు తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

కాంగ్రెస్ సర్కారు ఉద్యోగులకు పిఆర్‌సి, డిఎలు ఇవ్వడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. బిఆర్‌ఎస్ హాయంలో కెసిఆర్ ఉద్యోగులకు రెండు విడతల్లో 73 శాతంతో కూడిన మంచి పిఆర్‌సిని అందించారని గుర్తు చేశారు. పిఆర్‌ఎస్ గడువు ముగిసిపోయిన రేవంత్‌రెడ్డి తిరిగి పిఆర్‌సిని ప్రకటించడం లేదన్నారు. పదవి విరమణ పొందిన ఉద్యోగులకు విరమణ డబ్బులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పదవి విరమణ డబ్బుల కోసం విశ్రాంత ఉద్యోగులు హై కోర్టుకు వెళ్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులే ప్రభుత్వంపై కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితులు దాపురించాయన్నారు.

## విద్యుత్‌లో తెలంగాణ అద్భుత విజయం

### ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సుల్తానియా

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** విద్యుత్ రంగంలో ఏడాది కాలంలో తెలంగాణ అద్భుతమైన విజయాన్ని సాధించిందని ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అన్నారు. అన్ని విధాలుగాను విద్యుత్ రంగం కీలక పాత్ర వహిస్తోందని చెప్పారు. హైదరాబాద్‌లో విద్యుత్ శాఖ కార్యాలయంలో రిపబ్లిక్ డే సందర్భంగా ఆదివారం జెండా ఎగరవేసిన అనంతరం మాట్లాడుతూ తెలంగాణ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ రంగంలోకి ప్రవేశించిందని తెలిపారు. ఇందులో భాగంగా 500 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ కోసం ఇప్పటికే టెండర్‌ను దాఖలు చేయడం జరిగిందన్నారు. తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ విడుదల, యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని 800 మెగావాట్ల యూనిట్‌ను జాతికి అంకితం చేయడం, సౌర గ్రామాలను దత్తత తీసుకోవడం వంటి అనేక ప్రధాన మైలురాళ్లను అధిగమించిందని వివరించారు. తెలంగాణ ప్రభుత్వ విద్యుత్ రంగంలో ఒక ప్రధాన చొరవగా, తెలంగాణను పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి మరియు తయారీకి కేంద్రంగా మార్చే లక్ష్యంతో కొత్త క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని ప్రారంభించడం జరిగిందని వెల్లడించారు. తెలంగాణ కొత్త పునరుత్పాదక విద్యుత్ విధానం 2030 నాటికి 20,000 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచాలనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని కలిగి ఉందన్నారు. విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధి సాధించే ప్రయత్నంలో, యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ యొక్క ఐదు యూనిట్లు (5800 మెగావాట్లు) వచ్చే జూన్ నాటికి పూర్తి స్థాయిలో ప్రారంభించబడతాయని చెప్పారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం అనేక పెట్టుబడిదారులతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న దృష్ట్యా, ఐటీ, ఫార్మసీ, ఎలక్ట్రిక్ వాహనాలు, ఏరోస్పేస్ వంటి వివిధ రంగాలలో అనేక ప్రాజెక్టులను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయన క్రీడలు, ఆటల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు.

**విద్యుత్‌రంగ సేవలకు ఎస్పీడిసిఎల్ సిఎండి ఫరూఖీకి అవార్డు**

విద్యుత్ రంగంలో చేస్తున్న సేవలకు గుర్తింపుగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) సిఎండి ముషారఫ్ ఫరూఖీకి రాష్ట్ర ప్రభుత్వం అవార్డుకు ఎంపిక చేసింది. ఈ నేపధ్యంలో సికింద్రాబాద్ పెరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ నుండి ఫరూఖీ అవార్డును స్వీకరించారు.

## త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి ఫోన్ ట్యాపింగ్ కేసుపై సర్కారు సీరియస్

### నిందితులపై మరో కేసు నమోదుకు ఆదేశం?

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ ఘటనలో మరో నేరం వెలుగు చూడడంపై సర్కారు తీవ్రంగా పరిగణించిందని తెలుస్తోంది. 2023 అక్టోబర్ నెలలో బిఆర్‌ఎస్ సర్కారు పాలన చివరి రోజుల్లో అప్పుడే త్రిపుర గవర్నర్‌గా బాధ్యతలు చేబట్టిన నల్లు ఇంద్రసేన రెడ్డి ఫోన్‌ను ట్యాపింగ్ చేసినట్లు 16 నెలల తరువాత వెలుగు చూసింది. ఇంద్రసేన్ రెడ్డి 2023 అక్టోబర్ నెలలో త్రిపుర గవర్నర్‌గా నియమితులు కాగా అదే నెల 18వ తేదీన బాధ్యతలు చే బట్టారు. ఆ సమయంలో ఇంద్రసేన రెడ్డి వద్ద ఓఎస్‌డిగా నర్సింలు అనే అధికారి వుండే వారు. ఆయన ఫోన్‌ను గవర్నర్ ఇంద్రసేన రెడ్డి అధికారిక కార్యకలాపాలకు వాడే వారు. అప్పట్లో తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల హడావిడి వుంది. 2023 నవంబర్ 30వ తేదీన రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగగా అంతకు నెల రోజుల ముం దు ఇంద్రసేన రెడ్డి ఓఎస్‌డి నర్సింలు ఫోన్‌ను పక్షం రోజుల పాటు నాటి ఎస్‌ఐబి చీఫ్ ప్రభాకర్ రావు ఆదేశాల మేరకు డిఎస్‌పి దుగ్యాల ప్రభాకర్ రావు ట్యాపింగ్ చేసి నట్లు తాజాగా వెలుగు చూసింది. ఆ సమయంలో కేంద్రంలో జరిగే విషయాలను తెలుసుకునేందుకు బిఆర్‌ఎస్ సర్కారు ఏకంగా చట్ట విరుద్ధంగా గవర్నర్ ఫోన్‌ను టా ్యపింగ్ చేసినట్లు తాజాగా వెల్లడయ్యింది, కాగా దీనిపై తాజాగా ఫోన్ ట్యాపింగ్ కేసును విచారిస్తున్న పశ్చిమ మండల పోలీసులు ఇంద్రసేన రెడ్డి ఓఎస్‌డి నర్సింలు వాంగ్మూలం తీసుకున్నారు. ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా వుంచినా వాంగ్మూలం ఇచ్చిన నర్సింలు తన ఫోన్ ట్యాపింగ్ అయినట్లు పోలీసు అధికారులు చెప్పే వరకు తెలియదని చెప్పారు. తన ఫోన్ ట్యాపింగ్‌పై పోలీసుల విచారణకు తాను సహకరిస్తానని ఆయన తెలిపారు.

ఇదిలావుండగా త్రిపుర గవర్నర్ ఇంద్రసేన రెడ్డి ఫోన్‌ను గత బిఆర్‌ఎస్ హయాంలో ఎస్‌ఐబి పోలీసులు ట్యాపింగ్ చేసిన ఉదంతాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిం చినట్లు తెలిసింది.

ఇందుకుగానూ ఈ కేసులో అరెస్టయిన నలుగురు అధికారులతో పాటు ముందుగానే అమెరికాకు ఉడాయించిన ఎస్‌ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావు, మీడియా అధినేత శ్రవణ్ రావులపై మరో కేసు నమోదు చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. అప్పట్లో ప్రతిపక్ష నేతగా వున్న ప్రస్తుత సిఎం రేవంత్ రెడ్డితో పాటు ఇత ర ప్రతిపక్ష పార్టీల నాయకుల ఫోన్‌లను ఎస్‌ఐబి అధికారులు ఇష్టానుసారం ట్యాపింగ్ చేయడం తెలిసిందే. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన నాలుగు నెలల తరువా త అంటే 2024 మార్చి నెలలో ఈ గోల్‌మాల్ రట్టయ్యింది. దీనిపై మొదట ఎస్‌ఐబి డిఎస్‌పి దుగ్యాల ప్రణీత్ రావు, ఆ తరువాత నాటి సిటీ ఐఎస్‌డబ్ల్యు అదనపు డిసిపి తిరుపతన్న, భూపాలపల్లి జిల్లా నాటి అదనపు ఎస్పీ భుజంగరావు, చివరగా హైదరాబాద్ సిటీ టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావులు అరెస్టవడం తెలిసిందే. ఇదే కేసులో మొదటి ముద్దాయిగా వున్న ఎస్‌ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావు,, మీడియా అధినేత శ్రవణ్ రావులు నెల రోజులు ముందుగానే అమెరికాకు ఉదా యించి ఏడాదిగా అక్కడే మకాం వేయడం విదితమే. వీరిని భారత్‌కు రప్పించేందుకు పోలీసులు అనేకయత్నాలు చేస్తున్నా ఇవి కార్యరూపం దాల్చడం లేదు. వీరిద్దరు భారత్‌కు తిరిగివస్తే కానీ ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త విషయాలు వెలుగుచూసే అవకాశం లేదు.

మరోవైపు ఈ కేసులో అరెస్టయిన నలుగురు నిందితుల్లో భుజంగరా వు అనారోగ్య కారణాలతో వైద్య సేవల నిమిత్తం మధ్యంతర బెయిల్‌పై వుండగా మిగతా ముగ్గురు తొమ్మిది నెలలుగా చంచల్‌గూడ జైల్లో వున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు ఇప్పటికే అనేక మలుపులు తిరగగా కొత్తగా త్రిపుర గవర్నర్ ఇంద్రసేన రెడ్డి ఓఎస్‌డి ఫోన్ ట్యాపింగ్‌తో మరో మలుపు తిరిగింది. రాబో రోజుల్లో మరెన్ని మలుపులు తిరుగుతుందో చూడాల్సి వుంది.

వార్త

జీవితంలో విజయం సాధించడానికి మనిషికి తెలివితేటలు ఉండి అవకాశాలు వచ్చినంత మాత్రాన చాలదు. ఏకాగ్రత, లక్ష్యశుద్ధి అవసరం.

-సి.డబ్ల్యు వెండైట్

# యుద్ధభూమిలో వింత వైరస్!

ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర గత మూడేళ్లుగా కొనసాగుతోంది. తాను అధికారంలోకి రాగానే ఉక్రెయిన్ రష్యా యుద్ధం ఆపేస్తానని ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనల పైనే ఇప్పుడు ఉక్రెయిన్ వాసులు ఆశలతో ఉన్నారు. పాశ్చాత్యదేశాలన్నీ పర్యటించి అందరి మద్దతును కూడగట్టుకున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి ఇప్పుడు కొత్త సమస్య వచ్చిపడింది. కొత్తతరహా బ్యాక్టీరియా బాధిస్తోంది. సాధారణంగా వాడే యాంటిబయాటిక్స్ వారికి పని చేయడంలేదు. కొంతమంది బతుకుతామన్న ఆశలు వదులుకున్నారు. వీటన్నింటినీ పరికిస్తే రష్యా యుద్ధతంత్రంలో ఇదొక భాగమా అనిపిస్తోంది. యుద్ధతంత్రాలను గమనిస్తే పౌరజీవన ప్రాంతాలపై దాడులు చేసేముందు సరైన హెచ్చరికలు చేయాలి. ప్రస్తుతం రష్యా చేస్తున్న దాడుల్లో హెచ్చరికలు లేనివే ఎక్కువ ఉన్నాయి. దీనికితోడు ఆయుధాలతోపాటు రసాయన దాడులతోకూడా ప్రత్యర్థులను మట్టుబెట్టే తంత్రాన్ని పుతిన్ అమలు చేస్తాడన్నది తెలిసిందే. ప్రస్తుతం రష్యాదాడుల్లో గాయపడిన ఉక్రెయిన్‌వాసులను 'యాంటీమైక్రోబ యాల్ రెసిస్టెన్స్' అనేవింత ఇన్‌ఫెక్షన్ సోకుతోంది. సాధారణంగా వాడే యాంటి బయాటిక్స్‌తో పాటు అత్యంత శక్తివంతమైన విదేశీ యాంటిబయాటిక్స్‌ను దిగుమతి చేసుకుని మరీ వినియోగిస్తున్నప్పటికీ అతి కొద్దిమంది మాత్రమే బతికి బట్టకడుతున్నా వారి శేష జీవితాలు అనుమానమేనని ఉక్రెయిన్ వైద్యనిపుణులే చెపుతున్నారు. యుద్ధగాయాలకు చికిత్స అందించే అనేక క్లినిక్‌లలో ఈఎం ఆర్‌కేసులే ఎక్కువ ఉన్నాయి. వాస్తవానికి ఈ ఎఎంఆర్ ఇన్‌ఫెక్షన్‌తో రెండేళ్ల గణాంకాలు చూస్తే ప్రపంచంలో మొత్తం 14లక్షలమంది చనిపోయా రు. గతఏడాది బ్రిటన్‌లో యాంటిబయాటిక్ రెసిస్టెంట్ ఇన్ఫెక్షన్లు 67వేలవరకూ నమోదయ్యాయి. ఉక్రెయిన్‌లో మాత్రం కేవలం రష్యా దండయాత్రలో వినియోగించిన ఆయుధాల కారణంగానే ఈ వింత బ్యాక్టీరియా కేసులు అనూహ్యంగా పెరుగుతున్నట్లు తేలింది. ఆ చిన్న దేశంలో యాంటిబయాటిక్స్‌ను కూడా తట్టుకుని వ్యాప్తిచెందే వైరస్‌లు ఉత్పత్తి అవుతున్నాయంటే ఆదేశానికి ప్రపంచ దేశాల వైద్యసాయం అనివార్యం అనిపిస్తోంది. అందుబాటులో ఉన్న వైద్యవిధానాలతో చేస్తున్నప్పటికీ రష్యా యుద్ధతంత్రంలో ఈ రసాయన ఆయుధ వినియోగం మరింత పెరిగితే ఉక్రెయిన్ మొత్తం మరుభూమిగా మారుతుందని నిస్సందేహంగా చెప్పుకోవచ్చు. ఇప్పటికే లక్షలాది ఇళ్లు నేలమట్టం అయ్యాయి. ఆయుధస్థావరాల పైనా దాడులు జరుగుతుంటే లక్షలాది మంది పొరుగుననే ఉన్న చిన్నదేశాలకు వలసపోయారు. శరణార్థులుగా కొనసాగుతున్నారు. ఈక్రమంలో ఉక్రెయిన్‌ను ఈ ఎఎం ఆర్ ఇన్ఫెక్షన్లు మరింత కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే యుద్ధప్రభావంతో అనేక ఇన్ఫెక్షన్ల బారినపడి ఆసుపత్రులకు వస్తున్నవారు లక్షల్లో ఉన్నారు. కొందరు యుద్ధభూమి నుంచి వెళ్లిపోతుంటే మరికొందరు ఉక్రెయి న్ దేశపరిరక్షణకు యువత రావాలన్న పిలుపుపై వచ్చి స్వచ్ఛందంగా చేరుతున్నారు. అలాంటి వారితోపాటు గత మూడేళ్లుగా యుద్ధభూమిలో ఉన్నవారికి ఈ ఎఎంఆర్ బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లు సోకుతున్నాయి. సాధారణ యాంటి బయాటిక్స్ కూడా పనిచేయని ఈ ఇన్ఫెక్షన్ కొనసాగుతూనే మరోపక్క సెప్సిస్ వంటివి కూడా సోకుతున్నట్లు ఉక్రెయిన్ రోగులకు చికిత్స చేస్తున్న వైద్యులు చెపుతున్నారు. అటు ఆర్థికపరంగాను, మానవ వనరులపరంగాను, మౌలిక వనరులపరంగాను అపార నష్టం చవిచూసిన ఈ ఉక్రెయిన్‌ను ఆరోగ్యపరంగా కూడా ఈ వింత వైరస్‌లు, ఇన్ఫెక్షన్లు బాధిస్తున్నాయి. యుద్ధం లేదా సైనికచర్య అంటూ ప్రారంభిస్తే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తనవద్ద ఉన్న అన్ని అస్త్రశస్త్రాలను వినియోగిస్తాడన్నది ప్రపంచ దేశాలకు తెలియనిదికాదు. ఈ క్రమంలోనే తనకు వ్యతిరేకంగా పనిచేసిన వారిని మట్టుబెట్టడంలో పుతిన్ అందెవేసిన చేయి. విదేశాల్లో ఉన్నవారినిసైతం రసాయన ప్రయోగంతో సులువుగా మట్టు బెట్టే కుతంత్రాలను అమలు చేస్తాడు. ఈ ఆరోగ్య విపత్తు నుంచి ఉక్రెయిన్‌ను రక్షించకపోతే ప్రపంచ చిత్రపటంలో ఉక్రెయిన్ కనుమరుగయ్యే ప్రమాదం సమీపంలోనే ఉంది. ప్రపంచఆరోగ్యసంస్థ, ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ వేదికలు తక్షణమే యుద్ధవిరమణకు కార్యాచరణ ప్రారంభించాలి. నిత్యజీవనమే గగనంగా మారుతున్న ఉక్రెయిన్‌కు అటు పాశ్చాత్య దేశాలన్నీ బాసటగానిలవాలి. ఆర్థికంగాను, వనరులు, నిత్యా వసరాల సరఫరాపరంగా ఆదుకోకపోతే ఆకలిచావులతో పాటు వైరస్‌లు చుట్టుముట్టి ఇక ఉక్రెయిన్ కనుమరుగయ్యే ముప్పుతప్పదన్న హెచ్చరికలను అగ్రరాజ్యాలపెద్దలు వెంటనే పరిగణనలోనికి తీసుకోవాలి. అటు నాటోకూటమితోపాటు అభివృద్ధిచెందిన దేశాలు యుద్ధసాయంతోపాటు యుద్ధనివారణకు సైతం రష్యాపై ఒత్తిడి పెంచకపోతే ఈ బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ల ముప్పు ఇరుగు పొరుగు దేశాలకు సైతం విస్తరించక మానదు. అప్పుడు, ఇపుడున్న వైరస్‌లకు తోడు ప్రపంచదేశాలకు ఈ కొత్త ఎఎంఆర్ ఇన్ఫెక్షన్‌ను మనమే అందించినవారం అవుతాం. ఇప్పటివరకూకరోనా, హెచ్‌ఎంపివి, బర్డ్‌ఫ్లూ వైరస్‌లను ఎదుర్కొంటున్న ప్రపంచం తక్షణ కార్యాచరణకు దిగకపోతే ఈ కొత్త యాంటీ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లపేరిట కొత్త వైరస్ ప్రపంచదేశాలను ముఖ్యంగా యూరోపియన్ దేశాలను చుట్టుముట్టే ప్రమాదం లేకపోలేదు. ఈతరుణంలో యుద్ధాన్ని విరమింపచేస్తానని ఎన్నికల్లో ప్రకటించిన అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ఈబృహత్తర బాధ్యతను తన భుజాలపై వేసుకోకుంటే ఉక్రెయిన్ మానవాళికి ఎఎంఆర్ ముప్పు మరో మహమ్మారి అవుతుందని భావించక తప్పదు.

జీవితం అంతకంతకూ తన్మయత్వం నొందించే సాహసకార్యంలా కనిపిస్తుంటుంది. అందులో మనం నేర్చుకోవలసింది, చేయవలసింది ఎంతో ఉంది.



నెహ్రూ

డబ్బులేని వారిని చట్టం శాసిస్తుంది. చట్టాన్ని ధనవంతులు శాసిస్తారు.



గోల్డ్‌స్మిత్

# ఆకాశం ప్రమాదాలకు నిలయం కాకూడదు

**సరైన శిక్షణ లేకుండా అవసరాలకు పైలట్ల సంఖ్య పెంచి వినియోగించుకోవడం మొదలుపెట్టే సాంకేతిక పొరపాట్లతో పాటు అనుభవరాహిత్యం వల్ల ఎక్కువ తప్పిదాలు జరిగే అవకాశాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దేశాల మధ్య ముఖ్యంగా సరిహద్దు దేశాలమధ్య విభేదాలు చీటికి మాటికి తలెత్తుతున్న నేపథ్యంలో ప్రమాదాలు నివారించడానికి ముందు జాగ్రత్త చర్యలతోపాటు సరైన శిక్షణ సంబంధిత చోదకులకు చాలా అవసరం. ప్రభుత్వాలు ఇందుకు సంబంధించిన విషయాలపై తక్షణం స్పందించటమే కాకుండా అవగాహనతో కూడిన చర్యలు తలపెట్టిన నాడు చాలా వరకు మనుషుల తప్పిదాలవల్ల సంభవించే ప్రమాదాలు నివారించవచ్చు.**



రావులపాటి సీతారాంరావు

విమానాలు ఆకాశంలో పిట్టల్లా రాలిపోతున్నాయి. విమానయానం సుఖం అని అనుకుంటున్నవారు కూడా విమానాల ప్రమాదాల గురించి పెద్దగా పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది.! ఇన్ని విమానాశ్రయాలు పెంచుతున్నాం అంటూ విమానాల సంఖ్య, రవాణా పెంపుదలకు సంబంధించిన సమస్త వివరాలు ఇచ్చే అన్ని దేశాల ప్రభుత్వాలు ఇంత ముఖ్యమైన విషయంలో విమానాల్లో ప్రయాణించే వారితోపాటు సమాజానికి ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, ప్రమాదాల కారణాల గురించి, తెలియచెప్పకపోవడం ప్రభుత్వాలు, విమాన సంస్థలూ, తమ బాధ్యతలను విస్మరిస్తున్నారని అనుకోకతప్పదు. వివిధ దేశాల మిలటరీల తగాదాలకు తోడు మిలిటెంట్లు, తీవ్రవాదులు సృష్టించే అనుకోని సంఘటనలూ, వాటితోపాటు కారణాలు అర్థంకాని రీతిలో టేకాఫ్ సమయంలో, ల్యాండింగ్ సమయంలో జరిగే ప్రమాదాలు, విమానాల రక్షణ సంబంధిత విషయాలు ఆలోచించేవారికి వణుకు పుట్టిస్తున్నాయి. గతంలో ఒక విమాన ప్రమాదం అందులో ప్రయాణీకులు ఉన్న విమానానికి ఏదైనా ఆపద సంభవిస్తే ప్రపంచమంతటా అదొక పెద్ద సెన్సేషనల్ న్యూస్ అయ్యేది. తక్షణ నివారణ చర్యలతోపాటు అలాంటి ప్రమాదం ఎలా సంభవించి ఉండవచ్చు అన్న విషయం మీద కూలంకషంగా విచారణలు జరిగేవి. ప్రజలకు స్పష్టంగా కారణాలు తెలిసేవి. విమానయానం మీద విశ్వాసం పెరిగేది. మరొక రవాణా సౌకర్యంకల్పిస్తున్న రహదారులు కూడా యమగుండాలుగా మారిపోతున్నాయి. ఇదివరకు ఎప్పుడో ఒకప్పుడు రోడ్డు ప్రమాదం జరిగేది. బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న నదిలో ఎత్తుమీది నుంచి పడిపోవడంతో పదిమంది ప్రాణాలు వదిలారు అన్న వార్త పత్రికల్లో చదవగానే దాదాపు ఆ చుట్టుపక్కల ఉన్నగ్రామాల ప్రజలు తండోపతండాలుగా ఆ ప్రమాద స్థలం వీక్షించటమే కాకుండా అనేక విశ్లేషణలు అందించడంతోపాటు ప్రమాదంలో చిక్కుకున్న కుటుంబాలవారికి నాలుగు ఓదార్పుమాటలు చెప్పి, అందులో డబ్బులేని వారికి తృణమో పణమోఅందించి రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలగురించి ప్రభుత్వ పెద్దలతో చర్చించి తగు రీతిలో నివారణ చర్యలు తీసుకొనేవారు. ప్రభుత్వాలు కదిలివచ్చి ప్రతిదానికీ సహాయపడాలన్న ఆలోచన అప్పటికి రాజకీయ స్వార్థం ఉండకపోవడం వల్ల కలగకపోయి ఉండవచ్చు. ఆకాశంలో ప్రయాణం, రహదారుల మీద ప్రయాణం, నీళ్లలో ప్రయాణం అన్ని ప్రయాణాలూ ప్రమాద భరితంగా మారాయి. చేరాల్సినచోటుకుచేరకుండా, స్వర్గమో నరకమో తెలియని స్థలానికి, అకస్మాత్తుగా ప్రయాణించడం ఆపే బాధ్యత ప్రభుత్వాలూ, సంబంధిత అధికారులూ ప్రజలూ సక్రమరీతిలో ఎందుకు తీసుకోలేకపోతున్నారు? యాక్సిడెంటల్ ప్రమాదాలు ఎక్కడ జరిగినా అనుకోని రీతిలో, మనుషుల ప్రమేయం లేని రీతిలో ప్రమేయంతోనో దెబ్బకు దెబ్బ తీయడానికో గగన సీమలో ఆధిపత్యం సంపాదించుకోవడానికి జరిగే ఈ విమానాల విధ్వంసం వల్ల ఘోర ప్రాణనష్టం కలిగించే ఎంతపెద్ద దేశానినైనా మానవాళి క్షమించకూడదు. సాంకేతిక తప్పుల వల్లనో అలాంటి కారణాల వల్లనో జరిగే నష్టాలకు సంఘటనలకు, మాత్రమే ఈ విశ్లేషణ పరిమితమవటం సమంజసం. ఆకాశంలోని విధ్వంసకాండ ఈ మధ్య పెరుగుతుండటంవల్ల తగుస్థాయిలో ఇలాంటి సంఘటనలు అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతగానో ఏర్పడింది. 1983 సెప్టెంబర్ ఒకటి నాడు కొరియన్ ఎయిర్‌లైన్స్ జెట్ ఫ్లయిట్ 007ను పేల్చివేయడం, గడిచిన సంవత్సరాలలో జరిగిన ప్రముఖ దుర్ఘటనగా లెక్కేసుకుంటే ఆ తర్వాత కాలంలో ఎన్నో జరగటంఅత్యంత దారుణంగా భావించక తప్పదు. ఆధునిక విజ్ఞానం ధ్వంస రచనకు ఉపయోగపడటం ఘోరమైన పాపంగా పరిగణించి ప్రపంచ దేశాలు తగు విధమైన శిక్షలతోబాటు ఇలాంటి దుర్ఘటనను కట్టడి చేసినప్పుడే భవిష్యత్తు బాగుంటుంది.



ఈ దుర్ఘటనలో 246 మంది ప్రయాణికులతోపాటు 23 మంది క్రూ మెంబర్స్ మరణించారు. న్యూయార్క్ నుంచి సియోల్‌కు ప్రయాణిస్తున్న ఈ విమానాన్ని రష్యన్ ఎయిర్ ఫోర్స్ సుఖోయ్‌ఫైటర్‌ప్లేన్, కొరియన్ విమానం నావిగేషన్ ఎర్రర్ వల్ల ఫ్లైట్‌పాత్ తప్పటంతో కూల్చేసింది. మరింత దురదృష్టకరమైన విషయం ఏమిటంటే ఈ కూల్చివేయబడ్డ విమానంలో హన్స్ఎప్రామ్ సన్-యాబ్ కూతురుఉండటం, హాన్స్ విమానప్రమాదాల్లో చనిపోయేవారి కోసం ఒక సంస్థను నిర్మించిన వితరణ శీలి కాప్టన్ ఎ రంగనాథన్ అనే పైలట్ ఇన్‌స్ట్రక్టర్ ఈ విషయాలన్ని ఒక ప్రముఖ దినపత్రికలో రాసిన వ్యాసం వల్ల తెలియని విషయాలు చాలా తెలిసాయి. 1988 జులై 3న ఇరాన్ విమానాన్ని (ఫ్లైట్655)ను యు.యస్ నావీ వార్‌షిప్ కూల్చేసింది. 290 మంది ఈ దుర్ఘటనలో చనిపోయారు. పొరపాటున నేవీ మిసైల్ ఈ విమానాన్ని ఫైటర్ ప్లేన్‌గా భావించి కూల్చేసింది. ఇలాంటి పొరపాట్లు, గ్రహపాటు వల్ల ఎన్నో జరిగినా, ఇక ముందు పొరపాట్లకు 'సారీ' చెప్పటంతో సర్దేయకుండా నిర్దిష్టమైన చర్యలు తలపెట్టినప్పుడే యాక్సిడెంటల్‌గా జరిగే విమాన ప్రమాదాలతోపాటు ఇలాంటి సాంకేతిక తప్పుల వల్ల జరిగే ప్రమాదాలు కూడా అనవసరంగా పెరిగే ప్రమాదం ఉంది. గుర్తింపు లోపాల వల్ల ఇలాంటి ప్రమాదాలు జరగడం ఈ ఆధునిక యుగంలో అందునా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆయుధంగా మారిందని ఉబ్బితబ్బిబ్బు అవుతున్న దేశాలకు ఎంతటి ఘోరమైన అవమానంగా భావించాలి? ట్రాక్ డీవియేషన్, వాతావరణ మార్పుల వల్లనో, నావిగేషన్ సిగ్నల్స్ అందనప్పుడో పొరపాట్లు జరిగినప్పుడు నిర్దిష్టమైన నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉంది. ఉదాహరణకు 2017, ఫిబ్రవరి 16 నాడు ఇండియన్ జెట్ ఏర్‌వేస్ ఫ్లైట్ 330 మంది ప్రయాణీకులతో, 15 మంది కూమెంబర్లతో ముంబాయి నుంచి లండన్‌కు వెళ్తున్నది. 36వేల ఫీట్ ఎత్తుపై ఫ్లైట్ ఇన్‌ఫర్‌మేషన్ ప్రాంతాల మీదుగా, రేడియోకాంటాక్ట్ మెయిన్‌టైన్ చేయకుండా ఎగురుతున్నప్పుడు ట్రాక్ నుంచి డీవియేట్ కానప్పటికిని, జర్మన్ ఎయిర్‌స్పేస్ అవటం వల్ల యూర్ ఫైటర్స్‌ను ఇంటర్ సెప్ట్ చేయడానికి డిప్లాయ్ చేయడంతో జెట్ ఎయిర్‌వేస్ ఫ్లైట్ పొరపాటు గ్రహించి వెంటనే ఎమర్జెన్సీ ఫ్రీక్వెన్సీ ద్వారా జర్మన్ కాల్స్‌కు స్పందించింది. దాంతో పెద్ద ప్రమాదం తప్పింది. నిర్దిష్టమైన ట్రయినింగ్ ప్రోగ్రామ్స్ మనదేశం ఈ ఫీల్డ్‌లో ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనాఉంది. సిగ్నల్స్ జామ్‌అయితే ఏం చేయాలో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ఉన్నాయి. వాటిని శిక్షణ ద్వారా నిరంతరం పైలట్లనూ, క్రూనూ తీర్చిదిద్దటం వల్ల అనవసరపు తప్పిదాలు, నావిగేషన్ పొరపాట్లు జరిగినా బయటపడేందుకు మార్గాలు తెలుసుకున్న వారవుతారు. ఆ విధంగా ప్రమాదాలను నివారించే అవకాశాలుపెరుగుతాయి. సరైన శిక్షణ లేకుండా అవసరాలకు పైలట్ల సంఖ్య పెంచి వినియోగించుకోవడం మొదలుపెడితే సాంకేతిక పొరపాట్లతో పాటు అనుభవరాహిత్యం వల్ల ఎక్కువ తప్పిదాలు జరిగే అవకాశాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దేశాల మధ్య ముఖ్యంగా సరిహద్దు దేశాలమధ్య విభేదాలు చీటికి మాటికి తలెత్తుతున్న నేపథ్యంలో ప్రమాదాలు నివారించడానికి ముందు జాగ్రత్త చర్యలతోపాటు సరైన శిక్షణ సంబంధిత చోదకులకు చాలా అవసరం. ప్రభుత్వాలు ఇందుకు సంబంధించిన విషయాలపై తక్షణం స్పందించటమే కాకుండా అవగాహనతో కూడిన చర్యలు తలపెట్టిన నాడు చాలా వరకు మనుషుల తప్పిదాలవల్ల సంభవించే ప్రమాదాలు నివారించవచ్చు. ఆకాశంలో అలావుంటే, రోడ్లమీద పరిస్థితులు రోజురోజుకూ ఘోరంగా దిగజారుతున్నాయి. రోడ్డు ప్రయాణం సుఖవంతంగా మార్చాలంటే రహదార్ల తక్షణం పద్ధతి ప్రకారం బాగు చేయక తప్పదు. కనీసం రోడ్ల మీద గతుకులను అయినా పూడ్చివేసి వాహనాలు తిరిగే రీతిలో సిద్ధపర్చకపోతే యమపురికి సిమెంట్ రోడ్డువేసినట్లుగానే భావించక తప్పదు. రోడ్డుకు సంబంధించిన రూల్స్, ట్రాఫిక్ సిగ్నల్స్ స్వయంగా పాటించాల్సిన నిబంధనలను పక్కకు పెట్టిప్రభుత్వాలనూ ట్రాఫిక్ పోలీసులనూ మాటిమాటికీ తప్పుపడితే ప్రయోజనం ఏముంది? నష్టం రోడ్డును ఉపయోగించే ప్రజలకు తప్ప! రోడ్ల మీద జరిగే ప్రమాదాల నివారణ గురించి ఎన్నో సూచనలూ, సలహాలూ, (సంబంధించిన సాహిత్యం పంచిపెట్టడం లాంటివి)ఎన్నోఅనుభవపూర్వకంగా పొందుతున్నాం. కానీ 'రోడ్ సెన్స్'ను ఏర్పరుచుకొని ఆచరణలో పెట్టడానికి మాత్రంసిద్ధపడటం లేదు. ఇతరదేశాలు ఎంతో ముందున్నాయి. ట్రాఫిక్ సెన్స్ పాటించడంతో అని చెప్పుకొని సంతోషపడుతున్నాం కానీ మనం ఈ విషయంలో వెనుకబడి ఎంతో నష్టపడుతున్నాం అని గ్రహించలేకపోతున్నాం. ప్రగతి ఈ విషయంలోనైనా సాధించే ప్రయత్నంలో ఉందాం. ●

# దశాబ్దపు నుంచి నీతి ఆయోగ్ పాత్ర ఏమిటి?

డాక్టర్. పిఎస్. చారి

నీతి ఆయోగ్ అనేది భారతప్రభుత్వం ప్రధాన విధానం. 65 సంవత్సరాల వారసత్వాన్ని కలిగి ఉన్న ప్రణాళికా సంఘం స్థానంలో నీతిఆయోగ్ భర్తీ చేయబడింది. దేశం ఆర్థికవృద్ధికి ఊతమిస్తుందని భావిస్తున్న ప్రధాన విధాన రూపకల్పన సంస్థ. ఇది భారతదేశం ప్రపంచంలోనే ప్రధాన ఆర్థికవ్యవస్థగా ఎదగడానికి సహాయపడుతుంది. ప్రజలు తమ భాగస్వామ్యం ద్వారా పరిపాలనలో అభివృద్ధితోపాటు, కార్యక్రమాల అమలుకోసం సాంకేతికతను మెరుగుపరచడం, సామర్థ్యాన్ని పెంపొందించడం, సంభావ్యతను బలోపేతం చేయడానికి అవసరమైన వనరుల గుర్తింపుతోసహా కార్యక్రమాల అమలును సమర్థవంతంగా పరీక్షించడం, అంచనా వేయడం, జాతీయ అభివృద్ధి ఎజెండా లక్ష్యాల అమలుకు అవసరమైన ఇతర కార్యకలాపాలను చేపడుతుంది. నీతి ఆయోగ్‌లో భారతప్రధాని చైర్‌పర్సన్. పాలకమండలిలో అన్నిరాష్ట్రాల ముఖ్యమంత్రులు భారతదేశంలోని కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు ఉంటారు. ఒకటి కంటే ఎక్కువ రాష్ట్రాలను ప్రభావితం చేసేనిర్దిష్ట సమస్యలు అవకాశాలను పరిష్కరించడానికి ప్రాంతీయ కౌన్సిల్‌లు సృష్టించబడతాయి. ఇవి నిర్ణీతకాలానికి ఏర్పాటు చేయబడతాయి. ఇందులో రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు ఉంటారు. నీతి ఆయోగ్ సమర్థవంతమైన పాలన ఏడుస్తంభాలైన ప్రజల అనుకూల, అనుకూల కార్యాచరణ, ప్రజల భాగస్వామ్యం, సాధికారత, అందరినీ చేర్చడం, సమానత్వం, పారదర్శకత మొదలైనవిపై ఆధారపడి ఉంటుంది. నీతిఆయోగ్ ప్రచురించిన పత్రాలు మొదటిది 15సంవత్సరాల విజన్, ఇదిరాబోయే 15సంవత్సరాలలో దేశంమొత్తం లక్ష్యాలను కలిగి ఉంటుంది. రెండవది 7సంవత్సరాల 'వ్యూహం', ఇది ఆ లక్ష్యాలు లక్ష్యాలను రెండుభాగాలుగా విభజిస్తూ వచ్చే ఏడు సంవత్సరాల అభివృద్ధి రోడ్‌మ్యాప్‌ను నిర్దేశిస్తుంది. థర్డ్ అండ్ ఫైనల్ అనేది 'మూడుసంవత్సరాల యాక్షన్ ఎజెండా', ఇదిరాబోయే మూడుసంవత్సరాల కాలవ్యవధిలో సాధించాల్సిన పనులు లక్ష్యాలను తెలియజేస్తుంది, వ్యూహాన్ని మరింతగా రెండు భాగాలుగా విభజిస్తుంది. నీతిఆయోగ్ భారతదేశంలో ప్రణాళిక ప్రాథమిక స్వభావాన్ని మార్చింది. పాలసీ మేకింగ్‌లో మార్పు, కొత్తఆవిష్కరణలు, వ్యూహాత్మక కార్యక్రమాలు, వివిధ విభాగాల మధ్య సమన్వయం, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, డిజిటలైజేషన్, ఆరోగ్యం, విద్య నీటి నిర్వహణలో రాష్ట్రాల పనితీరును కొలిచే సూచీలు, సాంకేతిక నిపుణుల జోక్యం మొదలైనవి నిర్దేశిస్తుంది. ఇది ప్రణాళిక ప్రక్రియలో రాష్ట్రాల ప్రమేయాన్ని పెంచింది. ఉదా: కేంద్రప్రాయోజిత పథకాలు, స్వచ్ఛభారత్ స్కిల్ డెవలప్‌మెంట్‌ల పునరుద్ధరణపై ముఖ్యమంత్రుల మూడు ఉపసమూహం హోస్ట్ చేయబడింది. దేశవృద్ధికి దోహద పడే కార్యక్రమాలను సంభావితం చేయడంలో నీతి ఆయోగ్ ముందంజలో ఉంది. ఉదా: డిజిటల్ చెల్లింపు కోసం రోడ్ మ్యాప్, సుస్థిరఅభివృద్ధి లక్ష్యాల అమలు పర్యవేక్షణ మొదలైనవి. ఇదిరాష్ట్రాల మధ్య సహకార భావంతోపాటు పోటీ సమాఖ్య వాదాన్ని పెంపొందిస్తుంది. ఉదా: వివిధ అభివృద్ధి పారామితులపై ర్యాంకింగ్‌ను విడుదల చేయడం. నీతి ఆయోగ్‌కింద స్థాపించబడిన అటల్ ఇన్నోవేషన్మిషన్, భారత దేశంలో ఇన్నోవేషన్ పర్యావరణ వ్యవస్థను మెరుగుపరచడంలో ప్రశంసనీయమైన పనిచేసింది. నీతిఆయోగ్ విజయాన్ని ఇలా చెప్పుకోవచ్చు. కొన్ని సమస్యలు కూడా ఉన్నాయి. ప్రైవేట్ లేదా పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్‌ను ప్రభావితం చేయడంలో నీతి ఆయోగ్ పాత్రలేదని చెప్పుకోవచ్చు. భారతీయ సమాజంలో అసమానత పెరుగుతూనే ఉంది. ప్రభుత్వ చర్యలలో సానుకూల మార్పు తీసుకురావడానికి అవసరమైన శక్తి లేకపోవడంతో నీతిఆయోగ్ ఒక మహిమాన్వితమైన సిఫార్సుల సంస్థగా రూపాంతరం చెందింది. కొత్త ప్రణాళికా సంఘానికి తగిన వనరులులేవు. ఇటీవలికాలంలో సంస్థ రాజకీయాకరణ చెందిందనీ, దేశంలో నిర్మాణ సమస్యలను పరిష్కరించడానికి ఇప్పటికీ పరిష్కారాలు అందుబాటులో లేవని ఆరోపణలున్నాయి. నీతిఆయోగ్ మరింత ప్రభావ వంతంగా చేయడానికి చర్యలు తీసుకోవాలి. ప్రణాళికా సంఘాన్ని అవసరమైన అధికారాలతో సన్నద్ధం చేయడం, తగిన వనరుల కేటాయింపు అవసరం ఉంది. ●

# ప్రజావాక్కు



## విద్యార్థులపై చదువుల భారం

**రేపటి** భవిష్య భారత దేశానికి మూల స్థంభాలైన విద్యార్థులు విద్యాసంస్థలు పెట్టేఒత్తిళ్లకు బలవుతున్నారు. వారానికి ఏడు రోజుల పాటు రోజుకు పన్నెండు పధ్నాలుగు గంటల పాటు చదువులపేర విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థలలో బందీలుగా జీవితం గడుపుతూ అతి విలువైన తమ బాల్యాన్ని ర్యాంకులవేటలో పడి పోగొట్టుకుంటున్నారు. ఈఒత్తిడిని తట్టుకోలేక అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైమరీ పాఠశాలల్లో ఉదయం 9గంటలనుండి సాయంత్రం 4గంటల వరకు, యు.పి, ఉన్నత పాఠశాలల్లో ఉదయం 9గంటల నుండి సాయంత్రం 5గంటలవరకు మాత్రమే తరగతులు నిర్వహించాలి. వీటిలో కూడావారానికి మూడు రోజులు గంటపాటు వ్యాయామం, క్రీడలకు కేటాయించాలి. ప్రభుత్వంఇప్పటికైనా స్పందించి నిబంధనలకు అనుగుణంగా తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి.

-సి.హెచ్.ప్రతాప్, కోటి వీధి, శ్రీకాకుళం

## పేదలకు మాత్రమే పథకాలు

**అందరికి** ఇల్లుఅనే సూత్రం ఇందిరా గరిబీ హఠావో నినాదంనుండినాలుగోపంచవర్ష ప్రణాళిక కాలంనుండి బాహ్య ప్రపంచంలోకివచ్చి 5వప్రణాళిక కాలంలో పేదరిక నిర్మూలనే పరమావదిగ ప్రాణాళిక రూపొందింది. అయితే ఇప్పటికీ దేశంలో దాదాపు పావు శాతం మందికి సొంత ఇల్లు కలలాగే ఉంది మరోవైపు పేదవాళ్ళు మరింత పేదరికంలోకి వెళ్లగా ధనికులు మరింత ధనికులుగా మారుతున్న విచిత్రపరిస్థితి ఉంటుంది. సామాజిక సంక్షేమంలో భాగంగా గౌరవప్రదమైన జీవితం గడపడం కూడా ఒక హక్కుగా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉంది. నిజమైన పేదలకు సంక్షేమ పథకాలు అందాలి.

-భారత అవినాష్, జనగామ

## ఆర్ఓఆర్ చట్టం అమలు ఎలా సాధ్యం?

**ధరణి-2020**చట్టంఅమల్లో పార్ట్-బికిందఉంది. పోయిన 20 లక్షల ఎకరాలకు పరిష్కారం చూపకనే భూభారతి 2025 చట్టం ఎలా అమలవుతుంది. ఏజెన్సీ చట్టాలరద్దు జరుపకుండా భూ భారతి చట్టం ఎలా అమలు చేస్తారు. స్వతంత్ర భారత్‌లో ఏజెన్సీ చట్టాలు అవసరమా? ఇకనైనా సమగ్ర పరిశీలనతో చట్టాలను సవరించాలి.

- డా॥ రావెళ్ళ వెంకటరామారావు, ఖమ్మం

## సినీరంగం పట్ల సానుకూల దృక్పథం

**దివంగత** సినీ ప్రముఖులతో సన్నిహితంగా ఉన్నది సినీరంగానికి. సహాయ సహకారాలు అందించినది హైదరాబాద్‌లో స్టూడియో నిర్మాణాలకి అనుమతులు జాగాలు ఇచ్చినది తెలుగునట దిగ్గజం ఎన్టీఆర్ విగ్రహాన్ని పార్లమెంటు ప్రాంగణంలో ఏర్పాటు చేసినది మద్రాసునుంచి తెలుగుచిత్ర పరిశ్రమను హైదరాబాద్‌లోకి తరలించినది కాంగ్రెస్ ప్రభుత్వాల్లో పనిచేసిన ముఖ్యమంత్రులే. కానీ సినిమా రంగం వచ్చి ముఖ్యమంత్రి అయిన వారు కాదు. గత కాంగ్రెస్ ముఖ్యమంత్రిల్లానే రేవంత్‌రెడ్డి కూడా సినీ రంగంపట్ల సానుకూల దృక్పథంతోనే ఉన్నారు. ఇటీవల ఆయనపై ప్రత్యర్థులు చేసిన విమర్శల్లో ఏమాత్రం నిజం లేదు.

-మిథునం, హైదరాబాద్

## భారత్‌పై అమెరికా ప్రభావం

**అమెరికా** అధ్యక్షుడిగానాలుగేళ్ల తరువాత మరల రెండవసారి పీఠాన్ని అధిష్టించిన మొదటిరోజే డోనాల్డ్ ట్రంప్ పలు ఫైళ్లపై సంతకాలుచేశారు. ఎన్.ఆర్.ఐ.ల మీదకొరడావిసిరారు. అమెరికాలో జన్మించిన విదేశీయుల పిల్లలకు పౌరసత్యం దక్కకుండా చేసారు. అదీగాక తనదేశంలో మూడో జాతిమనుషులు లేకుండా చేయడం, మొదలైన ఆలోచనలుఆయన మెదడులో గూడు కట్టుకున్నాయి. ఇంకా పూర్వపు అధ్యక్షుడు జో బైడన్ చేసిన నిర్ణయాలన్నిటిని రద్దుచేస్తానన్నారు. ఇక ఆయన వాగ్దానాల్లో ముఖ్యమైనవి ఉక్రెయిన్ - రష్యా మధ్య సంవత్సర కాలంగా జరుగుతున్న యుద్ధాన్ని ఆపుచేయడం, అలాగేఇజ్రయిల్ గాజా మధ్యసయోధ్యకుదర్చడం, మూడో ప్రపంచయుద్ధం జరగకుండా శాంతిని నెలకొల్పుతాననడం, ఇవే కనుక విజయవంతంగా తొం దరగా చేయగలిగితే నోబుల్ బహుమతికి అర్హుడవుతారు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## దేశ చరిత్రను మరుస్తున్న నాయకులు


**నేటి** యువతరానికి దశాబ్దాల నాటి భారతదేశ చరిత్ర ఆనాటి నాయకులు దేశానికి అందించిన సేవల గురించి తెలిసి ఉండకపోవచ్చు. దేశానికి మొట్ట మొదటి రాష్ట్రపతి, ప్రధాన మంత్రులుగా పనిచేసిన వారెవరో కొందరికి తెలిసి ఉండకపోవచ్చు. కానీ ఎంతో అనుభవజ్ఞులు విద్యావంతులు, వయసులో పెద్దవారు. ఆర్.ఎస్.ఎస్ చీఫ్‌గా ఎంతో కాలం బట్టి ఉంటున్న మోహన్ భగవత్‌కు దేశానికి స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చిందో తెలియకుండా ఎలా ఉంటుంది. స్వాతంత్ర్య సమర యోధులను అవమానించడానికి ఆయన ఆ వ్యాఖ్యలు చేసినట్టుంది.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

# బంజార భాషకు ఏదీ రాజ్యాంగ గుర్తింపు?

జటావత్తనుము

బంజార భాష భారతదేశంలో గల ప్రాచీన భాషలలో ఒకటి. కానీ ఈ భాషకు లిపి లేని కారణంగా నిర్లక్ష్యానికి గురి అవుతూ అంతరించిపోయేదశలో ఉన్నదని చెప్పవచ్చు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మనదేశంలో మాతృభాషల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్రపంచీకరణ, సరళీకృత, ఆర్థిక విధానాలు ఒకవైపుమరోప్రక్క అమెరికన్ సామ్రాజ్యవాద సంస్కృతి తాకిడికి బలవుతున్న మాతృభాషల ఉనికి, మనుగడ కనుమరుగవక తప్పని పరిస్థితి దాపురించింది. ఆంగ్ల భాషనేడు అంతర్జాతీయంగా రూపాంతరం చెందడం కూడా వారి చలువే అన్నది జగమెరిగిన సత్యం. అందుకే ప్రపంచ వ్యాప్తంగా వేల సంఖ్యలో మాతృభాషలు అంతరించి పోతున్నాయి. అందులో బంజారాలు మాట్లాడే గౌర్‌బోలి భాష కూడా ఒకటి అనిచెప్పవచ్చు. అందుకు నిలువెత్తు సాక్ష్యంగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలల్లో తెలుగు భాషను ఆంగ్ల భాష అధిగమించినట్లు, తెలుగు కూడా అదే రీతిలో ఇతర గిరిజన భాషలను సైతం అధిగమిస్తున్నాయి. అందులో లంబాడీ (బంజార)భాష కూడా ఒకటి. లంబాడీ గిరిజన భాషకు నేటికీ గుర్తింపు లేదు, లిపి లేదు. వీరు మాట్లాడే భాషలు మౌఖికంగా నోటికే పరిమితం కావడం మూలాన అత్యంత నిరాదరణకు గురవుతున్నాయి. పర్యవసానంగా లంబాడీ (బంజార) తెగల ప్రత్యేక సాంస్కృతిక సాంప్రదాయాలు కనుమరుగవుతున్నాయి. భారత రాజ్యాంగంలోని 5,6 షెడ్యూల్‌లో పేర్కొన్న గిరిజన రాష్ట్రాల్లో 698 తెగలకు చెందిన 10 కోట్ల మంది జనాభా వుంది. మన దేశంలో మొత్తం 1652 భాషలుండగా, గిరిజనులు మాట్లాడే భాషలే సుమారుగా 600 దాకా ఉన్నాయి. భారత రాజ్యాంగంలో 8వ షెడ్యూల్‌లో ఇప్పటికీ 22 భాషలు అధికారికంగా గుర్తించబడగా, అందులో గిరిజనులు మాట్లాడే మణిపురి, బోడో, కొంకిణి, సంథాలీ భాషలకు మాత్రమే చోటు దక్కింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, లాంటి రాష్ట్రాలలోనే కాకుండా దేశవ్యాప్తంగా దాదాపుగా 20 రాష్ట్రాలలో నివ సిస్తున్న బంజారాలు దాదాపుగా 18 కోట్ల జనాభా కలిగి దేశంలో హిందీ తరువాత అత్యధికంగా తమ సంప్రదాయ భాష గోర్బోలిను మాట్లాడటం జరుగుతున్నది. కానీ అతి



పెద్దసమూహం కలిగిన లంబాడీ భాషకు రాజ్యాంగ బద్ధ గుర్తింపు విషయంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం జరిగింది. కానీ బంజారాలు మాట్లాడే భాష మిగిలిన భాషలు వలె కాకుండా అంతరించే దశలో ఉండటం కోసమెరపు. భాష ద్వారానే సంస్కృతీ సాంప్రదాయాలు ఆచారాలతో బంజారాలు తమ అస్తిత్వాన్ని కాపాడుకుంటున్నారు. కాని పాలక వర్గాలు బంజారాలతో పాటు కొన్నిరకాలతెగలభాషలకు లిపి లేదన్న సాకుతోనే ఇతర భాషలను వారిపై రుద్దడంతో విద్యాభివృద్ధికి, సమగ్రాభివృద్ధికి దూరమవుతున్నారు. 1956 హైదరాబాద్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌లో విలీనమై భాషా ప్రయుక్త రాష్ట్రంగా అవతరించిన తరువాత ఆదివాసీ, గిరిజన విద్యార్థుల మీద తెలుగు బలవంతంగా రుద్దబడింది. ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం గతపదేళ్ల క్రితం రాజీవ్ విద్యామిషన్ (ఆర్.వి.ఎం) ద్వారా బంజార భాషలో తెలుగు లిపితో ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు వాచకాలను ముద్రించి ప్రత్యేక పాఠశాలను నెలకొల్పి ఆయా భాషా సంబంధ బోధకులను కూడా నియమించింది. ఇలాకొంత ప్రయత్నం చేసినా, కాని కొన్ని సాంకేతిక లోపాల వల్ల నేడు పాఠశాలలు పని చేయడం లేదు. భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో గోర్‌బోలిని భాషను చేర్చలన్నా ఈ డిమాండ్ స్వాతంత్రం వచ్చినప్పటి నుండి వివిధరూపాల్లో పోరాడుతున్న, సమస్యను పరిష్కరించిన దాఖలాలు లేవని చెప్పవచ్చు. బంజార తెగ గుర్తింపు పరిరక్షణకు కీలకమైనది గోర్‌బోలి భాష. అది భాష మాత్రమే కాదు. అది బంజార ప్రజల హృదయం ఆత్మవంటిది. ఒకజాతి ఎప్పుడు అయితే తన భాషను పరంపరలో మరచిపోతుందో, తదనంతర కాలంలో భాషతో పాటు జాతి కూడా అంతరించిపోయే ప్రమాదం ఉన్నది. స్వాతంత్రం వచ్చి 75సంవత్సరాలు గడచిపోయిన, బంజారాల భాష గూర్చి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధవహించలేదు కానీ బంజారాలకు, భారతదేశం మొత్తంలో గిరిజనులుగా చేర్చి, భాషకు రాజ్యాంగ హోదా కల్పించాలి. కానీ ఈ దేశంలో వివిధ రాష్ట్రాలలో వివిధ పేర్లతో పిలువబడిన ఒకే భాష ఆచార సాంప్రదాయాలు, ప్రత్యేక లక్షణాలు కలిగినటువంటి తెగగా బంజారాలను గురించి చెప్తారు. ఇకనైనా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 344(1) 351 ప్రకారం రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యుల్లో గోర్‌బోలి భాషను చేర్చాలని, బంజారాల భాషకు తగిన ప్రోత్సాహం అందించి దశాబ్దాలకాలం నాటి డిమాండ్ను నేరవెరచి రాజ్యాంగహోదా కల్పించాలి. బంజార భాషకు న్యాయంచేయాలి. ●

మనవి — ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆ 90వేల మంది సరిహద్దులకే!

## ప్రభుత్వ వ్యయం తగ్గించే చర్యల్లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్, జనవరి 26:** రిపబ్లికన్‌నేత డొనాల్డ్ ట్రంప్ పదవిచేపట్టినప్పటి నుంచి ప్రభుత్వ వ్యయాలు తగ్గించే కార్యాచరణ చురుగ్గా ముందుకు తీసుకువెళుతున్నారు. దేశంలో పన్నులు వసూళ్లు చేసే ఇంటర్నల్ రెవెన్యూ సర్వీసెస్‌లో కొత్తగా చేరిన 90వేల మంది ఏజెంట్లను సరిహద్దులకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. లాస్‌వెగాస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన వెల్లడించారు. వారిలో 88 వేలమందికి ఉద్యోగాలు ఇవ్వడమో లేక నియమించుకునేందుకు ప్రయత్నించడమో చేసాం. ఇపుడు వారిని తొలగించడమో లేదా సరిహద్దులకు పంపించడమో చేసే ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. వారికి తుపాకులు ఇచ్చి బోర్డర్స్‌కు పంపించడమే సరైన పని అని భావిస్తున్నట్లు ట్రంప్ అన్నారు. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన కొన్ని గంటల్లోనే ఫెడరల్ ఉద్యోగుల నియామకాలను 90రోజులపాటు స్తంభింపచేస్తూ ఆదేశాలు జారీ చేసారు. జాతీయభద్రత, ప్రజారక్షణ విభాగాలకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. కానీ ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్ విభాగం మాత్రం ట్రంప్ కార్యవర్గం డిపార్టుమెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ ఆదేశాలు ఇచ్చేవరకూ ఆపేయాలి. మరోవైపు ట్రంప్ కొత్తతరహా ఎక్స్‌టర్నల్ రెవెన్యూ ఆఫీస్ ప్రారంభిస్తున్నారు. విదేశాల నుంచి పన్నులు ఇతర మార్గాల్లోవచ్చే ఆదాయాలను అదే వసూలు చేస్తుంది. తాజాగా అమెరికాలో కొత్తప్రభుత్వం కెనడా, మెక్సికోలపై భారీగా ట్యారిఫ్ విధించనున్నది. వీటిని కూడా ఆ కార్యాలయమే చూసుకుంటుంది. మరోవైపు అమెరికా ఫెడరల్ ప్రభుత్వానికి చెందిన డైవర్సిటీ, ఇంక్లూజన్ ప్రోగ్రామ్‌లను నిర్వీర్యంచేస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకంచేసారు. ఈక్రమంలోనే సిబ్బంది నిర్వహణ కార్యాలయం మెమో విడుదల చేసింది. ఈ మెమోప్రకారం డైవర్సిటీ ఈక్విటీ ఇంక్లూజన్ సిబ్బంది అందరినీ వేతనంతోకూడిన సెలవుపై పంపించాలని సంబందిత ఏజెన్సీలకు ఆదేశాలు వెళ్లాయి. ఈ విభాగాలకు చెందిన అన్ని వెబ్‌పేజీలను కూడా ఈ గడువులోగా తొలగించాలని ఉత్తర్వుల్లో స్పష్టంచేసారు. అదే సమయంలో డిఈఐ శిక్షనను తక్షణమే ముగించాలని ఆదేశించిన సంగతి తెలిసిందే.

**ఇజ్రాయెల్‌కు ఎంకె-84 బాంబుల సరఫరాకు ఓకే:** గాజాలో విధ్వంస తీవ్రతను తగ్గించేందుకు గత బైడెన్ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పక్కనపెట్టారు. ఇజ్రాయెల్‌కు రెండువేల పౌండ్ల బరువున్న బాంబులను అమెరికా సరఫరాచేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ విషయాన్ని శ్వేతసౌధం వర్గాలు వెల్లడించాయి. రానున్న రోజుల్లో దాదాపు 1800 ఎంకె-84 బాంబులను ఇజ్రాయెల్‌కు సరఫరాచేస్తారు. వీటిని బంకర్ బస్టర్లు అని కూడా పిలుస్తారు. ట్రంప్‌నిర్ణయాన్ని ఇప్పటికే పెంటగాన్‌ప్రతినిధులు ఇజ్రాయెల్‌కు వెల్లడించారు. గతంలో ఈ బాంబులను జనావాసాలపై వాడుతున్నారని ఆందోళనలు వ్యక్తం కావడంతో బైడెన్ వీటిని నిలిపేసారు. దీనితో అవి గోదాముల్లోనే ఉండిపోయాయి. ఈ నిర్ణయంతో ఇరుదేశాలమధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇజ్రాయెల్‌స్వయంగా దేశంలో ఈ బాంబులను తయారుచేసుకోవాలని నిర్ణయించింది కొన్ని రక్షణ సంస్థలకు కాంట్రాక్టులు కూడా ఇచ్చింది. వాస్తవానికి గతంలోనే సుమారు 10వేలకుపైగా ఎంకె-84 బాంబులను ఇజ్రాయెల్‌కు సరఫరాచేసింది. అమెరికాలో ఇజ్రాయెల్ రాయబారి మైక్ హెర్జోగ్ స్పందిస్తూ బైడెన్ నిర్ణయాన్ని ట్రంప్ రద్దుచేస్తారని ఆశాభావం వ్యక్తం చేసారు. తాజాగా ఎంకె-84 సరఫరాను పునరుద్దరిస్తూ అమెరికానిర్ణయం తీసుకోవడంతో ఇపుడు మళ్లీ ఈ బాంబులు సరఫరా మొదలవుతుంది.

# ఢిల్లీ ఎన్నికలు దేశం మొత్తం జరిగే రాజకీయ పోరు!

## ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్



**న్యూఢిల్లీ, జనవరి 26:** అసెంబ్లీ ఎన్నికలను మొత్తం దేశానికి జరుగుతున్న రాజకీయ పోరుగా భావించాలని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఈ ఎన్నికల్లో రెండు పరస్పర విరుద్ధ సిద్ధాంతాలమధ్య పోటీ నెలకొందని ఒకటేమో ప్రజాసంక్షేమంపై దృష్టిసారించగా మరొకటి కొంతమంది సంపన్నులకు ప్రయోజనం చేకూర్చుతోందని అన్నారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర సర్కారు గత ఐదేళ్లలో 400 నుంచి 500 మంది పారిశ్రామికవేత్తలకు చెందిన రూ.10 లక్షలకోట్ల రుణాలను మాఫీచేసిందని ఆరోపించారు. పన్ను చెల్లింపుదారుల డబ్బును ఎలా ఖర్చుచేయాలో ఈ ఎన్నికలకు నిర్ణయిస్తాయని బిజెపి మోడల్‌ప్రకారం రూ.వేల కోట్ల ప్రజాసొమ్మును ఆ పార్టీ తన సన్నిహితులకు రుణాలుగా ఇచ్చి ఆ తర్వాత మాఫీచేస్తుందని, అదే ఆప్ మాత్రం సామాన్యులకు మేలు చేకూర్చేలా ఉచిత విద్యుత్ విద్య వైద్యం రవాణా సౌకర్యాలపై దృష్టిపెడుతుందని ఢిల్లీలోని ప్రతి ఇంటికి నెలకు రూ.25వేల విలువైన ప్రయోజనాలు అందిస్తుందని కేజ్రీవాల్ అన్నారు. ఒకవేళ బిజెపిఅధికారంలోకి వస్తే స్థానికంగా ఆప్‌ప్రవేశపెట్టిన పథకాలన్నీ నిలిపివేస్తుందన్నారు. తాము ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఉచితాలుగా బిజెపి పేర్కొనడాన్ని కేజ్రీవాల్ ఖండించారు. ఒకవైపు బడా వ్యాపారులకు భారీ రాయితీలిస్తూ మధ్యతరగతి ప్రజల్లో మాత్రం అపారథ భావనను సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఉచిత విద్యుత్, మహిళలకు ఫ్రీబస్ వంటిపథకాలు నిలిపేస్తామని బిజెపి ఇప్పటికే చెప్పింది. ఒకవేళ ఆపార్టీ ఎన్నికైతే మీరు ఈ వ్యయాలు భరించగలరా అని ప్రజలను ప్రశ్నించారు. 70స్థానాలున్న ఢిల్లీ అసెంబ్లీకి వచ్చేనెల ఐదున పోలింగ్ ణిర్వహిస్తుండగా 8న ఓట్లలెక్కింపు చేపట్టనున్నారు.

# భారీ వర్షంతో కార్చిచ్చుప్రాంతానికి ఉపశమనం



**న్యూయార్క్, జనవరి 26:** అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లోని వేలభవనాలు భారీ విస్తీర్ణంలో అడవులు కార్చిచ్చుకు కాలి బూడిదైపోతున్నాయి. ఈ ప్రభావం తగ్గించేందుకు అగ్నిమాపక బృందాలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నవేళ వరుణుడు కరుణించాడు. కార్చిచ్చు ప్రభావిత దక్షిణ కాలిఫోర్నియాలో ఈ సీజన్ తొలివర్షం నమోదయింది. కొత్తగా మంటలు చెలరేగకుండా ఈ వర్షం కట్టడిచేస్తుందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో కాలిపోయిన కొండప్రాంతాలనుంచి వచ్చే విషపూరిత బూడిద ప్రవాహం కొత్త సమస్యలు తెచ్చిపెట్టే ప్రమాదముందనే ఆందోళన మొదలయింది. అగ్నిప్రభావితప్రాంతాల్లో వృక్షాలను తొలగించడం, ధ్వంసమైన రోడ్లను బాగుచేయడం వంటిపనుల్లో లాసేంజెల్స్ కౌంటీ సిబ్బంది నిమగ్నం అయ్యారు. ఇదే సమయంలో ఈప్రాంతంలో వర్షం కురవనున్నదని వాతావరణశాఖ వెల్లడించింది. కార్చిచ్చు ప్రభావిత ప్రాంతాల్లో శనివారం రాత్రి చిన్నపాటి వర్షం మొదలుకాగా మరో మూడురోజులు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కొన్నివారాలుగా ఉక్కిరిబిక్కిరి అవుతున్న అనేకప్రాంతాలకు ఈవర్షం ఊపిరిపోసినట్లయింది. మరోవైపు కొండ ప్రాంతాల్లో క్లౌడ్ బరస్ట్లు సంభవిస్తే శిలాలు బూడిద వంటివి దిగువప్రాంతాలను ముంచెత్తే ప్రమాదం ఉంది. ఇందుకోసం సిద్ధం కావాలని నేషనల్ వెదర్ సర్వీస్ వెల్లడించింది. కార్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బ్యాటరీలుభవన నిర్మాణ సామగ్రి ఫర్నీచర్లతోపాటు ఇతర వస్తువుల్లో ఉండే రసాయన పదార్థాలు అస్బెస్టాస్ ప్లాస్టిక్ సీసం వంటివి పర్యావరణంపై తీవ్రప్రభావం చూపనున్నాయనే ఆందోళన మొదలయింది. దీనితో ఈ కాలుష్య కారకాల ప్రభావాన్ని తగ్గించేందుకు స్థానిక ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నది.



# అమెరికా మాకు సైనిక సాయం ఆపలేదు

## ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

**వాషింగ్టన్, జనవరి 26:** విదేశాలకు అగ్రరాజ్యం అందించే అన్ని రకాల సాయాలను 90 రోజుల పాటు నిలిపేస్తూ కార్యనిర్వాహక ఆదేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేసిన విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుతం తమ దేశానికి అమెరికా సైనిక సాయం ఆపలేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు. కష్టసమయంలో సానుకూల నిర్ణయం తీసుకున్నందుకు అగ్రరాజ్యానికి కృతజ్ఞతలు తెలిపారు. 'ప్రస్తుతం ప్రపంచ దేశాలకు సాయాలను ఆపేస్తున్నట్లు అమెరికా ప్రకటించడంతో నేను ఆందోళనకు గురయ్యాను. కానీ, భగవంతుడి దయ వల్ల మాకు అందించే ఆయుధాలను అగ్రరాజ్యం ఆపలేదు' అని జెలెన్‌స్కీ అన్నారు. కాగా, రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్ తన సైనిక అవసరాల్లో 40 శాతం అమెరికాపైనే ఆధారపడింది. ఇప్పటికే 725 మిలియన్ డాలర్ల ప్యాకేజీ, 988 మిలియన్ డాలర్ల సామగ్రిని అందజేస్తామని మాజీ అధ్యక్షుడు జోబైడెన్ గతంలో ఉక్రెయిన్‌కు హామీ ఇచ్చారు. వాషింగ్టన్ నుంచి కీవ్‌కు 2022 నుంచి ఇప్పటిరకు 62 బిలియన్ డాలర్లు ఆయుధాలు, ఇతర సాయం అందించారు. ఉక్రెయిన్‌కు మరో500మిలి యన్ డాలర్ల ఆయుధ సాయం అందిస్తున్నట్లు కొన్నాళ్ల క్రితంనాటి రక్షణమంత్రి ఆస్టిన్ ప్రకటించారు. దాదాపు మూడేళ్లుగా జరుగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలుకుతానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. ఇటీవల ఆయన మాట్లాడుతూ యుద్ధం అనేది అసలు మొదలే కాకూడదని.. తాను అధ్యక్షుడిగా ఉంటే ఉక్రెయిన్‌లో సంక్షోభం వచ్చేది కాదని అన్నారు. త్వరలోనే దీనికి ముగింపు పలుకుతానని హామీ ఇచ్చారు. కీవ్‌లో శాంతి ఒప్పందంపై చర్చలకు రష్యా రాకపోతే.. ఆంక్షలు విధిస్తానని హెచ్చరించారు.

### మహాకుంభమేళా.. త్రివేణి సంగమంలో

# యుపి మాజీ సిఎం అఖిలేశ్‌యాదవ్ పుణ్యస్నానం



**లక్నో, జనవరి 26:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా వైభవంగా సాగుతోంది. దేశవిదేశాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. రోజుకు కోటి మందికి తగ్గకుండా కుంభమేళాలో పాల్గొంటున్నారు. ఆదివారం నాటికి కుంభమేళా ప్రారంభమై 14 రోజులు కాగా 14 కోట్ల మందికిపైగా ఈ మహా కుంభమేళాలో పాల్గొన్నారు. ఎంతోమంది ప్రముఖులు ఈ మహా కుంభమేళాకు తరలివస్తున్నారు. ఆదివారం భారత్‌కు చెందిన ప్రముఖ బాక్సర్ మేరీకోమ్ కుంభమేళాకు హాజరయ్యారు. కుంభమేళాలో పాల్గొనడం తనకు చాలా సంతోషంగా ఉందని ఆమె చెప్పారు. అదేవిధంగా ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేశ్‌యాదవ్ కూడా ఆదివారం కుంభమేళాలో పాల్గొన్నారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించారు. ఆ తర్వాత ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అఖిలేశ్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ మహా కుంభమేళాలో పాల్గొనడం తనకు ఆనందంగా ఉందని చెప్పారు. అయితే ఈ కుంభ మేళాను రాజకీయం చేయడం కరెక్టు కాదని అన్నారు. పాలకులు గొప్పలకు పోకుండా కుంభ మేళాను కుంభమేళా లాగానే చూడాలని అన్నారు. కుంభమేళాకు వచ్చిన భక్తులకు ఆటల పోటీల్లో పాల్గొన్నట్లు ఉండకూడదని, అన్ని సవ్యంగా జరగాలని పేర్కొన్నారు. వృద్ధులకు సరైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

# దేశానికి బిజెపినేతలుచేసిందేమీలేదు..ప్రగల్భాలే..!

## ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ, జనవరి 26:** భారత దేశం స్వాతంత్ర్యం సాధించడానికి తనకంటూ ఒక పరిపాలనా వ్యవస్థను ఏర్పరుచుకోడానికి కాంగ్రెస్ ఎంతో కృషిచేసిందని ఆపార్టీ అధినేత మల్లిఖార్జునఖర్గే పేర్కొన్నారు. ఇప్పటికి కూడా కాంగ్రెస్ రాజ్యాంగ రక్షణ దేశప్రజల్లో ఐక్యతకోసం నిరంతరం పోరాడుతోందని అన్నారు. కానీ దేశం కోసం ఏమీచేయని బిజెపినేతలు రాజ్యాంగాన్ని అవమాన పరుస్తున్నారని ఆందోళన వ్యక్తంచేసారు. బిజెపి ఆధ్వర్యంలోనికేంద్ర ప్రభుత్వం దేశంలో రాజ్యాంగ విలువలనుతుడిచిపెడుతోందని అన్నారు. ముఖ్యంగా మహిళల హక్కులను అణగదొక్కడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. భారత్‌నుప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా తీర్చిదిద్దుతాయని ప్రధాని పదేళ్లుగా చెపుతున్నారు. మనదేశం ఐదోస్థానానికి మించి ముందుకువెళ్లడంలేదని ఆగ్రహం వ్యక్తంచేసారు. కాంగ్రెస్ నేతృత్వంలోనియుపిఎ అధికారంలో ఉన్నపుడు భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఉంటే బిజెపి దానిని ఐదో స్థానానికి తగ్గించిందన్నారు. బిజెపినేతలు ప్రగల్భాలేకానీ దేశానికిచేసిందేమీ లేదన్నారు. కేంద్రం పేదప్రజలను చిన్నచూపు చూస్తూ ధనవంతులకు గరిష్టప్రయోజనాలు, సౌకర్యాలు కల్పిస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ ఇండోర్‌లో గాంధీభారత్ అనే కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. దేశ స్వతంత్రతను దెబ్బతీస్తూ స్వాతంత్ర్య సమర యోధులను విమర్శిస్తూ బిజెపిచేస్తున్న కుట్రలను ప్రజలకు వెల్లడిస్తామన్నారు. ప్రధానిమోడీ పాలనలో స్వయంప్రతిపత్తికల ఎన్నికల సంఘం ఈడీ, సిబిఐ తదితర వాటిలో రాజకీయ జోక్యం ఆనవాయితీగా మారిందన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అక్రమాలకు అడ్డులేకుండాపోతోందని ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేసారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారరని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిరంకుశధోరణి కారణంగా పార్లమెంట్ సమావేశాలు కూడా సరైన పద్దతిలో జరగట్లేదని అన్నారు. ఎస్టీ, ఎస్సీ,ఒబిసి మైనార్టీలను రెండోతరగతి పౌరులుగా చూస్తున్నారని అన్నారు.

# గ్రీన్‌లాండ్ కోసం డెన్మార్క్ ప్రధానికి బెదిరింపులు

## ఆ దేశాన్ని సుంకాలతో శిక్షిస్తానన్న ట్రంప్



**వాషింగ్టన్, జనవరి 26:** అమెరికా అధ్యక్ష పదవి చేపట్టిన కొన్ని రోజులకే డొనాల్డ్ ట్రంప్ ఇతర దేశాలపై బల ప్రదర్శనకు దిగుతున్నారు. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు డెన్మార్క్ ప్రధాని మెటె ఫ్రెడెరిక్సన్‌పై ట్రంప్ బెదరింపులకు పాల్పడ్డారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. డెన్మార్క్‌ను సుంకాలతో శిక్షిస్తానని ట్రంప్ ఫోన్ కాల్‌లో హెచ్చరించినట్లు ఆ కథనం పేర్కొన్నది. ఇటీవల వీరిద్దరి మధ్య 45 నిమిషాలపాటు సాగిన ఫోన్ కాల్ సంభాషణలో అధ్యక్షుడు ట్రంప్ తప అభిప్రాయాలను ఘాటైన స్వరంతో వినిపించారని సంబంధిత అధికారులు చెబుతున్నారు. గ్రీన్‌లాండ్‌పై ట్రంప్ మాటన్ని డెన్మార్క్ ప్రధాని తోసిపుచ్చటంతో, ట్రంప్ మాటల ధోరణి వేరే విధంగా మారిందని, ఒక దశలో బెదరింపులకు పాల్పడ్డారని ఆ అధికారులు పేర్కొన్నారు. ఇద్దరి మధ్య వాగ్వాదం కూడా చోటుచేసుకుందని, గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునే విషయంలో తాము సీరియస్‌గా ఉన్నామని ట్రంప్ చెప్పినట్లు సమాచారం. అయితే దానిని అమ్మడంపై తమకు ఎలాంటి ఆసక్తి లేదని డెన్మార్క్ ప్రధాని సమాధానమిచ్చారట. ఫోన్‌కాల్‌లో ట్రంప్ సంభాషించిన తీరుకు తాము దిగ్భ్రాంతికి గురయ్యాయమని అధికారులు వెల్లడించారు. డెన్మార్క్ తిరస్కరణతో అమెరికా నుంచి ప్రతీకార చర్యలు ఉండొచ్చని అభిప్రాయపడ్డారు.

# అవినీతికేసులో రాజపక్ష కుమారుడి అరెస్టు



**కొలంబో, జనవరి 26:** అవినీతికేసులో శ్రీలంక మాజీ దేశాధ్యక్షుడు వమీంద రాజపక్స కుమారుడు యోషితా రాజపక్షను అరెస్టుచేసారు. ఒక స్థిరాస్థికొనుగోలు కేసులో యోషితా రాజపక్స పాత్ర ఉన్నట్లు ఆరోపణలున్నాయి. బెలియట్టాప్రాంతంలో తన స్వంత ఇంట్లో మాజీ నేవీ అధికారి అయిన యోషితాను అదుపులోకి తీసుకున్నారు. 2015 కంటే ముందు తండ్రి మహీంద రాజపక్ష అధికారంలో ఉన్న సమయంలో యోషితా ఒక స్థిరాస్థి కొనుగోలు విషయంలో అవకతవకలకు పాల్పడినట్లు అభియోగాలున్నాయి. కాగా మహీందకు ముగ్గురు కుమారులున్నారు. వారిలోయోషితా రెండో వ్యక్తి. ఇదే ఆస్థికొనుగోలు అంవంలోమరో మాజీ అధ్యక్షుడు గోటబయ రాజపక్షను కూడా విచారించారు. తనకు సెక్యూరిటీ కల్పించాలని కోరుతూ ప్రాథమిక హక్కుల కింద మహీంద రాజపక్ష సుప్రీంకోర్టులో పిటిషన్ వేసారు. ఈనేపథ్యంలో ఆయన కుమారుడిని అరెస్టు చేయడం శ్రీలంకలో సంచలనంగా మారింది. గత ఏడాది నవంబరులో అనురకుమార దిశనాయకే శ్రీలంక అధనయక్షుడుగా ప్రభుత్వం ఏర్పాటుచేసారు. మహీంద పెద్దకుమారుడు నమల్ రాజపక్షను కూడా వేరొక స్థిరాస్థికేసులో పోలీసులు విచారణచేసారు. మహీంద రాజపక్ష పదవీకాలం 2005నుంచి 2015 మధ్య ఎవరు అవినీతికి పాల్పడినట్లు రుజువయినా వారిని అదుపులోకి తీసుకుంటామని విచారణ అధికారులు చెపుతున్నారు.

# గణతంత్ర వేడుకలకు తొలిసారిగా మణ్ణన్ తెగ గిరిజన రాజు



**న్యూఢిల్లీ, జనవరి 26:** గణతంత్ర దినోత్సవ వేడుకలకు మొట్టమొదటిసారిగా ఒక కేరళ గిరిజన రాజు హాజరయ్యారు. ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించిన ఈ వేడుకల్లో కేరళనుంచి ఒకగిరిజన రాజు సతీసమేతంగా హాజరయ్యారు. దేశ చరిత్రలో ఈ గిరిజన రాజు హాజరుకావడం ఇదే మొదటిసారి. ఆయనపేరు రామన్ రాజ మణ్ణన్. కేరళలో మణ్ణన్ తెగకు ఆయన రాజు. ఆదివారం భారత 76వ గణతంత్ర వేడుకలకు ఆయన అతిథిగా వచ్చారు. కేంద్రం తరపున షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు వెనుకబడిన తరగతుల సంక్షేమమంత్రి ఒఆర్‌కేలు ఆయనను వేడుకలకు ఆహ్వానించారు. ఒక గిరిజన రాజును భారత రిపబ్లిక్ వేడుకలకు ఆహ్వానించడం ఇదే తొలిసారి. రాజమణ్ణన్ కేరళలో ఉన్న ఏకైక గిరిజనరాజు. కేంద్రం ఆహ్వానంతో ఆయన తన సతీమణితో కలిసి ఢిల్లీకి చేరారు. ఢిల్లీలోని పలు ప్రాంతాలు కూడా సందర్శించారు. రిపబ్లిక్‌డే వేడుకల్లో పాల్గొన్న మణ్ణన్ తిరిగి ఫిబ్రవరి 2న కేరళకు వెళతారు. గిరిజన సంక్షేమశాఖ ఆయన ప్రయాణ ఖర్చులు భరిస్తున్నదని మంత్రి ఒఆర్‌కేలు చెప్పారు. కాగా వేడుకల్లో ఒఆర్‌కేసలు మణ్ణన్ సామాజికవర్గానికి చెందిన సాంప్రదాయ దుస్తుల్లో వచ్చారు. ఈ తెగకు చెందిన 300 కుటుంబాలకు రాజుగా రాజమణ్ణన్ కొనసాగుతున్నాడు. ఇడుక్కిజిల్లాలో ఆతడు నివసిస్తాడు. మణ్ణన్ తెగకు చెందిన వివిధ కార్యక్రమాలు పండుగల్లో రాజుకు ప్రత్యేక స్థానం ఉంటుంది.రామన్ రాజమణ్ణన్ 2012లో ఆర్యన్ రాజమణ్ణన్ మరణించిన తర్వాత తన తెగకు ఆయనేరాజుగా పాలిస్తున్నాడు. రాజయినా కూడా ఆడంబరాలకు పోని రాజమణ్ణన్ సాదాసీదా రైతుగానే కొనసాగుతున్నాడు. ఆతనికి రాజభవనంకానీ, రథం కానీలేవు. తన కుటుంబంతో కలిసి ఒక చిన్న ఇంట్లో ఉంటున్నాడు. స్థానికంగా తెగలో ఆయనకు ప్రత్యేక హక్కులు విధులు అంటూ ఏమీ ఉండవు. తెగ బయటి వారితో తెగకు సంబంధించిన వ్యవహారాలను మాత్రమే ఆయన పర్యవేక్షిస్తారు. అందుకు నలుగురు ఉపరాజులు, ఒక రాకుమారుడు, 50 మందిసభ్యుల మంత్రిమండలి తోడ్పాటునిస్తుంది.

# 100వ రాకెట్ సమయంలో డైరెక్టర్‌గా ఉండటం పూర్వజన్మ సుకృతం

## షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్



శ్రీహరికోటలో మీడియాతో మాట్లాడుతున్న డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, సిఐఎస్ఎఫ్ గౌరవ వందనం స్వీకరిస్తున్న డైరెక్టర్

**శ్రీహరికోట (తడ), జనవరి 26 ప్రభాతవార్త:** శ్రీహరికోట నుంచి 100వ రాకెట్ ప్రయోగం జరుగుతున్న సమయంలో తాను ఇక్కడ డైరెక్టర్‌గా పనిచేయడం పూర్వజన్మ సుకృతమని షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో ఎంతో ఉద్విగ్నతతో మాట్లాడారు. రాజరాజన్ ఆధ్వర్యంలో షార్ నుంచి ప్రపంచ అగ్ర దేశాలతో పోటీపడే రాకెట్ ప్రయోగాలు జరిగాయి. ఈ నెల 29న జిఎస్ఎల్‌వి-ఎఫ్15 పేరుతో 100వ రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీహరికోట ఇంత అభివృద్ధి చెందడానికి కారకులైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ స్థలాన్ని ఎంపిక చేసిన అంతరిక్ష పరిశోధకులు, గతంలో పనిచేసిన ఛైర్మన్లు, డైరెక్టర్లు, ప్రాజెక్టు డైరెక్టర్లు, ఎంతోమందికి రుణపడి ఉన్నట్లు చెప్పారు. షార్‌లో పనిచేయడం ఒక అదృష్టమని, అందులోనూ అత్యంత ప్రతిష్టాత్మకమైన 100వ రాకెట్ ప్రయోగ సమయంలో తాను డైరెక్టర్‌గా ఉండటం మరచిపోలేని జ్ఞాపకమన్నారు. 100వ రాకెట్ ప్రయోగం సందర్భంగా శ్రీహరికోటలో తుది ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన చెప్పారు. ఇక్కడ తాను డైరెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలోనే ఇస్రో కోసం కేంద్రప్రభుత్వం వేల కోట్లు నిధులు మంజూరు చేసిందని, అందులో మూడవ ప్రయోగ వేదిక ఒకటన్నారు. శ్రీహరికోట నుంచి కొత్త ఛైర్మన్ నారాయణన్ ఆధ్వర్యాన ప్రస్తుతం ఈ ప్రయోగం జరుపుతున్నామని ఆయన చెబుతూ గత ఏడాది స్పేడెక్స్ ఉపగ్రహాల అనుసంధానానికి శ్రీహరికోట నుంచి ప్రయోగించిన రాకెట్ విజయవంతం కావడం మరచిపోలేని దన్నారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్ము రిపబ్లిక్‌డే సందర్భంగా ఈ ఘనవిజయాన్ని ప్రస్తావించారని గుర్తు చేశారు.

షార్‌లో జరిగే ప్రతి గగన్‌యాన్ పరిశోధనకు ప్రధాని నరేంద్రమోడీ వంటి వారు పూర్తి సహకారం అందిస్తు న్నారని చెప్పారు. రాజరాజన్ వెంట డిడి పి.గోపీకృష్ణ, పిఆర్‌ఓ భాస్కరన్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తబడ్జెట్‌లోనే నూతన లేబర్‌కోడ్‌ల ప్రతిపాదనలు

**న్యూఢిల్లీ, జనవరి 26:** ప్రధాని మోడీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రానున్న బడ్జెట్‌లో కొత్త కార్మిక స్మృతిని ప్రవేశపెడుతోంది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ రాబోయే బడ్జెట్‌లో ఈ లేబర్‌కోడ్‌లను దశలవారీగా అమలుచేసే ప్రణాళికను ప్రకటించవచ్చని అంచనా. కొత్త లేబర్‌కోడ్‌లు మూడుదశల్లో వస్తాయి. ఉద్యోగులకు రోజువారి పనిగంటలు పెరుగుతాయి. అలాగే వారానికి నాలుగురోజులే పని చేసే అవకాశం ఉంటుంది. పిఎఫ్‌కోసం కట్‌చేసే సొమ్ము పెరిగితే ప్రతినెలా వచ్చే జీతం తగ్గుతుంది. ఈ కోడ్‌లు అమలుకు మేనేజ్‌మెంట్లకు కొంత గడువు ఇస్తారు. మూడుదశల్లో అమలు చేస్తారు. 2025-26 బడ్జెట్‌లోనే ప్రభుత్వం ఈకోడ్‌లనుప్రకటిస్తే వచ్చే ఆర్థికసంవత్సరంలో అమలుకు వస్తుంది. ఈ లేబర్‌కోడ్‌లు అటు యాజమాన్యాలకు అనువుగా ఉండటమేకాకుండా ఇటు ఉద్యోగులకు మెరుగైన సామాజికభద్రత కల్పించగలవని చెపుతున్నారు.

మొదటిదశలో 500కంటే ఎక్కువమంది ఉద్యోగులున్న పెద్ద కంపెనీలు ఈకోడ్‌లను అనుసరించాలి. రెండో దశలో 100 నుంచి 500 మంది ఉద్యోగులున్న మధ్యతరహా కంపెనీలను ఈ పరిధిలోకి తెస్తారు. మూడోదశలో 100 మందిలోపు ఉద్యోగులున్న చిన్న కంపెనీలపై ఈ కోడ్‌లు అమలుచేస్తారు. ఈ లేబర్‌కోడ్ కొత్తనియమాలు పథకం ప్రకారం ఈ నిబంధనలు అమలుచేయడానికి చిన్న సంస్థలకు సుమారు రెండేళ్లు పడుతుంది. దేశ వ్యాపార నిర్మాణంలో 85శాతం ఎక్కువ వాటా ఎంఎస్ఎంఇలదే. ఈ కోడ్‌లు అమలుకు రాష్ట్రాలతో కేంద్రం చర్చలు జరుపుతోంది. పశ్చిమబెంగాల్, ఢిల్లీ వంటి రాష్ట్రాలతో ముసాయిదా నిబంధనలు ఖరారు చేసేపనిలో కార్మికశాఖ బిజీగా ఉంది. మొదటిదశలో వేతనాలు, సామాజిక భద్రత కోడ్‌ను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. వచ్చే మార్చినాటికి అన్ని రాష్ట్రాలతో ముసాయిదా నిబంధనలు ఖరారు చేయాలని కేంద్రం యోచిస్తోంది.

# పంజాబ్, హర్యానాల్లో రైతు ట్రాక్టర్ల ర్యాలీ



**చండీగఢ్, జనవరి 26:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా పంజాబ్‌రైతులు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. తమ పంటలకు కనీస మద్దతుధరపై కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని డిమాండ్‌చేసారు. గణతంత్ర దినోత్సవం రోజున కేంద్రానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ట్రాక్టర్లతో రైతులు నిరసనలు తెలపాలని సంయుక్త కిసాన్‌మోర్చా జనవరి 8న పిలుపునిచ్చింది. ఈ క్రమంలో ఆదివారం పంజాబ్ హర్యానాలతోపాటు పలురాష్ట్రాల్లో రైతులు ట్రాక్టర్లతోర్యాలీ నిర్వహించారు.2024 ఫిబ్రవరి 13నుంచి పంజాబ్ హర్యానా సరిహద్దులోని ఖనౌరిలో రైతులు నిరసన కొనసాగిస్తున్నారు. పంటలకు కనీస మద్దతు ధరతోపాటు రుణమాఫీ, రైతులు కార్మికులకు పింఛన్లు 2021లో లఖింపూర్‌ఖేరీ హింసా బాధితులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. కేంద్రం తమ డిమాండ్లను నెరవేర్చకపోతే 2020 నుంచి 2021వరకూ ఢిల్లీ సరిహద్దుల్లో చేపట్టిన నిరసనలకంటే పెద్దఎత్తున దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని సంయుక్త కిసాన్‌మోర్చా మళ్లీ హెచ్చరించింది.

# జపాన్ టెక్నిక్‌తో కుంభమేళాలో స్వచ్ఛవాయువులు



**ప్రయాగరాజ్, జనవరి 26:** యూపిలోని ప్రయాగరాజ్ త్రివేణి సంగమంలోజరుగుతున్న ప్రపంచ అతిపెద్ద ఆధ్యాత్మిక మేళాకు యుపి ప్రభుత్వం స్వచ్ఛమైన గాలి వచ్చేందుకు కూడా ఏర్పాట్లు చేసింది. మహాకుంభమేళాకు కోట్లాదిభక్తజనం పోటెత్తుతున్నా స్వచ్ఛమైన గాలికి కొదవలేదు. కారణం జపనీస్ టెక్నిక్ అమలుచేస్తున్నారు. కుంభమేళా జనవరి 13న ప్రారంభం కాగా ఈ మహాఘట్టంకోసం యోగి సర్కారు రెండేళ్లక్రితమే కసరత్తుప్రారంభించింది. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ మియావాకి అనే జపనీస్ సాంకేతికతతో ప్రయాగరాజ్‌పరిధిలో చిట్టడివిని తయారు చేసింది. నగరంలో పదిచోట్ల 18.50ఎకరాల ఖాళీ భూమిలో ఐదు లక్షలకుపైగా 63 రకాల మొక్కలు నాటారు. ఆమొక్కలు ఇపుడు చెట్లుగా ఎదిగి ప్రతిరోజూ స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను వాతావరణంలోకి వదులుతున్నాయి. మియావాకి టెక్నిక్‌తో ప్రయా గరాజ్ మున్సిపాలిటీ సుమారు రూ.6కోట్లను ఖర్చుచేసింది. తక్కువప్రదేశంలో ఎక్కువ సం ఖ్యలో మొక్కలను నాటి పెంచడమే మియావాకి టెక్నిక్ ప్రత్యేకత. ఈ ప్రాజెక్టులో మర్రి, రావి, వేప, చింత, ఉసిరి, రేగి, వెదురు వంటి 63 రకాల చెట్లు ఉన్నాయి. వీటినిర్వహణ కాంట్రాక్టును మూడేళ్ల వ్యవధితో ఒక కంపెనీకి అప్పగించారు.

# ఆకలిలో 100వ స్థానం, అసమానతల్లో 50వ స్థానం

## బిజెపి, ప్రధాని మోడీ సమాధానం చెప్పాలి

### గణతంత్ర దినోత్సవాల్లో సిపిఐ కార్యదర్శి కూనంనేని

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** దేశంలో రాజ్యాంగ నిర్మాతల ఆశలు, అకాంక్షలకు భిన్నంగా పాలన కొనసాగుతోందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ పాలకుల విధానాల కారణంగా దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతికంగా అన్ని రంగాల్లో దిగజారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం ఎంతో అభివృద్ధి చెందిందని గొప్పలు చెబుతున్న పాలకులు ఆకలిలో 100వ స్థానం, మత సామర్యం, అసమానతల్లో 50 స్థానంలో ఉందని.. అన్నిరంగాల్లో ఎందుకు వెనబడి ఉన్నామో కేంద్ర పాలకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆదివారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో కూనంనేని సాంబశివరావు జాతీయ జెండాను ఎగుర వేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, ఎస్.బాల్ రాజు పాల్గొన్నారు. దేశం ఆర్థిక అభివృద్ధిలో ప్రపంచంలోనే 5వ స్థానంలో ఉందని పాలకులు గొప్పలు చెప్పుతున్నారని, ఇది ఈ దేశంలోని 90 శాతం ప్రజల కష్ట ఫలితమన్నారు. ప్రజలు కష్టపడి తమ చెమట చుక్కలను సంపదగా సృష్టించి పన్నుల రూపంలో చెల్లిస్తే, చీమలు పెట్టిన పుట్టలో పాములు చేరినట్లు, బిజెపి పాలకులు సంపదను బడా కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్నారని ధ్వజమెత్తారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రోడ్లపైకి వచ్చి ప్రశ్నించిన వారిని జైళ్లలో నిర్బంధిస్తుండగా, అడవుల్లో ఉండి ఉద్యమిస్తున్న మావోయిస్టులను అత్యంత కిరాతకంగా వేటాడి, వెంటాడి కాల్చి చంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**తెలంగాణ జనసేన పార్టీ కార్యాలయంలో..**

దేశవ్యాప్తంగా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అందులో భాగంగా తెలంగాణ జనసేన పార్టీ కార్యాలయంలో కూడా గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. తెలంగాణలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. త్వరలో ప్రారంభం కానున్న నూతన కార్యాలయ ప్రాంగణంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించారు. జనసేన తెలంగాణ ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్ జాతీయ జెండా ఎగురవేసి, వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రాధారం రాజలింగం, పార్టీ నాయకులు దామోదర్ రెడ్డి, రాము, వీర మహిళ చైర్మన్ మండపాక కావ్య, వైస్ చైర్మన్ నిహారిక నాయుడు, గ్రేటర్ నియోజకవర్గ ఇన్చార్జ్లు నాయకులు పాల్గొన్నారు.

# రాజ్యాంగరహిత మనువాద పాలనకు బిజెపి యత్నం

### గణతంత్ర దినోత్సవం పతాకావిష్కరణలో పిసిసి చీఫ్ మహేష్‌గౌడ్



ఆదివారం గాంధీభవన్‌లో 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కనబెట్టి మనువాదంతో భారతదేశాన్ని పాలించాలని బిజెపి వేస్తున్న ఎత్తుగడలను ప్రజలు తిప్పి కొట్టాలని పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు నిచ్చారు. ఆదివారం గాంధీభవన్‌లో 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ ఆవిష్కరించారు. పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎంపి వి. హనుమంతరావు, చైర్మన్ లు శివసేనారెడ్డి, చల్లా నర్సింహారెడ్డి, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ శ్రేణులనుద్దేశించి ప్రసంగిస్తూ ఇందిరమ్మ పేరు ప్రభుత్వ పథకాలకు పెట్టుకోవడం రాష్ట్రానికి సమాఖ్యస్ఫూర్తితో వచ్చిన హక్కు అని, కానీ కేంద్రమంత్రి బండి సంజయ్ సమాఖ్య స్ఫూర్తికి భిన్నంగా ప్రవర్తించారని అన్నారు. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు మహేష్ తెలిపారు. బీజేపీ దేశంలో కాషాయ ఎజెండాను అమలు చేయాలని చూస్తుందని ఆయన ఆపాదించారు. అంబేత్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయాలని చూస్తున్నదన్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్ ఇందిరమ్మ పేరుపెడితే పథకాలకు కేంద్రం నిధులు విడుదలచేయమని అంటున్నాడని అన్నారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ భరోసా కింద 12 వేల రూపాయలు, రైతు భరోసా కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. సేవాదల్ చైర్మన్ జితేందర్ ఆధ్వర్యంలో ర్యాలీగాంధీ భవన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ర్యాలీలో వందలాది సేవాదల్ కార్యకర్తలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**డిజిపి కార్యాలయంలో..**

డిజిపి కార్యాలయంలో ఆర్గనైజేషన్స్ విభాగం అదనపు డిజి స్వాతిలక్రా జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎఐజి రమణ కుమార్‌తో పాటు, డిజిపి కార్యాలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ యోగేశ్వరరావు సహా పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. కాగా బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో గల సిటీ పోలీసు కమిషరేట్‌లో జరిగిన మరో కార్యక్రమంలో పరిపాలనా విభాగం జాయింట్ పోలీసు కమిషనర్ పరిమళ హన్నా నూతన్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పలు వురు అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఈ వేడు కలకు హాజరైన బడి పిల్లలకు జాయింట్ సిపి మిఠాయిలు పంచిపెట్టి వారితో కొద్దిసేపు సరదాగా గడిపారు.



డిజిపి కార్యాలయంలో జరిగిన జాతీయ పతాకాన్ని ఎగురవేసిన తరువాత శాల్యూట్ చేస్తున్న అదనపుడిజి స్వాతిలక్రా. చిత్రంలో ఐజి రమణకుమార్ తదితరులు

**జాతీయ పోలీసు అకాడమిలో ఘనంగా గణతంత్ర వేడుకలు**

ఇదిలా వుండగా నగర శివార్లలోని శివరాంపల్లిలో గల సర్దార్ వల్లభభాయి పటేల్ జాతీయ పోలీసు అకాడమిలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. అకాడమి డైరక్టర్ అమిత్ గార్గ్ సందర్భంగా జాతీయ పతాకాని న్న ఎగురవేశారు. అనంతరం అకాడమిలో యువ ఐపిఎస్ ట్రైనీల నేతృత్వంలో పరేడ్ జరిగింది. ఈ కార్యక్రమంలో అకాడమికి చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.

**పేదరికం, అకలి, అసమానతలులేని దేశాన్ని తీర్చిదిద్దాలి: ఎంపి ఆర్.కృష్ణయ్య**

పేదరికం, నిరుద్యోగం, నిరక్ష రాస్యత లేని దేశంగా, అకలి, అజ్ఞానం, అసమానతలు, దోపిడీ, పీడన, వివక్ష, అణిచివేతలు లేని దేశంగా భారతదేశాన్ని అగ్రదేశంగా తీర్చిదిద్దాలని అందుకు విద్యార్థులు, యువత కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఆదివారం బిసి భవన్, బాలుర హాస్టల్స్‌లో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడకల్లో ఆయన జాతీ య జెండాను ఎగవేసి ప్రసంగించారు. ఇతర దేశాలలో ఉన్న అభివృద్ధిని చూసి మన పాలకులు విధానాలు మార్చాలని, రాజకీయ సంస్కరణలు, ఎన్నికల సంస్కరణలు, పాలనాసంస్కరణలు తీసుకురావాలిసిన అవసరం ఉందని చెప్పారు.

# యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ విద్యుదుత్పత్తి

## రెండో యూనిట్ నుండి 811.9 మెగావాట్లు

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని నల్లగొండ జిల్లాలో నిర్మించిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమైంది. జిల్లాలోని దామరచర్ల మండలంలో ఏర్పాటు చేసిన ఈ యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ లక్ష్యాన్ని చేరుకున్నది. గత డిసెంబర్ 7వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండో యూనిట్‌ను ప్రారంభించారు. 4 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో మొదటగా రెండో యూనిట్ పని ప్రారంభించింది. దీని నిర్మాణానికి 30 వేల కోట్ల రూపాయలు ఖర్చయింది. గత ప్రభుత్వ హయాంలో 90 శాతం పనులు పూర్తిచేసుకొన్న రెండో యూనిట్ కొన్ని పరిస్థితుల కారణంగా వాయిదా పడింది. తాజాగా శనివారం రాత్రి రెండో యూనిట్ నుంచి 811.9 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.

# తెలంగాణ నుంచి జిఎస్‌టిగా రూ. 37వేల కోట్లు కేంద్రానికి ఇచ్చాం

### పథకాలకు ఎందుకు దీనదయాళ్ పేర్లు పెట్టారు?

### కెటిఆర్‌కు కాంగ్రెస్ సంక్షేమం జీర్ణం కావడం లేదు:

### గాంధీభవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



**హైదరాబాద్,జనవరి 26,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజలు జిఎస్‌టి రూపంలో కేంద్రానికి 37వేల కోట్ల రూపాయలు వారి చమటచుక్కల నుంచి పన్నుల రూపంలో కట్టారని ఇందిరమ్మ పేరు పెడితే డబ్బులు ఇవ్వమనిని కేంద్రమంత్రి బండిసంజయ్ అంటున్నారు ఆయన ఇంట్లోనించి డబ్బులు ఇవ్వడంలేదని బిసి సంక్షేమం రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. ఆదివారం గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ ఇందిరమ్మను అవహేళన చేస్తూ మాట్లాడితే ఊరుకునేదిలేదని తెలంగా ణకు ఎలా నిధులు ఇవ్వరో అది కూడా చూస్తామని హెచ్చరించారు. పదినెలల కాలంలో రూ.37వేల కోట్లు వసూలు చేస్తే కేంద్రం తెలంగాణకు ఇచ్చింది ఎంత అని పొన్నం ప్రశ్నించారు. దీనదయాళ్ పేర్లు అనేక పథకాలకు నామకరణం చేశారని దీనదయాళ్ అంత్యోదయ, దీనదయాళ్ గృహజ్యోతి ఇలా పేర్లు పెట్టారని వీళ్ళు ఏమైనా దేశం కోసం ప్రాణత్యాగం చేశారా అని ఆయన ఎదురుప్రశ్న వేశారు. తెలంగాణ నుంచి ఇద్దరు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఒక్క రూపాయి అదనంగా రాష్ట్రానికి తెచ్చారా అని పొన్నం ధ్వజంమెత్తారు.

కేంద్ర నిధులతో అమలయ్యే పథకాకలు ప్రధానమంత్రి ఫోటో వాడుకొంటే నేరుగా తామే లబ్దిదారులకు నిధులు ఇచ్చే ఆలోచన చేస్తామని బండి సంజయ్ ప్రకటించడం సమాఖ్యస్ఫూర్తికి భంగం కలిగించే చర్య అని ఆయన అన్నారు. కేటీఆర్ కు కాంగ్రెస్ సంక్షేమం జీర్ణం కావడం లేదు, అందుకే ఈనో ప్యాకెట్లు పంపిస్తా కెటిఆర్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. దరఖాస్తులు తీసుకుంటుంటె ప్రజలను మభ్యపెట్టడమని అంటున్నారు. దరఖాస్తు స్వీకరణపై వ్యాఖ్యలు చేయడం కెటిఆర్ అసహనానికి పరాకాష్ట అని దుయ్యబట్టారు. బిఆర్ఎస్ ఆర్థిక విధ్వసంసం తర్వాత కూడా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నాం అదీ గ్రేట్ అని ఆయన స్వోత్కర్షలు చెప్పుకున్నారు.

**సంజయ్ ఇందిరమ్మకు క్షమాపణ చెప్పాలి: పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

ఇందిరమ్మ పేరు పెడితే నిదులు ఇవ్వమని కేంద్రమంత్రి బండి సంజయ్ బెదిరించడం తగదని ఇందిరమ్మ చరిత్ర తెలుసుకోవాలని టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ తూర్పుజయప్రకాష్‌రెడ్డి అలియాస్ జగ్గారెడ్డి హితవు చెప్పారు. ఆదివారం గాంధీభవన్‌లో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ రాజకీయాలు పక్కనపెడితే నువ్వునేనూ ఆమెకు మునిమనమలం అవుతామని ఇందిరకు ముందు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్‌చేశారు. తెలంగాణలో ఏదో పొరపాటుగా బిజెపికి ఎనిమిది సీట్లు వచ్చాయని తెలంగాణలో బిజెపికి బలం లేదని తెలుసుకొని ఉనికి కోసం బండి సంజయ్ రాజకీయ ప్రకటనలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

# ఎస్‌బిఐలో గణతంత్ర వేడుకలు

**హైదరాబాద్,జనవరి 26,ప్రభాతవార్త:** ఎస్‌బిఐ హైదరాబాద్ స్థానిక ప్రధాన కార్యాలయంలో రిపబ్లిక్ డే నిర్వహించారు. హైదరాబాద్ సిజిఎం రాజేష్‌కుమార్ జెండాను ఆవిష్కరించారు. దీన్ని పురస్కరించుకుని మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగం ఆర్థిక వృద్ధికి ఇంజిన్ మాత్రమే కాదు, సామాజిక పురోగతికి మూలస్తంభం అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా, బ్యాం కింగ్ జీవితాలను ప్రభావితం చేయడంలో అద్భుతమైన మార్పులను చూశామని చెప్పారు. గ్రామ స్థాయిలో సాధారణ ప్రజలు, రైతులకు మద్దతు ఇవ్వడం నుండి చిన్న వ్యాపారాల కలలను సాకారం చేయడం, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాల ద్వారా మహిళలను సాధికారపరచడం వరకూ పురోగతి సాధించామని తెలిపారు. ఖాతాదారుల అవసరాలే. ప్రపంచంలోని సవాళ్లకు అనుగుణంగా మారడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. డిజిటల్ విప్లవం బ్యాంకింగ్‌ను మార్చివేసిందన్నారు. డిజిటల్ ఆవిష్కరణల ద్వారా, ప్రతి పౌరుడికి సజావుగా, సురక్షి తమైన బ్యాంకింగ్ అనుభవాలను అంది స్తూనే ఉన్నామని చెప్పారు. సేవ, పారదర్శకత, నీతి, మర్యాద, స్థిరత్వం ద్వారా పారదర్శకత, నమ్మకం కల్పించేందుకు కట్టుబడి ఉన్నామన వెల్లడిం చారు. స్వర్ణ భారత్ లక్ష్యానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. గ్రీన్ ఫైనాన్స్‌ను ప్రోత్సహించడం, ఆర్థిక అక్షరాస్యతను ముందుకు తీసుకెళ్లడం ద్వారా దేశం యొక్క సమగ్ర మరియు స్థిరమైన వృద్ధి దృష్టితో సమలేఖనం చేయాలనే లక్ష్యంగా కలిగి ఉన్నామని వివరించారు. సైబర్ మోసాల నుండి కస్టమర్లను, వారి డబ్బును కాపాడుకుంటున్నామని తెలిపారు.



**హైకోర్టులో 76వ గణతంత్ర దినోత్సవాలు**

**హైదరాబాద్ (చార్మినార్), జనవరి 26, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో ఆధివారం ఘనంగా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి, హైకోర్టు బార్ అసోసి యేషన్ అధ్యక్షులు రవీందర్ రెడ్డితో పాటు పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు. హైకోర్టులో జరిగిన





# అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా రాజీనామా చేయాలి

### పిసిసి సేవాదళ్ మిద్దెల జితేందర్ డిమాండ్

**హైదరాబాద్,జనవరి 26,ప్రభాతవార్త:** బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వెంటనే పదవికి రాజీనామా చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం గాంధీభవన్ నుండి అసెంబ్లీ వరకు సమ్మిదాన్ బచావో పాదయాత్ర తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహించింది. జితేందర్ అసెంబ్లీ వద్ద మాట్లాడుతూ 140 కోట్ల ప్రజలు దేవుడిగా కొలిచే అంబేద్కర్‌పై కేంద్రమంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. అంబెద్కర్‌ను అవమానించిన అమిత్‌షాను ప్రధాని నరేంద్ర మోడీ వెనకేసుకోనిరావడం సరైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వచ్చినటువంటి సేవాదళ్ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ప్రభుత్వరంగ బ్యాంకింగ్ వ్యవస్థ విధ్వంసం




ఎపిటిబిఇఎఫ్ త్రైవార్షిక మహాసభలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, చిత్రంలో ఎఐబిఇఎ ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటాచలం, బిఎస్ రాంబాబు తదితరులు


### బ్యాంక్ యూనియన్ల పోరాటాలకు అండగా సిపిఐ

### పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

**హైదరాబాద్, జనవరి 26,ప్రభాతవార్త:** ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ వ్యవస్థ ను విధ్వంసం చేసే పాలకుల కుట్రలను బ్యాంకుల ఉద్యోగులు సమర్ధవంతంగా ఎదుర్కోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం కాచిగూడలోని పొట్లూరి నాగేశ్వరరావు సభా ప్రాంగణం (మ్యాడం అంజయ్య హాల్)లో ఆంధ్రప్రదేశ్ తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎపిటిబిఇఎఫ్) 30వ త్రైవార్షిక మహా సభల ముగింపు సభను ఉద్దేశించి కూనంనేని సాంబశివరావు ప్రసంగించారు. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ వ్యవస్థను విధ్వంసం చేసేందుకు పాలకులు చేస్తున్న కుట్రలను బ్యాంకుల ఉ ద్యోగులు సమర్ధవంతంగా ఎదుర్కోవాలని, ఇందు కోసం బ్యాంక్ యూనియన్లు చేసే పోరాటాలకు సిపిఐ పూర్తిగా అండగా ఉంటుందని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బడా కార్పొరేట్ కంపెనీలకు, గుత్తేదారులకు ఊడిగం చేస్తూ పెట్టుబడిదారి అనుకూల విధానాలతో చట్టాలను చేస్తున్నదని, ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించేందుకు కుట్రలు చేస్తున్నదని ఆయన విమర్శించారు. ఇలాంటి చర్యలకు వ్యతిరేకంగా ఆర్థిక రంగంలో సైనికులైన బ్యాంకింగ్ ఉద్యోగులు కార్యాచరణతో ఉద్యమించాలన్నారు. కుల, మతాలను రెచ్చగొట్టి బిజెపి అధికారంలోకి వచ్చిందని, కుల, మతాల పేరుతో కాకుండా, ఎన్నికల్లో ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా ప్రజా సంక్షేమమే ఎజెండాగా ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకు రావాలని బిజెపిని ఆయన సవాల్ చేశారు. ఈ మహాసభలో పలు తీర్మానాలు ఆమోదించి, ఎపిటిబిఇఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మంద కృష్ణమాదిగను సన్మానిస్తున్న దృశ్యం



మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌ను గజమాలతో సన్మానిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

# గజ్వేల్ రూపురేఖలు మార్చిన కెసిఆర్

### మాజీ మంత్రి హరీశ్‌రావు

**గజ్వేల్, జనవరి 26, ప్రభాతవార్త:** గజ్వేల్‌ను స్వర్ణయుగంలా నా భూతో నా భవిష్యత్ అన్నట్లుగా మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు చేశారని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్‌లో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పాలకవర్గ వీడ్కోలు సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పదేళ్లకాలంలో మాజీ ముఖ్య మంత్రి చంద్రశేఖర్‌రావు గజ్వేల్ దశదిశ మార్చారన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, పాలకవర్గ సభ్యులు అభివృద్ధిలో పాలు పంచుకోవడం వారి అదృష్టమన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయిందని ఎవరూ నిరుత్సాహపడవద్దని, రానున్న రోజుల్లో బిఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ జకియొద్దీన్‌తోపాటు పాలకవర్గ సభ్యులను గజమాలతో సన్మానించి అభినందించారు.

# యూనిఫైడ్ పెన్షన్ నోటిఫికేషన్‌ను నిరసిస్తూ 28న దేశవ్యాప్తంగా నిరసనలు

### ఎన్‌ఒపిఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ) జనవరి 26, ప్రభాతవార్త:** యూనిఫైడ్ పెన్షన్ నోటిఫికేషన్‌ని నిరసిస్తూ ఈనెల 28న దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని ఎన్‌ఎంఒపిఎస్ సెక్రెటరీ జనరల్ స్థిత ప్రజ్ఞ పిలుపు నిచ్చారు. ఆదివారం కేరళలో ఉద్యోగ ఉపాధ్యాయుల మహా ర్యాలీ జరిగింది. అనంతరం భారీ బహిరంగ సభలో స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ జారీ చేసిన యూనిఫైడ్ పెన్షన్ విధానం నోటిఫికేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఈనెల 28న ఉద్యోగ ఉపాధ్యాయ కార్యాలయాల్లో యుపిఎస్ ప్రతుల దగ్ధం చేయాలని, దేశ వ్యాప్తంగా నిరసనలు వివిధ రూపాల్లో తెలియజేయాలని పిలుపునిచ్చారు. కేరళలో మొదలైన నిరసనలు, ఫిబ్రవరి 7న కర్ణాటక బెంగళూరు కేంద్రంగా ఫ్రీడం పార్కు నందు యుపిఎస్ వద్దని ధర్నా చేపడుతున్నామని, మార్చి 2న తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ నందు చలో ధర్నా చౌక్ పేరిట నిరసన కార్యక్రమాలుకు పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో హాజరై నిరసనలు తెలపాలన్నారు. ఈ సందర్భంగా స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ ఇప్పటికే రెండు దశాబ్దాలుగా సిపిఎస్ ఉద్యోగులని గందరగోళపరిచిందని, ఇప్పుడు కేంద్రం యూపీఎస్‌ను తెరపైకి తెచ్చి ఉద్యోగులను తప్పుదోవ పట్టిస్తుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు కంట్రిబ్యూషన్ లేకుండా ప్రభుత్వమే పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఓపిఎస్ అనేది ఉద్యోగుల నుండి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా పదవీవిరమణ తర్వాత కచ్చితమైన పెన్షన్, పిఎఫ్, గ్రాట్యుటీ కల్పించే ట్రిపుల్ బెనిఫిట్స్కీం అని, సిపిఎస్, యుపిఎస్‌లో ఉద్యోగి సర్వీస్‌లో ఉన్నన్ని రోజులు కాంట్రి బ్యూషన్లను ఇస్తే, దాన్ని మొత్తం షేర్ మార్కెట్లో పెట్టి, పెన్షన్ నిర్ణయిస్తారు. ఈ యూపిఎస్ విధా నంలో అదనంగా చేర్చిన టువంటి 8.5 ప్రభుత్వ వాటా మరింతగా పెట్టుబడులను షేర్ మార్కెట్లో పెట్టుబడులను ప్రోత్సహించడమైంది గాని ఉద్యోగి కుటుంబం బాగును దృష్టిలో పెట్టుకోలేదని అన్నారు. రెండు దశాబ్దాల క్రితం ప్రారంభించిన సిపీఎస్ అత్యంత లోపం నిష్ప్ర యోజనకరమైనదని కేంద్ర ఆర్థిక శాఖ అంగీకరించింది. నూతన పెన్షన్ విధానంపై వేసిన టీవీ సోమనాథన్ కమిటీ సిపీఎస్‌లో రిటైర్మెంట్ అయిన, సర్వీస్‌లో చనిపోయిన ఉద్యోగి కుటుంబ సభ్యుల వాస్తవ పరిస్థితులను తెలుసుకొని రిపోర్టు ఇచ్చాడా లేదా అని, ఆర్టిఐ ద్వారా కమిటీ రిపోర్ట్‌ను అడిగితే, బహిర్గత పరచలేమనే సమాధానం కేంద్ర ఆర్థిక శాఖ నుంచి వచ్చిందని తెలిపారు.

ఈ సభలో కేరళ సిపిఎస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ రఫీక్, ప్రధాన కార్యదర్శి షాజీవ్ తదితరులు పాల్గొన్నారు.




కేరళలో జరిగిన క్విట్ ఎంపిఎస్ మహార్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న ఎన్‌ఒపిఎస్ సెక్రటరీ జనరల్ స్థిత ప్రజ్ఞ

# వర్గీకరణకు అడ్డుపడుతున్న మాల సామాజిక వర్గం

### ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 26, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ వర్గీకరణకు వ్యతి రేకమని, మాల సామాజిక వర్గం పార్టీలో అత్యధికంగా ఉండటం వల్ల వారు అడ్డు పడుతున్నారని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణకు అనుకూలంగా ఉన్నారని, కాని మాలలు అడ్డుపడుతున్నా రని అందువల్లనే వర్గీకరణ జరగడం లేదని విమర్శించారు. ఫిబ్రవరి 7న కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో 'లక్ష డప్పులు-వేలగొంతుకలు' కార్యమ్రానికి తెలంగాణ ఎరుకల ఆదివాసీ సంఘం ఆదివారం మద్దతుగా బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఆర్‌పిఎస్ ప్రజాస్వామిక ఉద్యమమని, దాన్ని గుర్తించి ప్రధాని నరేంద్రమోడీ, హోంమంత్రి తనకు పద్మశ్రీ అవార్డును ప్రకటించారన్నారు. ఈ సందర్భంగా వంశతిలక్, బిజెపి నాయకులు గంజీ వంశీ, మందుల శ్రావణ్, రాము, బాబు, తెలంగాణ బిసి సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు గుండేటి శంకర్, ఎరుకల సంఘం నేత లోకిని రాజు తదితరులు కృష్ణమాదిగను ఘనంగా సత్కరించారు.




ఆదివారం హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్ పీపుల్స్ ప్లాజాలో భారత్‌మాతా మహాహారతిలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదతరులు

## భారతమాత దేశానికి ప్రతీక.. ఎవరికైనా తొలి గురువు అమ్మే

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

### నెక్లెస్ రోడ్డులో కన్నుల పండువగా ప్రారంభమైన భారతమాత హారతి కార్యక్రమం

### వివిధ నృత్యాలతో చిన్నారుల సందడి

**హైదరాబాద్ (బేగంపేట) జనవరి 26, ప్రభాతవార్త:** భారత మాత భారత దేశానికి ప్రతీక ఎవరికైనా అమ్మే తొలిగురువు అని భారత మాత అంటే సర్వ స్వరూపి సమదృష్టి అని అర్థం అని కేంద్రమంత్రి గంగాపురం కిషన్ రెడ్డి అన్నారు. నెక్లెస్ రోడ్డులో ఆదివారం భారతమాత హారతి కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ భారత మాత మహారధి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వచ్చిన తెలంగాణా రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ, సంగీత దర్శకుడు ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం.ఎం.కీరవాణి, మాడుగుల నాగఫణిశర్మ, ఈటల రాజేందర్, రఘునందన్, విశ్వేశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తాజా మాజీ శాసనసభ్యులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ 76వ గణతంత్ర దినోత్సవం ప్రారంభమైంది. వచ్చే సంవత్సరం జనవరి 26వరకు కూడా ఈ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ లక్ష్యాల కోసం మనం అందరం నెరవేర్చాల్సిన అవసరం ఉందన్నారు. స్వతంత్ర్యం సిద్ధించిన తర్వాత రాజ్యాంగం రచించుకొని అమల్లోకి తీసుకురావడం ద్వారా ఈ యొక్క గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం అన్నారు. అంబేద్కర్ ఆలోచనకు పెద్ద పీటవేసి మనకి రాజ్యాంగాన్ని అందించారు. ప్రధాని నరేంద్ర మోదీ కూడా సబ్కా సార్ సబ్కా వికాస్ అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామన్నారు. అలాగే సబ్‌కా ప్రయాస్ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ప్రధాని పిలుపు నిచ్చారు. అంబేద్కర్ భావాన్ని మరింత ముందుకు తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగ స్ఫూర్తిని ముందుకు తీసికెళ్లే విధంగా ప్రతి సంవత్సరం నెక్లెస్ రోడ్డు వేదికగా 8వ సారి భారత మాత మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దేశభక్తిని పెంపొందించడమే ఈ భారత మాత మహారధి కార్యక్రమం ఉద్దేశ్యం అన్నారు. అందరూ స్వచ్ఛందంగా ఈ కార్య క్రమంలో భాగస్వామ్యం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా జాతీయ భావనను పెంపొందించేలా చేస్తున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తుందన్నారు. అది రామజన్మ భూమి అంశం కావచ్చు, ఫోక్రాన్ అణుపరిక్ష కావచ్చు, కార్గిల్ యుద్ధం కావచ్చు .సర్జికల్ స్ట్రైక్ కావచ్చు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం కావచ్చు గత పదేళ్లలో మోదీప్రభుత్వం భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడటం భారతీయ సాంప్రదాయం పట్టం కట్టే విధంగా కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. ఈ భారత మాత మహా హారతి కార్యక్రమం నేటి తరానికి భావి తరానికి నవతరానికి మన భారతదేశం గొప్ప తనాన్ని తెలియజేయడం కోసమే నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం సందర్బంగా భారతమాత గురించి అటల్‌బిహారీ వాజ్‌పేయి అన్న మాటలను గుర్తు చేసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి.



ఆదివారం రాజ్‌భవన్‌లో జరిగిన ఎట్‌హోమ్‌కు హాజరైన సిఎం రేవంత్. గవర్నర్‌కు అభివాదం చేస్తున్న పద్మశ్రీ విజేత మంద కృష్ణమాదిగ

## మూడు దశాబ్దాల పోరాటానికి గుర్తింపుగా పద్మశ్రీ: మంద కృష్ణమాదిగ

**హైదరాబాద్ (ముషీరాబాద్), జనవరి 26, ప్రభాతవార్త:** అవిశ్రాంత పోరాట యోధుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారం వరించింది. 30 యేళ్ల బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికై ఆయన చేస్తున్న పోరాటానికి గుర్తుగా కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించింది. మందకృష్ణ మాదిగ అంటే తెలియని వారు భారతదేశంలోనే లేరంటే అతిశయోక్తి కాదు. వరంగల్ న్యూశాయంపేట లో కొమురయ్య, కొమురమ్మ దంపతులకు 1965 జులై 7న మందకృష్ణ మాదిగ జన్మించారు. 1980లో విద్యార్ధి దశలోనే ఆయన కుల వివక్షపై పోరాటం ప్రారంభించారు. కొంతకాలం పీపుల్స్ వార్‌లో పనిచేసినప్పటికీ కొద్ది కాలానికే అందులో నుండి బయటకు వచ్చి దళిత ఉద్యమకారుడిగా బాధ్యతలు భుజాన వేసుకున్నారు. 1997లో నారావారిపల్లె నుండి హైదరాబాద్ వరకు 50రోజుల పాటు సుమారు 1,052 కిలోమీటర్లు మందకృష్ణ మాదిగ చేసిన మహాపాద యాత్రకు అపూర్వ స్పందన వచ్చింది. తనకు పద్మశ్రీ పురస్కారం కేంద్రం ప్రకటించటం పట్ల మందకృష్ణ మాదిగ ఆనందం వ్యక్తం చేశారు. అణగారిన వర్గాల కోసం మూడు దశాబ్దాలుగా తాము చేస్తున్న పోరాటంలో న్యాయం ఉందనటానికి పద్మశ్రీ పురస్కారమే నిదర్శనమని అన్నారు. మా పోరాటాలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోడీకి, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ధన్యవాదములు తెలియచేస్తున్నామన్నారు. ఈ పురస్కార ప్రకటన తన బాధ్యతను మరింత పెంచిందని భావిస్తున్నామన్నారు.

## త్వరలో గ్రూప్-1, 2, 3 ఫలితాలు విడుదల చేస్తాం

### గణతంత్ర దినోత్సవాల్లో టిజిపిఎస్‌సి ఛైర్మన్ బుర్రా వెంకటేశం

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-1, 2, 3 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షల ఫలితాలను త్వరలోనే ప్రకటిస్తామని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్‌సీ) ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. ఇప్పటికే ఈ ఫలితాల ప్రాసెస్ చివరి దశలో ఉందని.. త్వరలో ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఆదివారం టీజీపీఎస్‌సీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ.. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్ -3 ఫలితాల ప్రాసెసింగ్ చివరి దశలో ఉందని, త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఈ సంవత్సరం డిసెంబర్‌లో హైదరాబాద్‌లో రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్‌పర్సన్‌ల ప్రతిష్టాత్మక జాతీయ సమావేశాన్ని నిర్వహించడానికి టీజీపీఎస్‌సీ సిద్ధంగా ఉందని చైర్మన్ అన్నారు.

# ప్రజల ఆశీర్వాదంతో గ్యారంటీల అమలు

### కొత్త రేషన్‌కార్డుల పంపిణీ ప్రారంభించుకోవడం ఎంతో సంతోషం

### తెలంగాణ ప్రజలకు సిఎం రేవంత్‌రెడ్డి విడియో సందేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 26:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కీలక సందేశం పంపించారు. ఈ మేరకు ఆదివారం వీడియో విడుదల చేశారు. శుభాకాంక్షలు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఈ దేశ ప్రజలకు అందించిన రాజ్యాంగం. డెబ్బై ఐదు వసంతాలు పూర్తి చేసుకొని 76 వ వసంతంలో అడుగుపెడుతున్న సందర్భంగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడ్డ ప్రజా పాలన, ఇందిరమ్మ రాజ్యం, ఈరోజు (ఆదివారం) నాలుగు నూతన సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని మీ అందరికీ తెలియజేయడానికి సంతోషపడుతున్నాను. మీ రేవంత్ అన్నగా మీ ఆశీర్వాదం తీసుకొని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా 13 నెలలు పూర్తి చేసుకున్న సందర్భంలో ప్రజలకిచ్చిన గ్యారంటీలను ఒకటొకటిగా అమలు చేస్తూ, ఈ గణతంత్ర దినోత్సవ సందర్భంగా రైతు భరోసా. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాలను ఈరోజు (ఆదివారం) ప్రారంభించుకోవడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం ప్రజా పాలనలో నిరంతరం శ్రమిస్తూ ప్రజలతో మమేకమవుతూ ప్రజా పరిపాలన అందిస్తూ రైతు భరోసా నిరుద్యోగ సమస్య పరిష్కారం, అదే విధంగా వరికి బోనస్, ఇలాంటి ఎన్నో కార్యక్రమాలను ఈరోజు మనం అమలు చేసుకోవడమే కాకుండా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం, రెండు వందల యూనిట్ల ఉచిత కరెంటు, ఐదు వందల రూపాయల సిలిండర్ ని ఈరోజు ఆడబిడ్డలకు అందజేస్తూ ఈ ప్రజాపాలనలో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి నిరంతరం ప్రయత్నం చేస్తున్నాం. ఈ రోజు రాష్ట్రాన్ని చుట్టుముట్టిన సమస్యలను ఒకటొకటిగా పరిష్కరిస్తూ, ఇచ్చిన గ్యారంటీలను అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నాం. దళితులు గిరిజనులు ఆదివాసీలు అదే విధంగా బలహీన వర్గాలు మైనారిటీలు మహిళలు. నిరుపేదలందరినీ కూడా ఆదుకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. ఈ రోజు మీ ఆశీర్వాదం. మీరు అండగా నిలబడబట్టి ఈ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నాం. ఈరోజు ముఖ్యంగా ఎంతో మంది పేదలు, సంవత్సరాల కొద్ది నూతన రేషన్ కార్డుల కోసం ఎదురుచూడడం, అదే విధంగా రైతు కూలీలు మాకు భరోసా గా ఉండడం ద్వారా మేము కొంత ఆర్థిక ప్రయోజనం పొందాలి అని మా దృష్టికి తీసుకురావడం తో ఈరోజు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నూతన కార్యక్రమాన్ని కూడా మనం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. రైతు భరోసాలో సంవత్సరానికి 12 వేల రూపాయలను ఈ రోజు రైతుల ఖాతాలో వేసుకోవడం జరుగుతుంది. ఆనాడు ఆకాశమే హద్దుగా 2004 నుంచి 2014 వరకు ఇందిరమ్మ రాజ్యంలో ఇందిరమ్మ ఇళ్లు మనం ఇచ్చుకోవడం జరిగింది. మళ్ళీ పది సంవత్సరాల తర్వాత ఈరోజు పేదల కళ్లల్లో వెలుగు చూడడానికి పేదలను ఒక ఇంటి వాళ్ళను చేయడానికి ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమాలను కూడా ఈ రోజు మనం తీసుకోవడం జరిగింది. ఇవన్నీ కూడా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న పేదలను, నిరుపేదలను, దళితులను, గిరిజనులను, ఆదివాసీలను, బలహీన వర్గాలను, మైనారిటీలను, మహిళలను. సంక్షేమ పథం వైపు నడిపించడమే కాకుండా మొదటి సంవత్సరంలోనే 50,153 ప్రభుత్వ ఉద్యోగాలను ఇవ్వడం ద్వారా తెలంగాణలో ఉన్న లక్షలాది నిరుద్యోగ యువకులకు ఈరోజు ఒక ఆనందాన్ని అందించడం జరిగింది. విద్యార్థులు, నిరుద్యోగ యువకులు, ఉద్యమకారులను ఆదుకోవడమే కాకుండా తెలంగాణ రాష్ట్రానికి ఒక రాష్ట్ర గీతాన్ని, అదే విధంగా తెలంగాణ ప్రజలకు ఒక తెలంగాణ తల్లిని మనం అందించుకున్నాము. ఇంత మంచి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్తూ మీరు అండగా నిలబడ్డందుకు మీకందరికీ మరొక్కసారి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో సిఎం రేవంత్, డిప్యూటీ సిఎం భట్టి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

## సత్ఫలితాలు ఇస్తున్న భగీరథ కార్యాలయంలో కాల్ సెంటర్

### మంచినీటి సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ

### వాటిని తక్షణమే పరిష్కరించాలని మంత్రి సీతక్క సూచన

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** పట్టణాల్లో మాదిరిగా గ్రామీణ ప్రాంతాల్లోనూ తాగునీటి సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం తీసుకుని వచ్చిన టోల్ ఫ్రీ నంబర్ మంచి ఫలితాలు ఇస్తుంది. గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సమస్యకు 18005994007ను తీసుకొచ్చింది. ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ ప్రధాన కార్యాలయంలో గత యేడాది డిసెంబర్ 23న ఈ టోల్ ఫ్రీ నంబర్‌ను ప్రారంభించారు. ఈ నెంబర్‌కు ఇప్పటి వరకు 280 ఫిర్యాదు అందాయి. గత నెల ఈ నెల 25వ తేదీ వరకు కాల్ సెంటర్‌కు మొత్తం 280 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందులో పట్టణ ప్రాంతాల నుంచి 73 ఫిర్యాదు అందగా, గ్రామీణ ప్రాంతాల నుంచి 207 ఫిర్యాదులు అందాయి. వీటిలో 187 ఫిర్యాదులను అధికారులు పరిష్కరించారు. వచ్చిన ఫిర్యాదుల్లో దాదాపు 90 శాతం వాటికి పరిష్కారం చూపినట్టు అధికారులు తెలిపారు. తమ కాలనీలో నీళ్లు రావడం లేదు, మా వీధికి మిషన్ భగీరథ వాటర్ రావడం లేదు అంటూ వచ్చిన ఫిర్యాదులపై అధికారులు స్పందిస్తున్నారు. కాగా హైదరాబాద్ వంటి మహానగరాల్లో తాగునీటి సరఫరాలో ఏవైనా అంతరాయాలు వస్తే టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమస్యను పరిష్కరించుకుంటారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఆ సౌకర్యం లేదు. ప్రజలు తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో కూడా వారికి తెలీదు. నీళ్ల రాకుంటే ఇబ్బందులను అనుభవిస్తారు తప్పితే ఎవరినీ అడిగేందుకు సాహసించరు. వీటన్నింటికీ చెక్ పెట్టేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ నెంబరుకు మంచి స్పందన వస్తుంది. కాల్ సెంటర్‌కి వచ్చిన ఫిర్యాదులను సిబ్బంది ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి చేరవేస్తుండడంతో సత్ఫలితాలు వచ్చాయని అధికారులు చెప్తున్నారు.

## మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ జర్నలిస్టు ఆర్.సత్యనారాయణ కన్నుమూత

### సిఎం రేవంత్‌రెడ్డి, బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్, మంత్రుల సంతాపం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 26:** మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ జర్నలిస్ట్ ఆర్ సత్యనారాయణ కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం సంగారెడ్డిలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడిగా, టీజీపీఎస్సీ సభ్యుడిగా పనిచేశారు. ఆయన గతంలో ఉదయం, వార్త దినపత్రికలో జర్నలిస్టుగా పనిచేశారు. 2007లో కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలుపొందారు. 2008లో తెలంగాణ ఉద్యమంలో భాగంగా తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. టీఎస్‌పీఎస్సీ సభ్యుడిగా పని చేశారు. మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ జర్నలిస్ట్ ఆర్.సత్యనారాయణ మృతిపట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. జర్నలిస్టుగా, తెలంగాణ ఉద్యమకారునిగా, శాసనమండలి సభ్యులుగా సత్యనారాయణ చేసిన సేవలు తెలంగాణ సమాజం మరిచిపోలేనివి అని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు సిఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్సీ ఆర్. సత్యనారాయణ మృతి పట్ల బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో సత్యనారాయణ చేసిన కృషిని, వారితో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా కేసీఆర్ స్మరించుకున్నారు. సీనియర్ జర్నలిస్టుగా, ఉద్యమకారునిగా వారు అందించిన సేవలు, బీఆర్‌ఎస్ పార్టీ కోసం వారు చేసిన కృషి గొప్పవని కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ మృతిపట్ల సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జర్నలిస్టుగా, ఎమ్మెల్సీగా, టీజీపీఎస్సీ సభ్యుడిగా తనదైన ముద్రవేశారన్నారు. బీఆర్‌ఎస్‌కు ఆయన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. సత్యనారాయణ మృతిపట్ల శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో సత్యనారాయణ పాత్ర మరువలేనిదని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ జర్నలిస్ట్ సత్యనారాయణ మృతిపట్ల వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విచారం వ్యక్తం చేశారు. సత్యనారాయణ జర్నలిస్ట్‌గా, ఎమ్మెల్సీగా చేసిన సేవలు చిరస్మరణీయమని మంత్రి కొనియాడారు. తెలంగాణ సాధన కోసం సత్యనారాయణ తాపత్రయ పడేవారని, ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారని మంత్రి గుర్తు చేసుకున్నారు. సత్యనారాయణ మృతి బాధాకరమని పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తంచేసిన మంత్రి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు.

## రూ.6,688.47 కోట్ల రెవెన్యూ లోటు

### ఆశాజనకంగా లేని ఆర్థిక పరిస్థితి

### తగ్గుతున్న రాబడులు, పెరుగుతున్న అప్పులు

### మూడు త్రైమాసికాల ఆదాయం రూ.1,60,518 కోట్లే

### 2024-25 డిసెంబరుకే పూర్తి రుణాలు సేకరణ

### ప్రభుత్వానికి కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదిక

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త:** రాష్ట్ర ఖజానా ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా కనిపించడం లేదు. బడ్జెట్‌లో పేర్కొన్న అంచనాలకు వాస్తవ లావాదేవీలకు సంబంధం ఉండటం లేదు. ప్రస్తుత 2024-25 వార్షిక అంచనా బడ్జెట్‌లో రూ.297 కోట్ల రెవెన్యూ మిగులు ఉంటుందని పేర్కొనగా, 2024 డిసెంబర్ నాటికి వాస్తవ రెవెన్యూ రూ.19,892 కోట్ల మైనస్‌కు వెళ్లింది. ప్రస్తుత బడ్జెట్ అంచనాల ప్రకారమైతే ఇది రూ.6,688.47 కోట్లు లోటుగా నమోదైంది. ఇదే సమయంలో బడ్జెట్‌లో పేర్కొన్న అంచనా ఆదాయం, వాస్తవం కంటే భిన్నంగా ఉంటోంది. ఈ విధంగా పన్నేతర, గ్రాంట్ ఇన్ ఎయిడ్ తదితర రాబడులు తగ్గుతుండగా, ఇదే సమయంలో అప్పులు పెరిగిపోతున్నాయని కాగ్ నివేదికలో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఆదాయ, వ్యయాల అంచనాల్లో అంతరం పెరుగుతోందని వెల్లడించింది. పన్నేతర ఆదాయం, కేంద్ర గ్రాంట్ ఇన్ ఎయిడ్ అంచనాల కంటే తగ్గుతుండగా, అప్పులు పెరిగిపోయే పరిస్థితి ఉందని తెలిపింది. ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.49,225 కోట్ల మేర రుణాలు తీసుకోనున్నట్లు బడ్జెట్లో పేర్కొన్నా, ఇంకా చివరి క్వార్టర్ మిగిలి ఉండగానే రూ.48,178 కోట్ల రుణాలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ పన్నులు, పన్నేతర ఆదాయం, గ్రాంట్లు, రుణాలు అన్నీ కలిపి ప్రస్తుత ఆర్థికంలో రూ.2,74,05 కోట్లు సమకూరుతాయని అంచనా వేసింది. ఇందులో డిసెంబర్ చివరినాటికి 58.57 శాతం మాత్రమే రూ.1,60,518 కోట్లు వచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి బడ్జెట్ ప్రతిపాదనల్లో 62.17 శాతం ఆదాయం రాగా, అది ఈ ఏడాది బాగా తగ్గింది. అలాగే కేంద్రం నుండి గ్రాంట్ల కింద రూ.21,663 కోట్లు వస్తుందని అంచనా వేయగా, వచ్చింది మాత్రం స్వల్పంగా రూ.4,771.44 కోట్లుగా ఉంది. ఇక ప్రభుత్వ సొంత ఆదాయం కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఇదే సమయంలో స్థానిక సంస్థలకు రూ.3,046 కోట్లు బదిలీ చేయడం వల్ల లోటు బాగా ఎక్కువగా కనిపిస్తోంది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ద్వారా రూ.18,228 కోట్లు వస్తుందని అంచనా వేయగా, డిసెంబర్ చివరి నాటికి వచ్చింది రూ.7,524 కోట్లే సమకూరింది. అయితే అమ్మకం పన్ను ఆదాయం మాత్రం పెరుగుతోంది. అలాగే రాష్ట్ర ఎక్సైజ్ డ్యూటీ కింద అంచనా వేసుకున్న ఆదాయంలో ఇప్పటివరకు సగమే వచ్చింది. పన్నేతర ఆదాయంలోనూ భారీ లోటు ఉంది. బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.35,208 కోట్లు పన్నేతర ఆదాయం రావాల్సి ఉండగా, ఇప్పటి వరకు సమకూరింది రూ.5,487.88 కోట్లు మాత్రమే.

## బాండ్లపై అప్పు రూ.3.49 లక్షల కోట్లు

### ఈ అప్పులు 2060 నాటికి చెల్లించాల్సిందే

### రాష్ట్ర సర్కార్‌కు స్పష్టం చేసిన రిజర్వ్ బ్యాంక్

**హైదరాబాద్, జనవరి 26, ప్రభాతవార్త :** తెలంగాణ సెక్యూరిటీ బాండ్ల వేలం ద్వారా సేకరించిన అప్పులను 2060 నాటికి పూర్తిగా చెల్లించాల్సి ఉంటుందని రాష్ట్ర సర్కార్‌కు రిజర్వ్ బ్యాంక్ స్పష్టం చేసింది. రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి రాష్ట్ర ప్రభుత్వాలు బాండ్ల ద్వారా బహిరంగ మార్కెట్‌లో చేసిన అప్పులను తిరిగి చెల్లింపులు చేసే విషమై రిజర్వ్ బ్యాంక్ స్పష్టత నిచ్చింది. జనవరి 2015 నుండి ఈ నెల 15వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వాలు సెక్యూరిటీ బాండల ద్వారా చేసిన మొత్తం అప్పు 3,49,137 కోట్ల రూపాయలుగా ఉన్నట్లు తెలిపింది. ఈ అప్పులన్నీ గరిష్టంగా 45 ఏళ్ల కాల పరిమితితో సమీకరించారని, ఈ లెక్కన 2060 నాటికి వీటన్నింటినీ తీర్చాల్సి ఉంటుందని తాజాగా విడుదల చేసిన ఔట్ స్టాం డింగ్ స్టేట్ గవర్నమెంట్స్ సెక్యూ రిటీస్ నివేదికలో తెలిపింది. వచ్చే నాలుగేళ్లలో తెలంగాణ ప్రభుత్వం 60,947.18 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. కాగా బాండ్ల వేలం ద్వారా సేకరించిన రుణాల చెల్లింపుల వివరాలను వెల్లడిస్తూ ఈ ఏడాదిలో 17,150 కోట్ల రూపాయలను తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. అలాగే వచ్చే ఏడాది 2026లో 20 వేల కోట్ల రూపాయలను అప్పుల కిస్తీలు, అసలు, వడ్డీ కింద చెల్లించాల్సి ఉంది. మొత్తంగా వచ్చే నాలుగేళ్లలో రూ.60 వేల కోట్లకు పైగా చెల్లించాలి.

## సింగూర్ కెనాల్ సిసి లైనింగ్‌కు 168.35 కోట్లు

### 120 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

### వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**పుల్‌కల్, జనవరి 26, ప్రభాతవార్త:** సింగూరు ప్రాజెక్టు ఎడుమ ప్రధాన కాలువతో పాటు ఇతర కాలువలకు సిమెంట్ లైనింగ్ పనుల కొరకు 168.35 కోట్ల రూపాయలను మంజూరు అయినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఇసోజిపేటలో ఆదివారం నిర్వహించిన 4 సంక్షేమ పథకాల అమలు కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు సంక్షేమ పథకాల (ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ, రైతు భరోసా, రేషన్‌కార్డులు) పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ మాట్లాడుతూ సింగపూర్ లైనింగ్ పనులు మరో పక్షం రోజుల్లో మొదలవుతాయన్నారు. బస్వాపూర్ శివారులో సమీకృత గురుకుల పాఠశాలను నిర్మిస్తున్నామని, నియోజకవర్గ కేంద్రం జోగిపేటలో 150 పడకల ఆసుపత్రి, నర్సింగ్ కళాశాల భవనాల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయన్నారు. బిఆర్‌ఎస్ పాలించిన 10 సంవత్సరాలలో ఏ ఒక్క స్కూలు, ఆసుపత్రి భవనం నిర్మాణానికి నోచుకోలేదని విచారం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్ని బాలికల గురుకుల పాఠశాలలకు ప్రహారిగోడ నిర్మాణాలను పటిష్టం చేస్తున్నామన్నారు. బిఆర్ ఎస్ ప్రభుత్వం ఏ ఒక్కరికి రేషన్ కార్డు అందచేయలేదని, భూమి లేని కూలీలకు భరోసా డబ్బులు ఇవ్వలేదని ఆరోపించారు. సంక్షేమ పథకాల అమలు ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందన్నారు. అర్హులైన వారు మండల పరిషత్, గ్రామ పంచాయితీలలో ధరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నాడు సంగారెడ్డి నుంచి సింగూరు వెళ్లాలంటే 3 గంటలు పట్టేదని, సింగిల్‌గా ఉన్న రోడ్డును డబుల్ లైన్‌గా మార్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అందోల్‌లో అత్యధికంగా విద్యా సంస్థలు, ఆసుపత్రులు, కళాశాలలు ఉండేలా చేస్తామన్నారు. కొత్తగా ఏర్పడిన చౌటకూరు మండలంలో ప్రభుత్వ కార్యాలయాలతో పాటు కేజీబీవీ ఫార్మసీ కళాశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**ఇసోజిపేటకు ఎంతో చేశా...**

ఇసోజిపేట గ్రామానికి ఎంతగానో అభివృద్ధి చేశానని, ఇంకా అభివృద్ధి చేస్తానని మంత్రి దామోదర్ గుర్తు చేసుకున్నారు. అర్హులందరికి సంక్షేమ పథకాలు అందచేస్తామన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఓ జ్యోతి, ఆర్‌డిఓ పాండు, డిఎస్‌పి సత్తయ్యగౌడ్, డిపిఓ సాయిబాబా, మండల ప్రత్యేకఅధికారి బాలరాజ్, తహసీల్దార్ కృష్ణ, ఎంపిడిఓ ఆనందమేరీ, ఎంపిఓ శ్రీకాంత్ ఏఓ చైతన్య, పిఆర్ఏఈ శశికుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు దుర్గారెడ్డి, నత్తి దశరథ్, డిసిసిబి మాజీ డైరెక్టర్ రామచంద్రారెడ్డి, నాయకులు గోవర్ధన్, లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, రామాగౌడ్, కౌసర్, వర్కల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకం పత్రం అందచేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

## అంకితభావంతో సంక్షేమ పథకాలను అమలుచేయాలి

### పేదరిక నిర్మూలనకు కాంగ్రెస్ సర్కార్ కృషి: కెకె

**ఘట్‌కేసర్, జనవరి 26, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిరంతరాయంగా అమలవుతాయని ప్రజావ్యవహారాల ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపల్ ఘనాపూర్‌లో ఆదివారం ప్రజాపాలన 4 సంక్షేమ పథకాలను ఆయన ప్రారంభించారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌పొట్రు, ప్రజాపాలన ఫ్లాగ్‌షిప్ స్కీమ్స్ ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి శశాంఖలు కెకె రాక కోసం అరగంట సేపు నిలబడి నిరీక్షించి స్వాగతం పలికారు. కేశవరావు, అధికారులు, ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా 4 సంక్షేమ పథకాల లబ్దిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. అర్హులు, అనర్హులు గ్రామస్తులకే తెలుసునని అవసరమైన పేదలకు పథకాలను వర్తింప జేయాలని ఆయన సూచించారు. ప్రజాపాలనలో ప్రజల వద్దకు వెళ్లి లబ్దిదారులను ఎంపిక చేస్తారని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. గతంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన 20 సూత్రాల కార్యక్రమాలను కెకె గుర్తు చేస్తూ ఇందిరమ్మ పేరుతో కాంగ్రెస్ సర్కార్ సథకాలను అమలు చేస్తుందన్నారు. జాబితాలో పేరు రాని వారు తిరిగి ధరఖాస్తు చేసుకోవాలని ఇందిరమ్మ పథకాలు నిరంతర ప్రక్రియలో కొనసాగుతాయని అర్హులకు లబ్ది చేకూర్చేవిధంగా అధికారులు అంకితభావంతో పని చేయాలని సూచించారు. అధికారిక పదవి లేని వారికి మాట్లాడే అవకాశం ఇస్తూ ప్రోటోకాల్‌ను ఉల్లఘిస్తున్నారని మున్సిపల్ బిజెపి అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి నిరసన తెలిపారు. ఘనాపూర్‌లో ధరఖాస్తు చేసుకున్న అందరికి శ్యాచురేషన్ ప్రకారం పథకాలకు ఎంపిక చేశారని ఆయన తెలిపారు. ఈసందర్భంగా రైతుభరోసా 117 మందికి, ఇందిరమ్మ ఆత్మీయభరోసా 17 మంది, ఇందిరమ్మఇండ్లు 117 మంది, రేషన్‌కార్డులు 176 మంది చొప్పున మొత్తం 4 పథకాలకు 427 మంది లబ్దిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.

# 'మాస్ జాతర' చిత్రం నుంచి గ్లింప్స్ విడుదల



**మాస్ మహారాజా** రవితేజ కథనాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక 75వ చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఇప్పుడు ఈ చిత్రం నుంచి గ్లింప్స్ విడుదలైంది. జనవరి 26వ తేదీన రవితేజ పుట్టినరోజు సందర్భంగా, 'మాస్ జాతర' గ్లింప్స్‌ను చిత్ర బృందం ఆవిష్కరించింది. ఈ గ్లింప్స్, అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న మునుపటి అసలు సిసలైన మాస్ మహారాజా రవితేజను గుర్తు చేసేలా ఉంది. తనదైన కామెడీ టైమింగ్, విలక్షణ డైలాగ్ డెలివరీ ఎనర్జీకి పెట్టింది పేరు రవితేజ. అందుకే ఆయన పోషించిన పాత్రలు ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోతుంటాయి. రవితేజ నుంచి అభిమానులు, ప్రేక్షకులు కోరుకునే విందు భోజనం లాంటి మాస్ ఎంటర్టైనర్ గా మాస్ జాతర రూపొందుతోందని గ్లింప్స్ ను చూస్తే అర్థమవుతోంది. రవితేజ సినీ ప్రస్థానంలో "మనదే ఇదంతా" అనే డైలాగ్ ఎంతటి ప్రాముఖ్యత పొందినదో తెలిసిందే. గ్లింప్స్‌కు ఈ డైలాగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇది అభిమానులను మళ్ళీ ఆ రోజులకు తీసుకొని వెళ్తుంది. అలాగే నేటి ప్రేక్షకులకు కొత్త అనుభూతిని కలిగిస్తుంది. దర్శకుడు భాను బోగవరపు మాస్ ప్రేక్షకులు మెచ్చే విధంగా ఆకర్షణీయంగా 'మాస్ జాతర' గ్లింప్స్ ను మలిచారు. మాస్ మహారాజాగా రవితేజ మాస్ ప్రేక్షకులకు ఎందుకు అంతలా చేరువయ్యారో ఈ గ్లింప్స్ మరోసారి రుజువు చేస్తోంది. సంగీత సంచలనం భీమ్స్ సిసిరోలియో అందించిన నేపథ్య సంగీతం, రవితేజ ఎనర్జీకి ఏమాత్రం తగ్గకుండా ఉండటమే కాకుండా, గ్లింప్స్‌కు ప్రధాన బలంగా ఉంది. 'మాస్ జాతర' చిత్రాన్ని మాసివ్ ఎంటర్టైనర్‌గా మలచడానికి ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. ప్రముఖ ఛాయాగ్రాహకుడు విధు అయ్యన్న కెమెరా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటర్ గా వ్యవహరిస్తున్నారు. నందు సవిరిగాన సంభాషణలు సమకూర్చారు. ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ శ్రీలీల జోడి గతంలో 'ధమాకా'తో బ్లాక్ బస్టర్ అందుకున్నారు. వీరి కలయికలో 'మాస్ జాతర' రూపంలో మరో బ్లాక్ బస్టర్ అందుకోవడం ఖాయమని చిత్ర బృందం నమ్మకంగా ఉంది. తాజాగా విడుదలైన గ్లింప్స్ 'మాస్ జాతర' చిత్రంపై అంచనాలను రెట్టింపు చేసింది. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడి కానున్నాయి.

# 'తండేల్' ట్రైలర్ 28న రిలీజ్



**యువ సామ్రాట్** నాగ చైతన్య, సాయి పల్లవి జంటగా చందూ మొండేటి దర్శకత్వం వహించిన 'తండేల్' 2025లో రిలీజ్ కానున్న మోస్ట్ ఎవైటెడ్ మూవీస్ లో ఒకటి, ఇప్పటివరకు విడుదలైన అన్ని పాటలకు బ్లాక్ బస్టర్ స్పందన లభించింది. రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ స్వరపరిచిన బుజ్జి తల్లి, శివ శక్తి, హిలెస్సో హిలెస్సో పాటలు మ్యూజిక్ చార్టులలో అగ్రస్థానంలో, యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో ఉన్నాయి. ఈరోజు, మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్‌ను జనవరి 28న విడుదల చేస్తామని అనౌన్స్ చేశారు.

ట్రైలర్ పోస్టర్‌లో, అల్యూమినియం బకెట్‌ని వెపన్‌గా పట్టుకొని నాగ చైతన్య, విలన్స్‌ను చంపడానికి సిద్ధంగా ఉన్న ఫెరోషిషియస్ అవతారంలో కనిపించారు. బకెట్‌పై రక్తపు గుర్తులను కూడా మనం గమనించవచ్చు, ఇది సినిమాలో ఇంటెన్స్ యాక్షన్ బ్లాక్ నుంచి ప్రజెంట్ చేస్తోంది. లవ్ ఎలిమెంట్స్‌తో పాటు, సినిమాలో మంచి యాక్షన్ కూడా ఉంటుందని కూడా ఇది సూచిస్తుంది.

అల్లు అరవింద్ సమర్పకుడిగా, గీతా ఆర్ట్స్ బ్యానర్ పై బన్నీ వాసు ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. టాప్ టెక్నీషియన్స్ ఈ సినిమాకి పని చేస్తున్నారు. నేషనల్ అవార్డ్ విన్నర్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు, శ్యామ్‌దత్ సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు, నేషనల్ అవార్డ్ విన్నర్ నవీన్ నూలి ఎడిటర్‌గా, శ్రీనాగేంద్ర తంగల ఆర్ట్ డైరెక్టర్ గా పని చేస్తున్నారు. తండేల్ ఫిబ్రవరి 7న విడుదల కానుంది. తారాగణం: నాగ చైతన్య, సాయి పల్లవి

సాంకేతిక బృందం: రచన, దర్శకత్వం: చందూ మొండేటి, సమర్పణ: అల్లు అరవింద్, నిర్మాత: బన్నీ వాసు, బ్యానర్: గీతా ఆర్ట్స్, సంగీతం: దేవి శ్రీ ప్రసాద్, డిఓపీ: శ్యామ్‌దత్, ఎడిటర్: నవీన్ నూలి, ఆర్ట్: శ్రీనాగేంద్ర తంగల, పీఆర్వో: వంశీశేఖర్, మార్కెటింగ్: ఫస్ట్‌షో.

# సుధీర్ బాబు హీరోగా 'జటాధర'



**రుస్తుం తరువాత** మళ్ళీ ప్రేరణ అరోరాతో కలిసి జీ స్టూడియోస్ ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తోంది. సూపన్ నేచురల్ థ్రిల్లర్‌గా రాబోతోన్న ఈ మూవీకి వెంకట్ కళ్యాణ్ దర్శకత్వం వహిస్తున్నారు. 'జటాధర' చిత్రంలోకి జీ స్టూడియోస్ ఎంట్రీ ఇవ్వడంతో టీంలో కొత్త ఉత్తేజం వచ్చింది. ఈ మేరకు జీ స్టూడియోస్ సిఇఒ ఉమేష్ కెఆర్ బన్సాల్ మాట్లాడుతూ..జీ స్టూడియోస్‌లో మేం ఇంకా ఎన్నో కథలను అందించాలని, అవి తరతరాలుగా ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండాలని కోరుకుంటున్నాం. జటాధర థ్రిల్లింగ్ సూపర్ నేచురల్ గా ఉండబోతోంది. ఈ ప్రాజెక్ట్ కోసం మరోసారి ప్రేరణ అరోరాతో కలిసి పని చేయడం ఆనందంగా ఉంది అని అన్నారు. జటాధర సినిమా కథ అనంత పద్మనాభ స్వామి ఆలయం చుట్టూ తిరుగుతుంది. అక్కడి సంపద, దాని చుట్టూ అల్లుకున్న వివాదాలు, నేపథ్యం, చరిత్ర ఇలా అనేక అంశాలను ఈ చిత్రంలో చూపించనున్నారు. అక్కడి నిధిని మాత్రమే కాకుండా ఆలయ చరిత్ర, పురాణా కథల్ని కూడా చూపించబోతోన్నారు. ఈ సినిమాలో సుధీర్ బాబు కారెక్టర్ చాలా భిన్నంగా ఉండబోతోంది. అందుకే ప్రస్తుతం సుధీర్ బాబు తన బాడీని పెంచే పనిలో పడ్డారు. ఇందుకోసం కఠినమైన శిక్షణ కూడా తీసుకుంటున్నారు. ఉమేష్ కెఆర్ బన్సాల్, ప్రేరణ అరోరా, శివిన్ నారంగ్, రాజీవ్ అగర్వాల్, అరవింద్ అగర్వాల్, నిఖిల్ నందా, మోనేష్ మంఘ్నానితో పాటు జీ స్టూడియోస్ బ్రాండ్ వ్యాల్యూ పెంచేలా ఈ జటాధర ఉండబోతోంది. ఫిబ్రవరిలో జటాధర చిత్రీకరణ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరగనుంది.

# 'మదగజరాజా' ట్రైలర్ విడుదల



**విశాల్ సెన్సేషనల్ హిట్** మదగజరాజా సినిమా సంక్రాంతి సందర్భంగా తమిళంలో విడుదలై భారీ విజయాన్ని సాధించింది. సుందర్ సి దర్శకత్వంలో జెమిని ఫిల్మ్ సర్క్యూట్ నిర్మించిన ఈ సినిమా 50 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి, పండుగ సీజన్‌లో తమిళంలో నంబర్ వన్ చిత్రంగా రికార్డు సృష్టించింది. ఈ యాక్షన్‌కామెడీ సినిమా జనవరి 31న తెలుగులో విడుదల కానుంది. ఈరోజు విక్టరీ వెంకటేష్ ఈ సినిమా ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ ట్రైలర్ కామెడీ, యాక్షన్ పర్ఫెక్ట్ బ్లెండ్‌తో ఎంటర్ టైనింగ్ రైడ్‌ను అందించింది. విశాల్, సంతానం మధ్య హిలేరియస్ కెమిస్ట్రీ అదిరిపోయింది. విలన్ సోను సూద్ విశాల్‌తో ఢీకొట్టడం ఒక గ్రిప్పింగ్ షోడౌన్‌గా ఉంటుందని హామీ ఇస్తుంది. విశాల్ తన సిగ్నేచర్ ఎనర్జీతో అదరగొట్టారు. సంతానంతో అతని కెమిస్ట్రీ ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. అంజలి, వరలక్ష్మి శరత్‌కుమార్ ఇద్దరూ గ్లామర్‌ను జోడించడం మరింత ఆకర్షణగా నిలిచింది.

కామెడీ ఎంటర్‌టైనర్‌లను రూపొందించడంలో పేరుపొందిన దర్శకుడు సుందర్ సి, మరోసారి తన మార్క్ ఎంటర్ టైనర్ అందించారు. తెలుగు రాష్ట్రాలలో కూడా మద గజ రాజా హిట్ అవుతుందని ట్రైలర్ హామీ ఇస్తోంది. రిచర్డ్ ఎం. నాథన్ అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు. విజయ్ ఆంటోనీ పవర్ ఫుల్ మ్యూజిక్ ఎనర్జీని మరింత ఎలివేట్ చేసింది. ఈ ట్రైలర్ సినిమా పై అంచనాలను పెంచింది.

తారాగణం: విశాల్, సంతానం, వరలక్ష్మి, అంజలి, శరత్ సక్సేనా, సోనూ సూద్, మణివణ్ణన్ (లేట్), నితిన్ సత్య, సదగొప్పన్ రమేష్, ఆర్. సుందర్ రాజన్, మొట్టా రాజేంద్రన్, మనోబాలా (లేట్), స్వామినాథన్, జాన్ కొక్కెన్, టార్జాన్, విచ్చు విశ్వ నాథ్




## విజయ్ సెన్సేషనల్ మూవీ టైటిల్

# 'జన నాయగన్'



**తమిళ స్టార్ హీరో** దళపతి విజయ్ చేస్తున్న చివరి సినిమా మీద అంచనాలు భారీ స్థాయిలో నెలకొన్నాయి. దళపతి 69 అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ మూవీని ప్రారంభించారు. ఈ సినిమాను కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ ఎత్తున నిర్మిస్తోంది. హెచ్ వినోద్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన టైటిల్, ఫస్ట్ లుక్‌ను రిలీజైంది. జన నాయగన్ అనే టైటిల్‌తో దళపతి విజయ్ చివరి చిత్రం రాబోతోంది. ఈ టైటిల్ పోస్టర్‌లో దళపతి విజయ్ ఎంతో స్మార్ట్‌గా కనిపిస్తున్నారు. సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో అందరినీ ఆకట్టుకుంటున్నారు. ఈ పోస్టర్‌లోని సెల్ఫీకి, ఆ టైటిల్‌కి న్యాయం చేసినట్టుగా కనిపిస్తోంది. ఈ చిత్రంతోనే దళపతి విజయ్ సినీ జర్నీ ముగుస్తుంది. దీంతో ఓ శకం ముగిసినట్టు అవుతుంది. ఈ మూవీని విజయ్‌కి ఫేర్ వేల్‌గా ఉండబోతోంది. అభిమానులు ఈ సినిమాను గ్రాండ్‌గా సెలెబ్రేట్ చేసుకునేలా ఉంటుంది. ఇక ఈ మూవీ టైటిల్ అర్థం అందరికీ తెలిసిందే. జన నాయకుడు పీపుల్స్ లీడర్ ప్రజా నాయకుడు అని అర్థం వస్తుంది. ఇన్నేళ్లలో విజయ్ చేసిన సేవా కార్యక్రమాలు, సినీ పరిశ్రమలో సాధించిన విజయాలకు చిహ్నంగా ఈ టైటిల్ ఉంది. ఈ చిత్రంతో అనిరుధ్ మరోసారి తన సంగీతంతో విజయ్ అభి మానుల్ని ఉర్రూతలూగించేందుకు సిద్ధంగా ఉన్నారు.

# అగాథియా థర్డ్ సింగిల్ 'నేలమ్మ తల్లే' విడుదల

**మోస్ట్ ఎవైటెడ్** ఫాంటసీహారర్ థ్రిల్లర్ అగాథియా థర్డ్ సింగిల్ 'నేలమ్మ తల్లే" విడుదలైంది, ఇది అభిమానులను, విమర్శకులను ఆశ్చర్యంలో ముంచెత్తింది. లెజెండరీ యువన్ శంకర్ రాజా స్వరపరిచిన ఈ పాట, మన నేల యొక్క సాంస్కృతిక గొప్పతనాన్ని చెప్పే మాస్టర్ పీస్. అద్భుతమైన విజువల్స్‌తో, ఈ ట్రాక్ 2025లో అత్యంత ఎదురుచూస్తున్న చిత్రాలలో ఒకటైన అగాథియా వేదికగా నిలుస్తుంది, ఈ చిత్రం ఫిబ్రవరి 28, 2025న తమిళం, తెలుగు, హిందీ భాషలలో పాన్‌ఇండియా స్థాయిలో విడుదల అవుతుంది.

"నేలమ్మ తల్లే" మన భూమి వారసత్వంలోకి ఒక ఆత్మీయ ప్రయాణం. ఈ పాటలో మూలికలు, సహజ వనరులను ఉపయోగించి లెక్కలేనన్ని వ్యాధులను నయం చేసిన ఋషులు, ప్రకృతి వైద్యుల అద్భుతమైన సహకారాన్ని అందంగా చిత్రీకరించారు. దీపక్‌కుమార్ పాధి అద్భుతమైన సినిమాటోగ్రఫీ విజువల్ వండర్‌గా వుంది. పా. విజయ్ రాసిన సాహిత్యం ద్వారా పాట యొక్క సారాంశం మరింత సుసంపన్నం చేయబడింది.

పాటపై దర్శకుడు పా. విజయ్ తన ఆలోచనలను పంచుకుంటూ ఈ పాట కేవలం సంగీతం మాత్రమే కాదు ఇది మన భూమి యొక్క లోతుగా పాతుకుపోయిన సాంస్కృతిక వారసత్వం గుండా ఒక ప్రయాణం. లెక్కలేనన్ని వ్యాధులను నయం చేసిన అద్భుతమైన ఔషధ మూలికలను మనకు ఇచ్చిన మన నేల సారాన్ని ప్రదర్శించాలనుకున్నాను. నేను ఈ విజన్‌ని యువన్‌తో పంచుకున్నాను. అతను దానిని వాణిజ్యపరంగా ఆకర్షణీయంగా మార్చారు. ఈ పాట మన నేల శక్తి ద్వారా మానవాళికి దోహదపడిన ఋషులు, వైద్యులకు నివాళి. యువన్ శంకర్ రాజా మాట్లాడుతూ, పా. విజయ్‌తో కలిసి పనిచేయడం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమైన అనుభవం. మన నేల యొక్క అద్భుతమైన ఔషధ, సాంస్కృతిక విలువ గురించి ఆయన కథలను పంచుకున్నప్పుడు, నాకు లోతైన బాధ్యత అనిపించింది. 'నేలమ్మ తల్లే నా బెస్ట్ కంపోజిషన్స్ లో ఒకటి' అన్నారు. వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, వామిండియా (వైడ్ యాంగిల్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్) నిర్మించిన అగాథియా థర్ట్‌గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్‌ని అందిస్తుంది. పా. విజయ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఫాంటసీ, హర్రర్, నోస్టాల్జియాను మిక్స్ చేసిన మెస్మరైజింగ్ జర్నీ. భారతదేశంలోని ప్రముఖ కంటెంట్ పంపిణీ, లైసెన్సింగ్ కంపెనీ అయిన అనీష్ అర్జున్ దేవ్ వామిండియా సహకారంతో ప్రముఖ సౌత్ ఇండియన్ ఫిల్మ్ ప్రొడక్షన్ హౌస్ అయిన వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై డా. ఇషారి కె. గణేష్ రూపొందించిన గ్రాండ్ ప్రాజెక్ట్ అఘతియా. ఈ పాన్ ఇండియా మూవీ ఫిబ్రవరి 28, 2025న తమిళం, తెలుగు, హిందీలో గ్రాండ్‌గా విడుదల కానుంది.



# 'కానిస్టేబుల్'గా వరుణ్ సందేశ్



**వరుణ్ సందేశ్** హీరోగా ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో జాగృతి మూవీ మేకర్స్ పతాకంపై బలగం జగదీష్ నిర్మిస్తున్న చిత్రం 'కానిస్టేబుల్'. వరుణ్ సందేశ్‌కి జోడీగా మధులిక వారణాసి పరిచయం కానున్నారు.

'కానిస్టేబులన్నా కానిస్టేబులన్నా సమాజమే నీ సేవకు సలాం అంటుందన్న...కానిస్టేబులన్నా కానిస్టేబులన్నా ఎగిరే జెండా నిన్నే చూసి మురిసిపోతుందన్నా" అంటూ సాగే టైటిల్ సాంగ్‌ను హైదరాబాద్ పోలీస్ కమీషనర్ సి.వి.ఆనంద్ చేతుల మీదగా విడుదల చేయడం జరిగింది.. దీనికి శ్రీనివాస్ తేజ సాహిత్యాన్ని అందించగా సుభాష్ ఆనంద్ సంగీతాన్ని సమకూర్చారు. నల్గొండ గద్దర్ నర్సన్న ఆలపించారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, నేను ఆవిష్కరించిన ఈ టైటిల్ సాంగ్ చాలా బావుంది. మా కానిస్టేబుల్స్ అంటే నాకు చాలా ఇష్టం. వాళ్ల మీద ఈ సాంగ్ రావడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. ప్రతీ పోలీస్ ఈ సాంగ్ వింటారు" అని అన్నారు...హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ, "సివి ఆనంద్ ఈ పాట విడుదల చేయడం మా సినిమాకు గర్వకారణం. వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇది నాకు మంచి కం బ్యాక్ సినిమా అవుతుంది. నటనకు మంచి అవకాశం ఉన్న పాత్రను ఇందులో పోషించాను" అని అన్నారు.

నిర్మాత బలగం జగదీష్ మాట్లాడుతూ, "కానిస్టేబుల్ కావడం నా చిన్ననాటి కల అది నెరవేరకపోవడంతో ఆ టైటిల్‌తో ఈ సినిమాను నిర్మించడం జరిగింది. కానిస్టేబుల్‌ల మీద నాకున్న గౌరవంతో ఒక అద్భుతమైన పాటను నేను దగ్గరుండి రాయించి, నల్గొండ గద్దర్ నరసన్నతో పాటించడం జరిగింది. ఈ పాటను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ విడుదల చేయడం నాకు చాలా సంతోషంగా ఉంది" అని అన్నారు.

దర్శకుడు ఆర్యన్ సుభాన్ ఎస్.కె. మాట్లాడుతూ, మంచి కథ, కథనాలు, పాత్రలో వరుణ్ ఒదిగిపోయిన విధానం, నిర్మాత అభిరుచి ఈ చిత్రం అద్భుతంగా రావడానికి దోహదం చేసిందని అన్నారు. సినిమాలో సందర్భానుసారంగా వచ్చే టైటిల్ సాంగ్ ఎంతగానో స్పందింప జేస్తుందని అన్నారు.

ఈ చిత్రంలోని ఇతర ముఖ్య పాత్రలలో దువ్వాసి మోహన్, సూర్య, రవివర్మ, మురళీధర్ గౌడ్, బలగం జగదీష్, ప్రభావతి, కల్పలత, నిత్య శ్రీ, శ్రీ భవ్య తదితరులు తారాగణం.

ఈ చిత్రానికి కెమెరా; హజరత్ షేక్ (వలి), సంగీతం : సుభాష్ ఆనంద్, ఎడిటర్: శ్రీ వర ప్రసాద్, బి. జి. ఎమ్: గ్యాని, ఆర్ట్ డైరెక్టర్ : వి. నాని పండు, మాటలు :శ్రీనివాస్ తేజ, పాటలు: రామారావు, శ్రీనివాస్ తేజ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎం జగ్గయ్య,

## నిండు గర్భిణి నృత్యం..



**వేదికపై యాగ్నిక అయ్యంగార్ భరతనాట్యం ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. గర్భంలో కృష్ణుడిని మోసే దేవకిలా 'మాతృత్వం' వర్తించి అందరినీ మెప్పించారామె. బెంగళూరుకు చెందిన యాగ్నిక విజంగానే అప్పుడు నిండువెలల గర్భిణి.**

నాట్యం అనుకున్నంత తేలిక కాదు మెదడుతో అవయవాలన్నీ అనుసంధానమవ్వాలి. భంగిమలతో భావాన్ని పలికించాలి. శారీరకంగా, మానసికంగా ఫిట్ ఉండాలి. నర్తించేటప్పుడు శరీరం సౌకర్యంగా ఉండాలి. నృత్యంలో దశాబ్దానికి పైగా అనుభవం ఉన్న యాగ్నికాకు వేదికపై ప్రదర్శన ఇవ్వడం కొత్తకాదు. అయితే ఈసారి ఆమె ఎనిమిదినెలల గర్భిణి కడుపులో ఉన్న తన బిడ్డతో కలిసి నర్తించాలనిపించిందామెకు. అంతా రిస్క్ అంటే ఈమె మాత్రం దీన్ని ఛాలెంజ్‌గా తీసుకున్నారు. నిండు గర్భంతో వేదికపై భరతనాట్యాన్ని ప్రదర్శించడానికి 30 ఏళ్ల యాగ్నిక సిద్ధమయ్యారు. నా గర్భంలోని బిడ్డతో పూర్తిగా అనుసంధానమై సాధన చేశా. నా అనుభూతిని నా బిడ్డ కూడా పొందాడు. ఎందుకంటే సాధన చేసేటప్పుడు నాకు రాగం, భంగిమవంటివి నచ్చలేదనిపించినప్పుడు వికారంగా, అసౌకర్యంగా ఉండేది. మనసుకు నచ్చినట్లు చేసిన క్షణం తను కడుపులో కదిలేది. అదీ తన ప్రతిస్పందన అని అర్థమయ్యేది. ఈ నృత్యంలో తను నాకు సహకంపోజర్ అనిపించింది. తన ప్రతి కిము అనుభవిస్తూ, ప్రాక్టీస్ చేశా. డ్యాన్సు చాలా శారీరక శ్రమ చేయాల్సి ఉంటుందని తెలిసి సిద్ధపడ్డా. సృష్టి సెంటర్ ఆఫ్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్ అండ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్యాన్స్ థెరపీ డైరెక్టర్ ఎ.వి. సత్యనారాయణ అందించిన ప్రోత్సాహంతో యోగా థెరపీలో నైపుణ్యాలు పెంచుకున్నా, వైద్యుల సలహాలు తీసుకుంటూ ఆరునెలలపాటు సాధన చేశా. అంతేకాదు. కొన్నిసార్లు శారీరకంగా సవాళ్లెదుర్కొన్నా. నా కదలిక నాబిడ్డకు ప్రమాదకరం అవుతుందేమో అనికూడా భయపడ్డారంతా. వాటన్నింటినీ దాటుకుని ప్రయత్నిస్తున్నప్పుడు ప్రదర్శనకు సరిగ్గా వారం ముందు అనుకోకుండా మావయ్య చనిపోయారు. ఇది నా మనసును తీవ్ర వేదనకు గురిచేసింది. ప్రదర్శన దాదాపు రద్దు చేసుకున్నా. అయితే మా అత్తయ్య, మన్ను ముందడుగు వేయమంటూ ప్రోత్సహించారు. అది తిరిగి నాలో శక్తినింపి నృత్యప్రదర్శన ఇవ్వగలిగేలా చేసింది అని చెబుతున్న యాగ్నిక గంటపాటు వేదికపై ఏకబిగిన ప్రదర్శన ఇచ్చారు. నిండుగర్భంతో చేసిన ఆమె నృత్యం అందరి ప్రశంసలూ అందుకుంది. మరవలేని అనుభూతిని మిగిల్చింది.

## లక్షల మంది జీవితాల్లో వెలుగులు..




**జైలుకి వెళ్లినవాళ్లని దూరంగా ఉంచే సంఘటనలు కొన్ని భయపడే సందర్భాలు శిక్ష అనుభవించినా నేరస్థగానే చూస్తారు. వాళ్లతో కలవడానికీ ఉద్యోగం ఇవ్వడానికి సంకోచిస్తారు. అలాంటప్పుడు వాళ్లకెలా ఉంటుంది? ఇదే అలోచించారు. కిరణ్‌బేడీ ఆమె చూపిన పరిష్కారం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతోంది.**

'బయటికి వెళితే మమ్మల్ని ఎవరైనా ఆదరిస్తారా? అసలు మనుషులుగానైనా చూస్తారా?' జైల్లో ఓ ఖైదీ అడిగిన ఈ ప్రశ్న భారత తొలి మహిళా ఐపీఎస్ డా.కిరణ్ బేడీని ఆలోచనలో పడేసింది. దాని ఫలితమే 'ఇండియా విజన్ ఫౌండేషన్', 1994లో తను అందుకున్న రామన్ మెగసేసే 'అవార్డు' మొత్తంతో దీన్ని ప్రారంభించారామె. ప్రపంచానికి అయినవాళ్లకీ దూరంగా... నాలుగ్గోడల మధ్య బతికే జైలు జీవితం గురించి తలుచుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తుంది. క్షణికావేశంలో తప్పు చేశా... అనుకోకుండా కేసులో ఇరుక్కునే బందీఖానాలోకి వెళ్లేవారందరో. చాలాసార్లు కేసు పూర్తయ్యేసరికి ఆలస్యమవుతుంది. నిర్దోషి అయినా జైల్లోనే ఏళ్లపాటు ఉండిపోయే వారికీ కొదవ లేదు. తీరా బయటికొచ్చే సరికి వాళ్ల జీవితమంతా వృథా అవుతుంది. జైలుకి వెళ్లారన్న ముద్రతో కొలువు దొరక్కపోవచ్చు. ఈ వారిలో గూడు కట్టుకున్న నిరాశ సంగతేంటి? వీటన్నింటికీ పరిష్కారంగా ఇండియా విజన్ ఫౌండేషన్ పేరుతో ఎనోఓ తీసుకొచ్చారు కిరణ్‌బేడీ.



**ఏం చేస్తుందీ సంస్థ?** జైలుకి వెళ్లినంత మాత్రాన అంతా అయిపోయినట్టు కాదు. గతాన్ని వెనక్కినెట్టి జీవితాన్ని కొత్తగా ప్రారంభించండి మిమ్మల్ని మీరు మెరుగుపరుచుకోండి అని కౌన్సెలింగ్ ఇస్తాం. నిజానికి ఇది చెప్పినంత సులువు కాదు. ఒంటరి అయ్యామన్న బాధ, తప్పు చేశాం, అనవసరంగా తొందరపడ్డామంటూ తమలో తామే కుంగిపోతుంటారు. ఇక నిర్దోషుల పరిస్థితి మరీ దారుణం. అందుకే ఖైదీల మనసు మారుస్తూనే... కంప్యూటర్, టైలరింగ్, క్రాఫ్ట్, చదువు కోవడం ఇలా. నైపుణ్యశిక్షణతో పాటు కస్టడీలో ఉన్నవారి పిల్లల కోసం క్రెష్లు, ఆర్థికంగా వెనకబడిన వారి పిల్లలకు చదువులనూ అందిస్తాం. జైలు నుంచి బయటికి వెళ్లేసరికి వారికి ఎవరిమీద ఆధారపడాల్సిన అవసరం ఉండకూడదు, గతం తాలూకూ నీడలు వారిని వెంటాడొద్దనేదే మా ప్రయత్నం' అంటారు సంస్థ డైరెక్టర్ మోనికా ధవన్. జైల్లో ఉత్సాహంగా ఉన్నవారిని వలంటీర్లుగా తీర్చిదిద్దు తున్నారు. తీహార్ జైల్లో మొదలైన ఈ సేవలు దేశవ్యాప్తంగా వంద కారాగా రాలకు విస్తరించాయి. పది లక్షల మందికి పైగా ఈ నైపుణ్యాలను అందించారు. మొబైల్ మీరెప్పుడై దీనివల్ల మీ ప్రయోజన మొబైలు పాటించారా. వాళ్లలో మార్పు వస్తే సరిపోతుందా? చుట్టూ ఉండే వాతావరణం కూడా సానుకూలంగా ఉండాలి! ఇదీ ఆలోచించారు. కిరణ్ అందుకే అధికారుల కోసమూ కొన్ని కార్యక్రమాలు రూ. పొందారు. వీటిద్వారా ఖైదీల పట్ల సహానుభూతి చూపుతూ, వారిని ప్రోత్సహిస్తారు. స్థూలంగా నేరస్థులు... వాళ్లలో మార్పు రాదు అన్న జైల్లో పనిచేసే అధికారుల్లో తొలగేలా చూస్తారు.. కేవలం గత ఏడాదే 816 మంది అధికారులు ఈ శిక్షణలో ఉన్నారు. లక్షల మంది వరకూ మా ప్రయాణం సాగడం అంత సులువు కాదు. ఒక కుర్రాడిని ఈ 'ప్రిజన్ ప్రోగ్రామ్'లో చేరి తనని తాను తీర్చిదిద్దుకోమని ఎన్నిసార్లు నచ్చజెప్పినా అతనిలో మార్పు లేదు. సెషన్ల తరవాత ఎన్నో రేడియో జాకీగా శిక్షణ తీసుకున్నాడు. ఒకప్పుడు మాట బయటికి రానిచ్చే వాడు కాదు. ఇప్పుడుగాన్ జైట్లో రేడియో ప్రోగ్రామ్ గుడ్డు. ఇదంతా కష్టమైన పనే.... కానీ మా వల్ల వాళ్ల కళ్లలో ఆశలు చిగురించడం చూస్తే మరింత ఉత్సాహంగా పనిచేయాలనిపిస్తుంది అంటారు. ఇండియా విజన్ ఫౌండేషన్ సభ్యులు. వాళ్ల పనిని అభినందించాల్సిందే కదూ!

## పాప్‌కార్న్ సులువుగా ..



సినిమాకి వెళ్లాలంటే ఇంటర్వెల్లో పాప్‌కార్న్ ఉండాల్సిందే లేదంటే.. ఏదో వెలితిగా, చక్కగా ఉంటుంది. ఈ పేలాలు థియేటరుకే పరిమితం కాదు. ఇంట్లోనూ ఇష్టంగా తినేస్తాం. అంత ఇష్టమైన పాప్‌కార్న్ బయట కొనుక్కుంటే. ప్యాకెట్ తెరిచాక వెంటనే తినేయాలి. లేదంటే క్రిస్పీనెస్ ఉండదు. సాగినట్లవుతాయి. అంతకంటే ముఖ్యంగా.. అవి నిలవుండేందుకు రసాయనాలు ఉపయోగిస్తారు. అలాంటి ఇబ్బందులు లేకుండా ఇంట్లోనే చేసుకుంటే బాగుంటుంది కదూ! ఎలాగంటారా.. ఎండు మొక్కజొన్న గింజలు కొన్నిటిని ఒక పాత్రలోకి తీసుకుని.. అందులో ఆలివ్ నూనె లేదా వెన్న, కొంచెం ఉప్పు వేసి కలియ తిప్పాలి. వీటిని అవెన్‌కు అనుకూలమైన పేపర్ బ్యాగ్‌లో వేసి, చివర్లో మూసేయాలి. ఇప్పుడు అవెన్‌లో పెట్టి, నిమిషం పాటు ఉంచితే సరి. ఘుమఘుమలాడే వేడి వేడి పాప్‌కార్న్ సిద్ధం. ఇక తిని ఆనందించడమే తరువాయి.

## మనకు తెలియకుండానే ఖర్చు !

సొంతంగా సంపాదించ డం మొద లు పెట్టాక తెలియ కుండానే అలా ఖర్చు చేస్తుంటారు. కొందరికి ఆర్థిక పరిస్థితులు బాగున్నా అల మరాలు నింపేస్తా రుగా అంటే.. దానికీ కారనముంది అంటున్నాయి కొన్ని పరిశోధనలు. ఆత్మ విశ్వా సంగా కనిపించడానికి అమ్మాయిలు ఎంచుకునే మార్గాల్లో దుస్తులూ ఒకటి. వాళ్ల వ్యక్తిత్వం, స్టైల్‌ని వాటి ద్వారా వ్యక్తపరుస్తారట. అందుకే ఎన్ని ఉన్నా తాజా ధోరణు లను తెలుసుకుని మరీ వేసుకున్నా వేసుకోకపోయినా దుస్తులు, చెప్పులు వగైరా కొంటూనే ఉంటారు. ఇంకొందరైతే అలా కొనడం ద్వారా ఒత్తిడి దూరమైన ట్లుగా భావిస్తారు. అందుకే 'ఎందుకింత ఖర్చు' అన్నా తీరు మాత్రం మార్చుకోలేరు. బ్యూటీ ఉత్పత్తుల మాటేంటి? ముఖ్యమైన సందర్భం.. అందంగానో, నలుగురిలో ఉత్తమంగానో కనిపించా లనుకుంటారు. తీరా ఏ

ఆన్‌లైన్‌లో తగ్గింపు అని కని పించినా, సరదాగా బయటికి వెళ్లినా ఒకటో రెండో డ్రెస్సు లు వెంటబెట్టు కొచ్చేస్తారు. అప్పటికే బోలెడు క్రీములు ఇంట్లో ఉన్నా.. ఎవరో సిఫారసు చేశారనో, తక్కువకే వస్తు న్నా యనో మరిన్ని తెచ్చేస్తుంటారు. అప్పుడు అమ్మల నుంచి ఎదురయ్యే ప్రశ్న ఇప్పటికే ఉన్నాయిగా? మళ్లీ ఇవన్నీ ఎందుకు? దండగ ఖర్చు కాకపోతే' అనే కదూ! నిజంగానే ఎందుకిలా కొనేస్తాం?. కొన్ని వస్తువులు, దుస్తులు ఎంత నచ్చినా ఆర్థిక పరిస్థితి అనుకూలించక కొనలేరు కొందరు. అదలా మనసులో నాటుకు పోతుందేమో..



కాటుకో, మరేదో కనిపించదు.. చూసే వాళ్లకు చిన్నగానే కనిపిస్తుంది. మనసులో ఆ లోటు వాళ్లకి తెలుస్తూనే ఉంటుంది. సందర్భమేదైనా 'పర్‌ఫెక్ట్'గా ఉండాలనుకునే అమ్మాయిలే ఎక్కువ. అలాంటివాళ్లు వీటినెలా తట్టుకుంటారు చెప్పండి. అందుకని ముందుగానే సిద్ధంగా ఉండా లన్న తాపత్రయంలో తెలియ కుండానే ఇలా ఖర్చు చేస్తుంటారు. ఈ తీరు ఇబ్బంది కదా! అంటే.. అవుననే అంటున్నాయి అధ్యయనాలు. ఖర్చు పెట్టే స్థోమత ఉందన్న ధైర్యం, అందుబాటులో ఉన్న క్రెడిట్ కార్డు అనవసర ఖర్చేమో అన్న ఆలోచనే రానీయడం లేదట. కాబట్టి, నెలకి దుస్తులు, సౌందర్య ఉత్పత్తు లకు ఇంత అని బడ్జెట్ పెట్టుకోవాలి. దాన్ని తు.చ. తప్పకుండా పాటించడమే దీనికి సరైన పరి ష్కారం అంటున్నారు నిపుణులు. ఒకవేళ దానిలో మిగిలితే మరుసటి నెలకు బదిలీ చేసుకోవచ్చు. పరిధి దాటితే మాత్రం అడ్డుకట్ట వేసు కోవడంఒక్కటే మార్గం. ప్రయత్నిస్తారా మరి?

## తెలుసుకుందాం..

దమయంతి గుప్తా... ఫోర్డ్ కంపెనీ నియమించుకున్న మొట్టమొదటి భారత మహిళా ఇంజినీర్ అప్పట్లో మహిళలను నియమించుకోవద్దని



ఫోర్డ్ కంపెనీలో కఠిన నిబంధన ఉంది. అయితే, అసలు మీకు మహిళలకు అవకాశం ఇవ్వకపోతే మీ కంపెనీలో మహిళా ఇంజినీర్లు ఎలా ఉంటారు? అని ఇంటర్వ్యూలో హెచ్‌ఎరు ప్రశ్నించారు దమయంతి. ఆ వైద్యమే నిబంధనను తొలగించేలా వేసింది. అలా 1967లో యునైటెడ్ స్టేట్స్‌లోని ఫోర్డ్ మోటార్స్‌లో తన కెరియర్ మొదలు పెట్టారు దమయంతి,

## పదార్థాలతో పిల్లలు





చిన్నారులు ఆడినా పాడినా అందమే.న ఆఖరికి అల్లరి చేసినా ఆహ్లాదమే. ఎందుకంటే అది కపటం తెలియని పసితనం. చిలిపి చేష్టల సిసింద్రీల్లో మోసాలూ ద్వేషాలూ ఉండవు. ముద్దు ముద్దు ఆటలతో మరిపెం కలిగిస్తారు. పదార్థాలతో పిల్లల్ని రూపొందించాం. చూసి ఆనందించండి.














## మహాభారతము

**వృషపర్వుడు రాక్షసరాజు.** ఆయన వద్ద పురోహితుడు శుక్రాచార్యుడు. రాకుమార్తె శర్మిష్ఠ, శుక్రాచార్యుని కుమార్తె దేవయాని. ఒక రోజు కొందరు చెలికత్తెలతో కలిసి శర్మిష్ఠ, దేవయాని వనవిహారానికి వెళ్లి ఒక కొలనులో స్నానం చేస్తుండగా పెద్ద సుడిగాలి వచ్చి వారి వస్త్రాలన్నీ చిందర వందరగా ఎగిసి పడ్డాయి. వారంతా నీళ్ళలో నుండి త్వరత్వరగా బయటికి వచ్చి ఎవరికి ఏ వస్త్రం దొరికితే దాన్ని ధరించారు. రాజకుమారి శర్మిష్ఠ దేవయాని దుస్తుల్ని ధరించింది. రాకుమారి శర్మిష్ఠ వస్త్రాలే. వాటిని ధరించటానికి ఇష్టపడని దేవయాని శర్మిష్ఠతో 'నేను బ్రాహ్మణ కన్యను, నీకు పూజ్యురాలను. నీవు కట్టిన మలిన వస్త్రాన్ని నేను కట్టుకోను అనింది. శర్మిష్ఠ కోపంతో, నా తండ్రి రాజు, నీ తండ్రి నా తండ్రిని ఆశ్రయించి బ్రతుకుతున్నాడు, అని అంటూ దేవయానిని ప్రక్కన ఉన్న పాడుబడిన బావిలోకి తీసి వెళ్లింది. వేటకై వచ్చిన యయాతి దేవయానిని బావిలో నుంచి తీసి రక్షించి వెళ్లి పోయాడు. దేవయాని పట్టణంలోకి పోవటానికి ఇష్టపడక అక్కడే కూర్చొన్నది. విషయాన్నంతా తెలుసుకొని శుక్రాచార్యుడు వచ్చి, గొప్ప యజ్ఞాలు చేసిన వారికన్నా కోపం లేనివాడే ఉత్తముడు శర్మిష్ఠపై కోప్పడక ఇంటికి వెళదాం రా' అన్నాడు. వృషపర్వుడు వచ్చి దేవయానితో, ' నీ కోరికేమో చెప్పు, నెరవేరుస్తాను, అన్నాడు దేవయానితో శర్మిష్ఠతో కలిసి వేయి మంది దాసీలు కావాలని దేవయాని కోరింది. శర్మిష్ఠ ఆమెకు దాసి అయింది. (పుటలు 40-43-ఆదిపర్వము) శ్రీ మదాంధ్ర మహాభారతం రామకృష్ణ మఠం.



వ్యాస భగవానుడు ఏ గొప్ప సత్యాన్ని, నీతిని నేర్పుతున్నాడో గమనించారా? కులాన్ని గూర్చి అహంకరించరాదు, హోదాను బట్టి విర్ర వీగరాదు, యజ్ఞ యాగాదులను చేయుటకన్నా కోపాల్ని వదలటం శ్రేష్టం. ఏ కులస్తులైనా, ఎంత అధికారమున్న వారైన కర్మఫలితాన్ని అనుభవించక తప్పదు. పిల్లలు తప్పువారిని సమర్థించక వృషపర్వుని వలె, శుక్రాచార్యుని వలె వారికి తగిన విధంగా బుద్ధి చెప్పి సరిదిద్దాలి. ఇలాంటి వందల కథలను మనకు అందిస్తుంది మహాభారతం.

**- రాచమడుగు శ్రీనివాసులు**

ఆధ్యాత్మికం

## శీతగాలుల నుంచి చర్మానికి రక్షణ

**ముఖానికి క్రీములెన్ని రాసినా... చలిగాలుల ప్రభావం నుంచి తప్పించుకోవడం కష్టమే. దీంతో ముఖం పొడిబారుతుంది. శీతగాలుల నుంచి చర్మాన్ని రక్షించాలంటే...**

ఫ్లెన్సింగ్‌తో రోజును మొదలుపెట్టాలి. అయితే చర్మంలోని సహజనూనెలు దూరమవ్వకుండా క్రీమ్. లేదా నూనె ఆధారిత క్లెన్సర్ను ఎంచుకోవాలి. చర్మంలోని మృతకణాలను ఎప్పటికప్పుడు తొలగిస్తేనే చర్మం కాంతివంతం ఉంటుంది. కానీ ఈ కాలం చర్మం సున్నితంగా మారుతుంది. కాబట్టి, మైల్డ్ ఎక్స్‌ఫ్లియేటర్లో వారానికి రెండుసార్లు శుభ్రపరచాలి.



**టోనర్‌గా..**, అల్కహాల్ ఫ్రీ టోనర్ను ఎంచుకోవాలి. ఈ సీజన్లో గ్లిజరిన్, గులాబీనీరు, కలబంద ఉన్న టోనర్ ఏదైనా మంచిదే. ఇది చర్మాన్ని తాజాగా, తేమగా, మృదువుగా మారుస్తుంది. చర్మరంధ్రాలను శుభ్రపరిచి దద్దుర్లు, పొడారడం వంటి సమస్యలకు చెక్ పెడుతుంది.

**మాయిశ్చరైజర్....** సెరమైడ్స్, షియాబటర్ లేదా కొవ్వు ఆమ్లాలు ఉన్న మాయిశ్చరైజర్ ఎంచుకోవాలి. క్రీమ్ ఆధారితమైనదైతే మరీ మంచిది. ఆపై సన్‌స్క్రీన్ తప్పనిసరి. ఇది ఎండ నుంచి హాని కలగకుండా నిరోధిస్తూనే ముందస్తు వృద్ధా ప్యఛాయల ను దరిచేర నీయదు. ఎస్పీఎఫ్30 లేదా అంతకంటే ఎక్కువ ఉన్న బ్రాడ్‌స్పెక్ట్రమ్ సన్ స్క్రీన్ను ఎంచుకోవాలి.

**ఆరోగ్యంగా...** చర్మ ఆరోగ్యానికి పైపై పూతలే చాలవు. లోపలినుంచీ పోషణ కావాలి. అందుకే తగినంత నీరు తప్పనిసరి. హెర్బల్టీలతో చర్మంపై ముడతలు, గీతలు రాకుండా ఉంటాయి. రాత్రుళ్లూ ముఖాన్ని మృదువైన క్లెన్సర్తో శుభ్రపరుచు కోవాలి. ఆపై కలబందలో విటమిన్ ఈ బాదంనూనె కలిపిన మిశ్రమాన్ని రాయడం తప్పనిసరి. ఇది పొడిబారే ప్రభావాన్ని తగ్గించి ఉదయానికి ముఖాన్ని తాజాగా మారుస్తుంది.

## పాత్రల్ని మెరిపిద్దామిలా..

**ఉదయాన్నే ఓ పక్క వంట, ఇంకోపక్క పిల్లలను రెడీ చేస్తుంటాం.** రెండూ ఏకకాలంలో చేయడంతో ఒక్కోసారి పాలు, అన్నం, కూరలు అడ ుగంటడం, మాడిపోవడం వంటివి తరచూ జరుగుతాయి. వీటిని మామూలుగా వదిలించాలంటే కష్టమే. కానీ ఈ చిట్కాలను ఉపయోగిస్తే సులభంగా కొత్తవాటిలా మెరిపించవచ్చు. పాత్రలో మాడు ఉన్నంత వరకు నీటిని నింపి, పావు కప్పు వెనిగర్ కలపాలి. తర్వాత స్టౌ మీద పెట్టి మీడియం మంటపై మరిగించాలి. ఇలా మరుగుతున్నప్పుడు పాత్రకు పట్టి ఉన్న ఆహారపదార్థాలు, మొడిమరకలు నెమ్మదిగా పాత్ర నుంచి వేరవుతాయి. తర్వాత స్క్రబ్బర్ లేదా పీచుతో శుభ్రం చేస్తే సులభంగా తొలగిపోతాయి. నిమ్మకాయలను ముక్కలుగా కోసి పాత్రని సగం నీటితో నింపి, మరిగించి పీచుతో శుభ్రం చేయాలి. నిమ్మలో ఉండే యాసిడ్ గుణాలు పాత్రకు అంటుకున్న మొండి మరకలు, వాసనను తొలగిస్తాయి. పాత్రలో నీటిని నింపి తగినంత బేకింగ్ సోడా వేసి పదినిమిషాలు మరిగించాలి. లేదా బేకింగ్ సోడాలో వెనిగర్‌ను కలిపి పేస్టులా తయారు చేసి, ఈ మిశ్రమంతో పాత్రలను శుభ్రపరిచినా మంచిదే. . మాడు మరకలను వదిలించడానికి మరకలున్న పాత్రలో ఉల్లితొక్కలను నీటిలో వేసి పావుగంట వేడిచేయాలి. తర్వాత రోజూ ఉపయోగించే సబ్బుతో శుభ్రపరిస్తే సిరి. కొత్తవాటిలా మెరుస్తాయి.

## మహిళల వన్డే టీమ్ ఆఫ్ ది ఇయర్‌లో..

# స్మృతి, దీప్తికి చోటు



**ఢిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మహిళల వన్డే టీమ్ ఆఫ్ ది ఇయర్-2024 జట్టులో ఇద్దరు భారత ప్లేయర్లకు చోటు దక్కింది. గతేడాది అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న భారత మహిళల జట్టు ఓపెనర్ స్మృతి మంధాన, స్పిన్ ఆల్ రౌండర్ దీప్తి శర్మ ఈ టీమ్‌లో స్థానం సంపాదించించారు. కాగా స్మృతి 2024లో 13 వన్డేలు ఆడి 747 పరుగులు చేసింది. తద్వారా అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా నిలిచింది. ఇక 2024లో 13 వన్డే లాడిన దీప్తి శర్మ 186 పరుగులు చేయడంతో పాటు, 24 వికెట్లు పడగొట్టి ఈ జట్టులో చోటు దక్కించుకుంది. ఈ జట్టుకు దక్షిణాఫ్రికా స్టార్ లౌరా వాల్వర్ట్ సారథిగా ఎంపికైంది. మరోవైపు ఇంగ్లండ్ నుంచి అమీ జోన్స్, సోఫీ ఎకెల్‌స్టోన్, కేట్ క్రాస్ రూపంలో ముగ్గురు ప్లేయర్లు, ఆస్ట్రేలియా నుంచి ఆష్లే గార్డనర్, అనాబెల్ సథర్లాండ్ చోటు దక్కించుకున్నారు. సఫారీ ప్లేయర్ మరినే కాప్‌తో పాటు, శ్రీలంక నుంచి చమరి ఆటపట్టు, వెస్టిండీస్ ప్లేయర్ హేలీ మాథ్యూస్ కూడా ఈ టీముకు ఎంపికయ్యారు. దీంతో ఐసీసీ మహిళల వన్డే టీమ్ ఆఫ్ ది ఇయర్-2024లో స్మృతి మంధాన, లారా వాల్వర్ట్ (కెప్టెన్), చమరి ఆటపట్టు, హేలీ మాథ్యూస్, మరినే కాప్, ఆష్లే గార్డనర్, అనాబెల్ సథర్లాండ్, అమీ జోన్స్ (వికెట్ కీపర్), దీప్తి శర్మ, సోఫీ ఎక్లిస్టోన్, కేట్ క్రాస్ ఉన్నారు.

## ఛాంపియన్‌గా అమెరికా అమ్మాయి

### వరల్డ్ నంబర్ 1 సబలెంకపై గెలుపు



**ఢిల్లీ:** ఆస్ట్రేలియా ఓపెన్ టోర్నమెంట్-2025 ఛాంపియన్‌గా మాడిసన్ కీస్ అవతరించింది. బెలారస్ టెన్నిస్ స్టార్ ప్రపంచ నెంబర్ 1 సబలెంకకు షాక్ తగిలింది. మెల్ బోర్న్‌లో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్ పోరులో చివరకు ఆమె ఓడింది. టైటిల్ పోరులో సబలెంకను ఢీ కొట్టిన అమెరికా అమ్మాయి కీస్ ఛాంపియన్‌గా నిలిచింది. హోరాహోరీగా సాగిన ఈ పోరులో 6-3, 2-6, 7-5 తేడాతో సబలెంకను కీస్ మట్టికరిపించి తన కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించింది. పదేళ్ల క్రితం 19 ఏళ్ల ప్రాయంలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనే మాడిసన్ కీస్ తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీ ఫైనల్‌కు చేరుకొని వెలుగులోకి వచ్చింది. ఇప్పుడు పదేళ్ల తర్వాత అదే ఆస్ట్రేలియన్ ఓపెన్ లో ఆమె తన గ్రాండ్‌స్లామ్ టైటిల్ కలను నెరవేర్చుకుంది. 19వ సీడ్‌గా ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్లో బరిలోకి దిగిన ప్రపంచ 14వ ర్యాంకర్ మాడిసన్ కీస్ అందరి అంచనాలను తారుమారు చేసి చివరకు తొలి సారి చాంపియన్ సాధించింది. గత రెండేళ్లు ఈ టోర్నీలో విజేతగా నిలిచి, ఆస్ట్రేలియన్ ఓపెన్ సన్నాహకంగా జరిగిన బ్రిస్బేన్ ఓపెన్ టోర్నీలో టైటిల్ నెగ్గి జోరు మీదున్న బెలారస్ స్టార్, ప్రపంచ నంబర్ వన్, టాప్ సీడ్ సబలెంకాను ఓడించిన కీస్ కెరీర్లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను దక్కించుకుంది. విజేతగా నిలిచిన మాడిసన్ కీసుకు 35 లక్షల ఆస్ట్రేలియన్ డాలర్లు (భారత్ కరెన్సీలో 19 కోట్ల 3 లక్షల రూపాయలు), రన్నరప్ సబలెంకాకు 19 లక్షల ఆస్ట్రేలియన్ డాలర్లు ( 10 కోట్ల 33 లక్షల పాయల) ప్రైజ్ మనీగా లభించాయి. టైటిల్ గెలిచేక్రమంలో కీస్ ముగ్గురు గ్రాం డ్స్లామ్ చాంపియన్లు (రిబా కినా, స్వియాటెక్, సబలెంకా) ఓడించడం విశేషం.

## ఐ లీగ్‌లో ఒడిదుడుకుల్లో శ్రీనిధి

**ఢిల్లీ:** ప్రతిష్ఠాత్మక ఐ లీగ్‌లో శ్రీనిధి దక్కన్ ఎఫ్‌సీ ఒడిదొడుకుల పయనం కొనసాగుతున్నది. బెంగుళూరులో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి ఎఫ్‌సీ 01తో స్పోర్టింగ్ క్లబ్ బెంగళూరు చేతిలో ఓటమిపాలైంది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో బెంగళూరు తరఫున అసిఫ్ (34ని) ఏకైక గోల్ చేశాడు.

ఈ మ్యాచ్ కోసం శ్రీనిధి ఎఫ్‌సీ 3 మార్పులు చేసినా లాభం లేకపోయింది. లీగ్‌లో ఇప్పటి వరకు 10 మ్యాచ్‌లాడిన శ్రీనిధి జట్టు 11 పాయింట్లతో 9వ స్థానంలో కొనసాగుతున్నది.

## ఖేల్ ఇండియా వింటర్ గేమ్స్: తెలంగాణ స్కేటర్ ప్రణవ్‌కు స్వర్ణం




**ఢిల్లీ:** జమ్ము కశ్మీర్ వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా వింటర్ గేమ్స్‌లో తెలంగాణ పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. లడఖ్‌లో జరిగిన పురుషుల 500 మీటర్ల ఐస్ స్కేటింగ్‌లో తెలంగాణ యువ స్కేటర్ సూరపనేని ప్రణవ్ మాధవ్ పసిడి పతకంతో మెరిశాడు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో ప్రణవ్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. రేసును 56.86 సెకన్లలో ముగించిన అతడు అగ్రస్థానంలో నిలువగా, సమ్రుద్ (1:00:31సె, కర్నాటక), సుమిత్ తప్కిర్ (1:00:58సె, మహారాష్ట్ర) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. టోర్నీలో ప్రస్తుతం రెండు స్వర్ణాలు దక్కించుకున్న తెలంగాణ టాప్‌లో కొనసాగుతున్నది. మరోవైపు పురుషుల ఐస్ హాకీలో ఉత్తరాఖండ్ 60తో హిమాచల్‌ప్రదేశ్‌పై విజయాలు సాధించాయి.

## మహిళల అండర్ 19 వరల్డ్ కప్:

# సూపర్ సిక్స్‌లో భారత్ మరో విజయం

### 8 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్ ఓటమి

**ఢిల్లీ:** మహిళల అండర్-19, టీ20 వరల్డ్ కప్-2025లో భారత్ మరో విజయం సాధించింది. గ్రూప్ దశ మ్యాచ్‌లో అజేయంగా నిలిచిన టీమిండియా, సూపర్6లో రెండోవిజయం ఖాతాలో వేసుకుంది. బంగ్లాదేశ్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల





నష్టానికి 64 పరుగులు మాత్రమే చేసింది. బంగ్లా ఇన్నింగ్స్‌లో కేవలం ఇద్దరు మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. కెప్టెన్ సుమయ్యా అక్తెర్ 21 పరుగులతో నాటౌట్, జన్నతుల్ మోకా 14 పరుగులు చేశారు. భారత బౌలర్లందరూ చాలా పొదుపుగా బౌల్ చేశారు. వైష్ణవీ శర్మ 3, షబ్నమ్ షకీల్, విజే జోషిత్, గొంగడి త్రిష తలో వికెట్ పడగొట్టారు. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత్ 7.1 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి విజయతీరాలకు చేరింది. ఓపెనర్ గొంగడి త్రిష (31 బంతుల్లో 40 పరుగులు, 8 సిక్సర్లు) మరోసారి మెరుపు ఇన్నింగ్స్ ఆడి భారత్ గెలుపునకు గట్టి పునాది వేసింది. జి కమలిని 3 పరుగులు, సనికా ఛల్కే 11 పరుగులు (నాటౌట్), కెప్టెన్ నికీ ప్రసాద్ 5 (నాటౌట్) పరుగులు చేశారు. ఇక బంగ్లాదేశ్ బౌలర్లలో అనిస అక్తెర్ శోభా, హబిబా ఇస్లాం పింకీ తలో వికెట్ పడగొట్టారు. సూపర్ సిక్స్‌లో భారత్ తదుపరి స్కాట్లాండ్‌తో ఈ నెల 28న ఆడనుంది. కాగా సూపర్ సిక్స్‌లో భారత్ గ్రూప్ 1లో ఉంది. ఈ గ్రూప్‌లో భారత్ రెండు మ్యాచ్‌లు ఆడి రెండిటిలోనూ విజయాలు సాధించింది. గ్రూప్ 1లో భారత్‌తో పాటు, ఆస్ట్రేలియా, శ్రీలంక, బంగ్లాదేశ్, స్కాట్లాండ్, వెస్టిండీస్ జట్లు ఉన్నాయి. ఈ గ్రూప్‌లో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో కొనసాగుతుంది. ఇక గ్రూప్2లో సౌతాఫ్రికా, ఇంగ్లండ్, నైజీరియా, యూఎస్ఏ, న్యూజిలాండ్, ఐర్లాండ్ జట్లు ఉన్నాయి. ఈ గ్రూప్‌లో సౌతాఫ్రికా టాపర్‌గా కొనసాగుతుంది. ఇదిలా ఉంటే, గ్రూప్1లో భాగంగా ఆదివారం నాడు జరగాల్సిన మరో మ్యాచ్ (శ్రీలంక, స్కాట్లాండ్) వర్షం కారణంగా రద్దైంది.

# భారత్ రెజ్లర్లకు షాక్!

### ఇలా అయితే మళ్లీ సస్పెన్షన్ వేటు..

### యుడబ్ల్యుడబ్ల్యు వార్నింగ్

**ఢిల్లీ:** రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ)కు వరల్డ్ రెజ్లింగ్ (యుడబ్ల్యుడబ్ల్యు) సమాఖ్య పాలక మండలి వార్నింగ్ ఇచ్చింది. సమాఖ్య వ్యవహారాల్లో రాజ కీయ జోక్యాన్ని త్వరగా ముగించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. లేదంటే మళ్లీ సస్పెన్షన్ వేటు విధించాల్సి వస్తుందని పేర్కొంది. డబ్ల్యూఎఫ్ఐ స్వయం ప్రతిపత్తితో పని చేయాలని వెల్లడించింది. ఈ మేరకు యుడబ్ల్యు డబ్ల్యు ప్రెసిడెంట్ నేనాద్ లాలోవిక్, డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు సంజయ్ సింగ్‌కు ఒక లేఖ రాశారు. "భారత రెజ్లింగ్ అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించే విషయమై మాకు సరైన విధానం కావాలి. జాతీయ సమాఖ్యల కోసం పబ్లిక్ గ్రాంట్స్ ను వినియోగించే విషయమై మినహా, సమాఖ్య వ్యవహారాల్లోని అంతర్గత విషయాల్లో పబ్లిక్ లేదా పొలిటికల్ అథారిటీస్ జోక్యాన్ని యుడబ్ల్యుడబ్ల్యు అంగీకరించదు. యుడబ్ల్యుడబ్ల్యు రాజ్యాంగంలోని 6.3 ఆర్టికల్ స్వయంప్రతిపత్తి వ్యవస్థ, స్వేచ్ఛను ఇచ్చింది. అది కచ్చితంగా ఫెడరేషన్స్ లోని ప్రతిఒక్కరూ పాటించాలి.

కాబట్టి పూర్తి స్వయం ప్రతిపత్తితో పనిచేయలేకపోతే, గతంలో విధించిన సస్పెన్షన్‌ను మళ్లీ విధించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది." అని లాలోవిక్ లేఖలో పేర్కొన్నారు. ఒకవేళ యుడబ్ల్యుడబ్ల్యు రాజకీయ జోక్యం కారణంగా డబ్ల్యూఎఫ్ఐని సస్పెండ్ చేస్తే భారత రెజ్లర్లు భవిష్యత్ లో అంతర్జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొనే అర్హతను కోల్పోతారు. "ఇప్పటికే నేషనల్ క్యాంప్స్‌ను సస్పెన్షన్ కారణంగా హోల్డ్‌లో ఉంచారు. కాబట్టి మంత్రిత్వ శాఖ ఈ సస్పెన్షన్ సమస్యకు ముగింపు పలకపోతే, డబ్ల్యూఎఫ్ఐపై వేటు పడుతుంది. దీని వల్ల క్రీడా వ్యవస్థకు, దేశంలోని రెజ్లర్లకు భారీ నష్టం కలుగుతుంది." అని డబ్లుఎఫ్ఐకి చెందిన ఓ ప్రతినిధి అన్నారు. కాగా 2023 ఆగస్టులో భారత రెజ్లింగ్ సమాఖ్య సభ్యత్వాన్ని వరల్డ్ రెజ్లింగ్ నిరవధికంగా సస్పెండ్ చేసింది. అప్పటి డబ్ల్యుఐ చీఫ్ బ్రిజ్ భూషణ్‌పై మహిళా రెజ్లర్లు అత్యాచార ఆరోపణలతో పాటు, ఆందోళన బాట పట్టడంతో నిర్ణీత గడువులోపు ఎన్నికలు నిర్వహించలేకపోయారు. ఈ వ్యవహారం రాజకీయంగానూ పెద్ద ఎత్తున దుమారం రేపింది. ఈ విషయంలో కేంద్ర క్రీడా శాఖ కూడా జోక్యం చేసుకుంది. దీంతో భారత రెజ్లింగ్ సమాఖ్యను యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ సస్పెండ్ చేసింది. ఆ తర్వాత గతేడాది ఈ సస్పెండ్‌ను యుడబ్ల్యుడబ్ల్యు ఎత్తివేసింది. కానీ సమాఖ్య వ్యవహారాల్లో రాజకీయ జోక్యం ఇంకా కొనసాగుతోందని, తొందరగా దీనికి ముగింపు పలకాలని, లేదంటే సస్పెన్షన్ వేటు తప్పదంటూ యుడబ్ల్యుడబ్ల్యు తాజాగా మరోసారి హెచ్చరించింది.

# రియల్ ఎస్టేట్‌లో మహిళలే ఎక్కువ!

**ముంబై, జనవరి 26:** భారత దేశంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం లాభాలబాటలో పయనిస్తుం ది. అయితే ఈ రంగంలో రాణించాలంటే చదువు కంటే ఎక్కువగా తెలివితేటలు ఉండాలి. రియల్ ఎస్టేట్ అనగానే ముఖ్యంగా పురుషులే ఈ వ్యాపారానికి అర్హులు అనుకుంటుంటారు. కానీ భారతదేశంలో రియల్ ఎస్టేట్ రంగంలో పనిచేసే ఆడవాళ్ల సంఖ్య ఎంతో తెలిస్తే మీరు షాక్ అవుతుంది. భారతదేశంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం




మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. అయితే ఈ రంగంలో మహిళలు ఎక్కువ చొరవ తీసుకోవాల్సిన రంగంగా నిలు స్తోంది. భారత రియల్ ఎస్టేట్ రంగంలో పనిచే 7.1కోట్ల కార్మికుల్లో కేవలం 70లక్షల మంది మహిళలు మాత్రమేఉన్నారని తాజాగా ఓరిపోర్టు వెల్లడించింది. మ్యాక్స్ ఎస్టేట్స్, ఇన్ టాండమ్ గ్లోబల్ కన్సల్టింగ్ కాంక్రీట్ చేంజ్ మెరుగైన వేతన సమానత్వం, మహిళల సమానతను రియల్‌ఎస్టేట్‌లో చేర్చడం అనే రిపోర్టును రిలీజ్ చేసింది. ఈ నివేదికలో రియల్ ఎస్టేట్ రంగం ఇంకా సమానత్వాన్ని సాధించడంలో చాలా దూరం ఉందని సూచించింది. అయితే ఈ నివేదిక తెలిపిన వివరాల ప్రకారం భారతదేశ జనాభాలో మహిళలు 48.5 శాతం ఉండగా, అందులో సుమారు 1.2శాతం మాత్రమే రియల్ ఎస్టేట్ రంగంలో పనిచేస్తున్నట్లు వెల్లడించింది. మహిళల తక్కువ ప్రాతినిధ్యం అన్ని స్థాయిల్లో సమానమైన వేతనా లు లేని సమస్య రియల్ ఎస్టేట్ రంగంలో ఎదు రయ్యే అత్యంత పెద్దసవాళ్లలో ఒకటిగా పేర్కొం ది. ఒక పెద్దఉద్యోగ అవకాశాన్ని కల్పించే రంగం అయినప్పటికీ, మహిళల కోసం అత్యంత సరి హద్దులు ఉన్న రంగంగా రియల్ ఎస్టేట్ అంగీ కరించింది. లింగ వివక్షతను పరిష్కరించడం వల్ల పెద్ద ఆర్థిక ప్రయోజనాలను పొంద వచ్చని తెలిపింది. ఇది ప్రొడెక్టివిటీని, ఆవిష్కరణను లాభాదాయ కతను పెంచుతుందని నివేది క పేర్కొంది. ఇక రియల్ ఎస్టేట్ రంగం కీలకమైన సవాళ్ల ను కూడా ఎదుర్కొంటుంది. ప్రత్యే కంగా లింగ వివక్షత సంబంధిత సమస్యలతో పాటు ఈ రంగంలో సుమా రు 71 మిలియన్ కార్మికులు పని చేస్తున్నప్పటికీ వాటిలో కేవలం 7మిలియన్ మాత్రమేఉన్నారు. దీనివల్ల మహిళా శ్రమ వ్యవస్థలో పాల్గొనే రేటు 25.1 శాతం మాత్రమే ఉన్నట్లు రిపోర్టులో వెల్లడించింది. మహిళల కోసం ప్రత్యేకమైన స్కిల్స్ అభి వృద్ధి, శిక్షణ కార్య క్రమాలను ఏర్పాటు చేయాల్సిన అవసరంఉందని రిపోర్టు సూచించింది. అలాగే సాంకేతికతలో సమగ్రత, నాయకత్వపాత్రలపై మహిళలకు అవ కాశాలు కల్పించడం ఈమార్పు సాధిం చడంలో కీలకపాత్ర పోషి స్తుందని పేర్కొంది.

## ఫండ్స్‌లో రకాలెన్నో..

**ముంబై, జనవరి 26:** స్టాక్ మార్కెట్‌లో నేరుగా పెట్టబడి పెట్టడానికి అనుభవం లేనివారు వీటిలో డబ్బులను ఇన్వెస్ట్ చేయవచ్చు. లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ అనే మూడు రకాల మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టవచ్చు. వీటి మధ్య తేడాలు, ఇతర అంశాలను తెలుసుకుందాం. సాధారణంగా ఒక కంపెనీ విలువను స్టాక్ మార్కెట్ నిర్ణయిస్తుంది. దాని ఆధారంగా స్టాక్ మార్కెట్ లో లిస్టు చేసిన కంపెనీలను లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ లుగా నిర్ణయిస్తారు.లార్జ్ క్యాప్ ఫండ్స్ మార్కెట్ విలువ ఆధారంగా స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసిన టాప్ 100 కంపెనీలను లార్జ్ క్యాప్ కంపెనీలుగా నిర్ణయిస్తారు. వీటిలోని స్టాక్‌లను కొనుగోలు చేసే మ్యూచువల్ ఫండ్స్‌ను లార్జ్ క్యాప్ ఫండ్స్ అని పిలుస్తారు. బ్లూచిప్ స్టాక్స్ అని పిలిచే ఈ ఫండ్స్ మంచి ట్రాక్ రికార్డు కలిగి ఉంటాయి వీటి మార్కెట్ విలువ సుమారు రూ.20 వేల కోట్లకు పైగా ఉంటుంది. మిడ్ క్యాప్ ఫండ్స్ మార్కెట్ విలువను పరిగణనలోకి తీసుకుని టాప్ 100 నుంచి 250 కంపెనీలను మిడ్ క్యాప్ కంపెనీలు అంటారు. వీటిలో పెట్టుబడి పెట్టే మ్యూచువల్ ఫండ్స్‌ను మిడ్ క్యాప్ ఫండ్స్ అంటారు. అయితే లార్జ్ క్యాప్ కన్నా వీటిలో పెట్టుబడులకు కొంచెం రిస్కు ఎక్కువే. స్మాల్ క్యాప్ ఫండ్స్ మార్కెట్ విలువ ఆధారంగా 251వ నంబర్ నుంచి మిగిలిన కంపెనీలను స్మాల్ క్యాప్ కంపెనీలు అంటారు. వీటి స్టాక్‌లను కొనుగోలు చేసే మ్యూచువల్ ఫండ్స్‌ను స్మాల్ క్యాప్ ఫండ్స్ అంటారు. వీటి మార్కెట్ విలువ రూ.5 వేల కోట్ల లోపు ఉంటుంది. ఈ కంపెనీలకు పెద్దగా ట్రాక్ రికార్డు ఉండదు.

## కాఫీ ఎగుమతులు హైజంప్

**న్యూఢిల్లీ, జనవరి 26:** వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, భారతదేశం ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఏడో అతి పెద్ద కాఫీ ఉత్పత్తిదారుగా ఉంది. దీని ఎగుమతులు 2024 ఆర్థిక సంవత్సరంలో 1.29 బిలియన్‌డాలర్లకు చేరుకున్నాయి. 2020-21లో జరిగిన 719.42 మిలియన్ల డాలర్లతో పోల్చితే ఇవి దాదాపు రెట్టిం పు అయ్యాయి. మన కాఫీఉత్పత్తిలో దాదాపు మూడు వంతు లు అరబికా, రోబస్టాబీన్స్ ఉంటున్నాయి. ఇవి కాల్చని బీన్స్‌గా ఎగుమతి అవుతాయి. అయితే కాల్చిన, తక్షణ కాఫీ తదితర విలువ ఆధారిత ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతోంది. మన దేశంలో కాఫీ విని యోగం క్రమంగా పెరుగుతోంది. 2012 లో 84 వేల టన్నులు ఉండగా, అది 2023 నాటికి 91 వేల టన్నులకు చేరింది. అలాగే కాఫీని ఉత్పత్తి చేసేరాష్ట్రాల్లో కర్ణాటక ముందంజ లో నిలిచింది. అక్కడ 2022-23లో 248.020 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి జరిగింది. ఆ తర్వాతి స్థానాల్లో కేరళ, తమిళనాడు నిలిచాయి. ఇంటిగ్రేటెడ్ కాఫీడెవలప్మెంట్ ప్రాజెక్టు (ఐసీడీపీ) ద్వారా కాఫీ సాగు విస్తరణకు, దిగుబడి పెంచడానికి, రైతులకు అవగాహన కల్పించ డానికి ప్రభుత్వం



చర్యలు తీసుకుం టోంది. సాంప్రదాయేతర ప్రాంతాలలో సాగును విస్తరించడం, సాగును ప్రోత్సహించడం వంటి విషయాల్లో చాలా కీలకంగా వ్యవహరిస్తోంది. అరకు లోయలో పెరిగిన కాఫీ ఉత్పత్తి దీని ప్రధాన విజయంగా చెప్పుకోవచ్చు. అక్కడ కాఫీ బోర్డు, ఇంటిగ్రేటెట్ ట్రైబల్ డెవలప్మెంట్ ఏజెన్సీ (ఐటీడీఏ) సహకారంతో 1.50 లక్షల గిరిజన కుటుంబాలు కాఫీఉత్పత్తిని 20శాతం పెంచాయి. అంతర్జాతీయంగా కాఫీ ఎగుమతులను ప్రోత్సహించడానికి ప్రభు త్వం వివిధ రకాల చర్యలు తీసుకుంటోంది. అమెరికా, కెనడా, జపాన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షి ణ కొరియా, ఫిన్ లాండ్ తదితర దేశాలపై వ్యాపారానికి వీలుగా కొన్ని రాయితీలు కల్పిస్తోంది. మన రాష్ట్రంలో అరకు కాఫీకి ఎంతో ప్రత్యే కత ఉంది. అరకు లోయలోనే గిరిజ నులు దీన్ని సాగు చేస్తారు. 2018లో పారిస్ లో జరిగిన పోటీలో అరకు కాఫీకి బంగారు పతకం దక్కింది. దీనికి ఇంటర్నేషనల్ బ్రాండ్‌గా గుర్తింపు వచ్చింది. అరకు కాఫీని రుచి చాలా అద్భు తంగా ఉంటుంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.